fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 58 | విజయవాడ, బుధవారం 28 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00













మోడీ సర్కారుకు తగ్గుతున్న ఆదరణ

- కష్టాలతో ప్రజలు సతమతం
- సిఎస్‌డిఎస్ సర్వే నిర్ధారణ



న్యూఢిల్లీ: నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వానికి ప్రజానీకంలో ఆదరణ పెద్దఎత్తున తగ్గుతోందని సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సిఎస్‌డిఎస్) సంస్థ పేర్కొంది. ఈ సంస్థకు చెందిన లోక్‌నీతి రిసెర్చ్ ప్రోగ్రామ్‌కు చెందిన కొందరు పరిశోధకులు ఒక మీడియా సంస్థ సహకారంతో జాతీయ స్థాయిలో నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. సిఎస్‌డిఎస్ వెల్లడించిన వివరాల ప్రకారం 2014లో యుపిఎ -2 ప్రభుత్వం పై ఉన్న వ్యతిరేకత కన్నా ప్రస్తుతం నరేంద్రమోడీ సర్కారుపై ప్రజల అసంతృప్తి ఎక్కువగా ఉంది. నోట్ల రద్దు, జిఎస్‌టి తదితర మిగతా 9లో



ప్రమాదవశాత్తూ నీట మునిగి...

- శ్రీదేవి మరణంపై దుబాయ్ పోలీసులు
- కేసు ముగించినట్లు ప్రకటన
- నేడు అంత్యక్రియలు

దుబాయ్: ప్రముఖ సినీనటి శ్రీదేవి ప్రమాదవశాత్తు నీట మునగడం వల్లే మృతి చెందారని దుబాయ్ పోలీసులు నిర్ధారించారు. వివిధ కోణాల్లో నిర్ధారించుకున్న తరువాత పబ్లిక్ ప్రాసిక్యూషన్ విభాగం ఈ నిర్ధారణకు వచ్చినట్లు వారు తెలిపారు. శ్రీదేవి మృతిపై అనుమానాలు తొలగిపోవడంతో ఆమె భౌతిక కాయాన్ని మంగళవారం సాయంత్రం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎంబామింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత ఆస్పత్రి నుండి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో అంతర్జాతీయ విమానాశ్రయానికి, అక్కడి నుండి ప్రత్యేక విమానంలో ముంబాయికి తరలించారు. నేడు ముంబాయిలో మిగతా 9లో

ఎగవేతలన్నీ ప్రైవేటోళ్లవే!

ఎస్‌బిఐ చీఫ్ రజ్నీష్ కుమార్



'బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండి బకాయిలన్నీ ప్రైవేటోళ్లవే! ఒక్క ప్రభుత్వ రంగ సంస్థ కూడా అప్పులు ఎగ్గొట్టిన దాఖలాలు లేవు.' అని ఎస్‌బిఐ చీఫ్ రజ్నీష్ కుమార్ అన్నారు. ఎకనామిక్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించాలంటూ కొద్ది రోజులుగా వస్తున్న వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. 'అప్పులు ఎగ్గొట్టే వాళ్లే ముందు వరుసలో కూర్చొని నీతి సూత్రాలు వల్లిస్తున్నారు. దొంగలే దొంగా... దొంగా అని అరుస్తున్నట్లుగా వారి వ్యవహారముంది. ప్రైవేటు రంగంలో పాలనా విధానాలు బాగుంటే అప్పులు ఎందుకు ఎగవేస్తున్నాయి? దివాళా ఎందుకు తీస్తున్నాయి?' అని ప్రశ్నించారు. సమాజ శ్రేయస్సు కోసం సామాజిక స్పృహతో ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రమే పని చేస్తాయని ఆయన చెప్పారు.

ఇంటర్వ్యూ పూర్తి వివరాలు 6లో

హోదాతో అదనంగా వచ్చేదేమిటీ



- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- రాష్ట్రంలో బిజెపి, కాంగ్రెస్ లేవు
- స్వశక్తితో పెట్టుబడులొచ్చాయి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హోదా వల్ల అదనంగా వచ్చేదేమిటని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. ఫలానావి వస్తాయని జిఒ ఏమైనా ఉందా ? ఉంటే ఇవ్వాలని తాము అడుగుతున్నామని తెలిపారు. అయినా కేంద్రం ఇస్తానంది కాబట్టి హక్కుగా అడుగుతున్నామన్నారు. రాష్ట్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు లేవని, ఇక్కడ రాజకీయాలు చేయాలనకుంటే కుదరదని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఉండవల్లిలో సిఎం నివాసం దగ్గరున్న గ్రీవెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఐఐ భాగస్వామ్య సదస్సులో వచ్చిన పెట్టుబడులను వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ బిజెపి రాష్ట్రపార్టీ అధ్యక్షులు హరిబాబు స్పెషల్ స్టేటస్‌పై మాట్లాడుతున్నారని, రాష్ట్రంపై ఆరోపణలు చేస్తున్నారని, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నాయకుడు కూడా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కేంద్రం హోదా ఇస్తానందని, సహకరించాలని కోరారు. హోదా ఇవ్వకపోయినా చేతులు ముడుకు కూర్చొని బీద అరుపులు అరిచే వ్యక్తిని కాదని తెలిపారు. తెలివితేటలను ఎవరూ తక్కువ చేయలేరని వ్యాఖ్యానించారు. అయినా హోదా పేరుతో కొంతమంది ఆందోళనలు చేస్తున్నారని, దీనివల్ల పెట్టుబడులు పెట్టేవారు వెనక్కి వెళ్లిపోతారన్నారు. హోదా వల్ల పరిశ్రమలకు కలిగే ఉపయోగం ఏమిటో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. హోదా ఇస్తే రూ.20 వేల కోట్లు వచ్చే అవకాశం ఉందని, పోలవరానికే రూ.40 వేల కోట్లు కావాల్సి ఉందన్నారు. అలాగే రాజధాని అభివృద్ధికి నిధులు కావాల్సి ఉందన్నారు. హోదా ఇతర రాష్ట్రాలకు ఇవ్వడం లేదంటేనే తాము ప్యాకేజీకి అంగీకరించామని, ఇప్పుడు ఇతర ప్రాంతాలకు ఇస్తున్నారని, అందువల్ల తామూ ఇవ్వాలని కోరుతున్నామని చెప్పారు. బిజెపి రాజకీయం కోసం ఇక్కడ డిక్లరేషన్లు ప్రకటిస్తే కుదరదని, ప్రజలను మభ్యపెట్టే పనులు చేయకూడదన్నారు. గత రెండు రోజులుగా జరిగిన సమ్మిట్లో రూ.4.39 లక్షల కోట్ల పెట్టుబడులొచ్చాయన్నారు. సిఆర్‌డిఏ పరిధిలోనే రూ.49,643 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు మిగతా 9లో

ప్రధాని పెదవి విప్పాలి

కాంగ్రెస్ డిమాండ్

బెంగళూరు : దేశంలో గడిచిన 10 రోజుల్లో రూ.31,691 కోట్ల ప్రజాధనం లూటీ అయ్యిందని, దీనికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మంగళవారం డిమాండ్ చేసింది. అవినీతి గురించి మోడీ మాట్లాడటంలోని విశ్వసనీయతను ప్రశ్నించింది. నిరవ్ మోడీ, మెహుల్ చోక్సీలు దాదాపు 30 బ్యాంకులను మోసగించి రూ.22,606 కోట్లు దోచుకున్నారని, మోసపూరిత గోల్డ్ స్కీమ్‌ల ద్వారా సామాన్య ప్రజలకు చెందిన రూ.5 వేల కోట్లు దోపిడికి గురయ్యాయని కాంగ్రెస్ పేర్కొంది. ఎఐసిసి ప్రతినిధి రణదీప్ సింగ్ సూర్జేవాల మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఇదంతా "దోచుకో-పారిపో(లూట్ అండ్ ఎస్కేప్)" పేరుతో జరుతున్న కథ అని చెప్పారు. మోడీ ప్రభుత్వ హయాంలో బ్యాంకింగ్‌రంగంలోని అన్ని వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని ఆయన విమర్శించారు. ప్రమాదాల నిర్వహణ, మోసాల గుర్తింపు, నియంత్రణా యంత్రాంగం తదితర వ్యవస్థలన్నీ నిస్సత్తువగామారాయన్నారు. 'మోసగించడం., దోచుకోవడం, పారిపోవడం' అనేవి మోడీ సర్కార్ హయాంలో సాధారణంగా మారాయని వ్వాఖ్యానించారు. ఆశ్రిత పక్షపాతం, అవినీతి కుంభకోణాల సంస్కృతి బిజెపి పాలనలో విజృంభించిందన్నారు. ప్రధాన మంత్రి కార్యాలయం(పిఎంఒ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, మహారాష్ట్ర, గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వాలకు తెలిసే నిరవ్ మోడి, చోక్సీల కుంభకోణం వెలుగుచూసిందన్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి వారందరి వద్ద సమగ్రమైన ఫిర్యాదులున్నాయని, అయినా వారు ఇప్పటి వరకు ఎటువంటిచర్యలు తీసుకోలేదని సూర్జేవాలా విమర్శించారు.

గత నాలుగేళ్లుగా ఏం చేశారు?

పిఎన్‌బి స్కామ్‌పై షాట్'గన్'

పాట్నా: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)లో వెలుగు చూసిన భారీ కుంభకోణానికి ఆడిటర్లు, నియంత్రణా వ్యవస్థలే బాధ్యులంటూ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ చేసిన వ్యాఖ్యలను బిజెపి ఎంపి శత్రుఘ్నసిన్హా తప్పుపట్టారు. 'కనీసం పూ్యన్లనయినా వదిలారు.. థాంక్స్..!' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. బ్యాంకు ఆడిటింగ్, నియంత్రణా వ్యవస్థలు తమ పనులను క్యాజువల్‌గా చేసుకెళ్లిపోతున్నాయి తప్ప అక్రమాలపై దృష్టి సారించటం లేదంటూ అరుణ్‌జైట్లీ చేసిన వ్యాఖ్యలపై శత్రుఘ్న సిన్హా మంగళవారం స్పందించారు. సారథ్యం వహించేవారికే అభినందనలు, అభిశంసనలు వస్తాయన్నారు. 'ప్రతి అక్రమానికి నాటి కాంగ్రెస్ దుష్పరిపాలనే కారణమని మిగతా 9లో

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



- 10,26,891 మంది దరఖాస్తు
- ర్యాంకుల స్థానంలో గ్రేడులు
- పరీక్షా కేంద్రాల్ని గుర్తించేందుకు యాప్
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్
- అరగంట ముందే చేరుకోవాల్సిందే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియేట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 19 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇంటర్మీడియేట్ బోర్డు పూర్తిచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 10,26,891 మంది పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు. మొదటి సంవత్సరానికి 5,09,898 మంది, ద్వితీయ సంవత్సరానికి 5,16,993 మంది హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,423 కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. సమస్యాత్మకంగా ఉన్న 116 కేంద్రాల్లో సిసి కెమెరాల్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. అరగంట ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, 9గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఇంటర్మీడియేట్ కమిషనర్ ఇప్పటికే వెల్లడించారు. ఈ ఏడాది ర్యాంకులు కాకుండా గ్రేడుల విధానంలో ఫలితాల్ని విడుదల చేయనున్నారు. మొదటి ఏడాది ఫలితాల్లోనే ఈ విధానం మిగతా 9లో



మేఘాలయలో 67, నాగాలాండ్‌లో 75 శాతం

- రెండు రాష్ట్రాల్లో 59 నియోజక వర్గాలకు ఎన్నికలు
- సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన పోలింగ్
- నాగాలాండ్‌లో స్వల్ప ఘర్షణ, ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు
- రెండు రాష్ట్రాల్లోనూ కేంద్ర బలగాల భారీ బందోబస్తు

షిల్లాంగ్ : నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల అసెంబ్లీలకు మంగళవారం ఎన్నికలు జరిగాయి. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి నాగాలాండ్‌లో రికార్డు స్థాయిలో 75 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా, మేఘాల యలో 67 శాతం మంది ఓటు చేశారు. రెండు రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ 60 స్థానాలు చొప్పున ఉండగా, ఒక్కో మిగతా 9లో

నేడు డిస్కంల ముట్టడి

విద్యుత్ కార్మికుల ఐక్యవేదిక



గుంటూరు కలెక్టరేట్ నుంచి ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ కార్మికులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెను మరింత ఉధృతం చేసే క్రమంలో బుధవారం తిరుపతి, విశాపట్టణంలోని డిస్కంల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎపి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదిక తెలిపింది. కార్మికులంతా పాల్గొని ఈ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపుచ్చింది. ఈ మేరకు ఐక్య వేదిక ఛైర్మన్ పి.కాశీమధుబాబు, సెక్రెటరీ జనరల్ ఎం.బాలకాశీ, వైస్ ఛైర్మన్ వి.గంగయ్య, కన్వీనర్ ఎస్.వి రమణమూర్తి, కో కన్వీనర్ వి.వి సురేష్‌లు సంయుక్తంగా మంగళవారం ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఈ నెల 19, 20 తేదీల్లో రెండు పర్యాయాలు చర్చలు జరిపినా స్పష్టమైన హామీ ఇవ్వలేదని పేర్కొన్నారు. దీంతో సమ్మె కొనసాగుతోందని, అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు సమ్మెకు తమ మద్దతు తెలుపుతున్నాయని చెప్పారు. మంగళవారం నాటికి సమ్మె ఎనిమిదవ రోజుకు చేరిందని, కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు సిఇఓ

: ప్రశాంత్ నంది చౌదురి

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వ్యవహరించడం లేదని, సంస్థకు సిఇఒ తరహాలో వ్యవహరిస్తున్నారని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ నంది చౌదురి అన్నారు. విద్యుత్ కార్మికుల సమ్మెలో భాగంగా విజయవాడ ధర్నా చౌక్‌లోని సమ్మె శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌహతిలో జరిగిన అన్ని రాష్ట్రాల విద్యుత్ ఉద్యోగ సంఘాల సమావేశంలో ఏపీలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె అంశంపై చర్చించామని, సమ్మెకు అన్ని సంఘాలూ పూర్తి మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ ఇంజనీర్ల సంఘం ఈ అంశంపై ఇప్పటికే ఆశాఖ కేంద్ర మంత్రికి లేఖ రాసిందన్నారు. బ్యాంక్ ఉద్యోగ సంఘాలు కూడా సమ్మెకు మద్దతు తెలిపాయన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యుఇఇయు) రాష్ట్ర అధ్యక్షులు డి.సూరిబాబు మాట్లాడుతూ ఈ పోరాటంలో అంతిమ విజయం కార్మికులదేనన్నారు. తిరుపతిలో బుధవారం జరిగే ఎస్పీడీసీఎల్ ముట్టడిలో ఇఇఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ నంది చౌదరితోపాటు తమిళనాడుకు చెందిన విద్యుత్ ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటార న్నారు. తెలంగాణా విద్యుత్ సంస్థల్లో కార్మికుల క్రమబద్ధీకరణకు చేసిన పోరాటాన్ని టిఎస్ యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు వివరించారు. సమ్మెకు మద్దతు తెలిపారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి పోలారి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.వెంక టేశ్వరరావు, దళిత, గిరిజన సంరక్షణ రాష్ట్ర అధ్యక్షులు బందెల కిరణ్‌రాజు తదితరులు సమ్మె శిబిరాన్ని సందర్శించి కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు.

హెలికాప్టర్‌లో పొగలు

కెసిఆర్‌కు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కరీంనగర్ జిల్లా పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం కేసీఆర్‌కు ప్రమాదం తప్పింది. మంగళవారం కరీంనగర్‌లోని నివాసం నుంచి పెద్దపల్లికి బయల్దేరే సమయంలో హెలికాప్టర్‌లోని కిట్‌బ్యాగ్‌లో పొగలు రావడం కలకలం రేపింది. సరిగ్గా సీఎం ఎక్కే సమయంలో వైర్‌లెస్ సెట్ ఉన్న బ్యాగులో పొగలు వచ్చి క్యాబిన్‌అంతటా వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ బ్యాగును బయటకు తీసి దూరంగా పడేశారు. బ్యాటరీ ఓవర్ హీట్ కావడంతో బ్యాగ్ నుంచి అకస్మాత్తుగా పొగలు వెలువడినట్టు అధికారులు గుర్తించారు. అయితే ఈ ఘటనపై మంత్రి కేటీఆర్ అధికారులతో చర్చించి విచారణకు ఆదేశించినట్టు తెలిసింది. మరోవైపు మంగళవారం ఆదిలాబాద్ డైట్ కాలేజీలో ఏర్పాటు చేసిన సభ వద్ద అనుమానాస్పదంగా ఓ పూలకుండీ కనిపించడంతో బాంబుస్క్వాడ్ దాన్ని బయటకు తీశారు.



9

సిరియా సైన్యానికి లొంగిపోతున్న రెబల్స్

25 మంది పౌరులను పొట్టనపెట్టుకున్న అమెరికా దళాలు

గ్రూప్-2 ఎగ్జిక్యూటివ్ ఫలితాలు విడుదల

త్వరలో నాన్ ఎగ్జిక్యూటివ్ ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-2 ఎగ్జిక్యూటివ్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ మేరకు ఏపీపీఎస్సీ ఫలితాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. దీంతో పాటు డిగ్రీ లెక్చరర్లు, ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టికల్ సర్వీస్ పోస్టుల పలితాలను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. 982 పోస్టులతో 2016లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలైంది. గతేడాది ఫిబ్రవరిలో ప్రిలిమ్స్, మే నెలలో మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. డిసెంబర్‌లో మెరిట్ లిస్ట్‌ను ప్రకటించిన ఏపీపీఎస్సీ గత నెలలో ధ్రువపత్రాల్ని పరిశీ లించి తుది ఫలితాల్ని విడుదల చేసింది. నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల ఫలితాలపై కసరత్తు జరుగుతోందని, త్వరలోనే తుది ఫలితాలు విడుదల చేస్తామని ఏపీపీఎస్సీ ప్రకటించింది.



సంక్షేమం

వికలాంగుల సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షిం చేందుకు రాష్ట్రానికి వచ్చిన వికలాంగుల జాతీయ కమిషన్ చీఫ్ కమిషనర్ కెకె పాండే సచివాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు

రాష్ట్రంలో వికలాంగుల శాఖను పటిష్టపరచాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని, ఆ శాఖను పటిష్ట పరచాలని వికలాంగుల జాతీయ కమిషన్ చీఫ్ కమిషనర్ (సిసిపిడి) కమలేష్ కుమార్ పాండే సూచించారు. వికలాంగుల సంక్షేమ పథకాల అమలు తీరును పర్యవేక్షించేందుకు రాష్ట్రానికి వచ్చిన ఆయన మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. విశాఖ సదస్సు కారణంగా ఈ సారి పర్యటనలో అధికారులు అందుబాటులో లేరని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఈ శాఖకు కమిషనర్, ఇతర సిబ్బందిని నియమించాలన్నారు. దేశంలో 2.6 కోట్ల మంది వికాలంగులున్నారని, వారి సంక్షేమం, హక్కుల కోసం జాతీయ కమిషన్, రాష్ట్ర శాఖలు పనిచేస్తున్నాయని చెప్పారు. ఏపిలో 10 లక్షల మందివికలాంగులకు ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇచ్చామని, భవిష్యత్తులో వాటిని ఆన్‌లైన్‌లో జారీ చేస్తామన్నారు. వికలాంగులకు సంబంధించిన ఎన్జీఓలకు కేంద్రం రూ 6 కోట్లు మంజూరు చేసిందని,ఇతర రాష్ట్రాల మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం కూడా వారికి నిధులు మంజూరు చేయాలని సూచించారు. వికలాంగుల చీఫ్ కమిషనర్ కార్యాలయంలో గత పదేళ్ల నుంచి దాదాపు 35 వేల ఫిర్యాదులు నమోదైతే వాటిలో సుమారు 33 వేలు పరిష్కరించామని కెకె పాండే వివరించారు. వారికి ప్రత్యేక గుర్తింపు కార్డు పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం కింద కొంతమందికి పలు అంశాల్లో శిక్షణ ఇస్తారని చెప్పారు. చిన్నారుల్లో వినికిడి సమస్య పరిష్కారానికి కాక్లియా అమరిక పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఒక్కో కాక్లియా అమరికకు రూ 6 లక్షలు ఖర్చవుతుందన్నారు. అలాంటి పథకం రాష్ట్రంలో కూడా ప్రవేశపెట్టాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలోని ఏదైనా విశ్వవిద్యాలయంలో వికలాంగులకు ఒక శాఖ ఏర్పాటు చేయాలన్నారు. అంగవైకల్యం ఉన్న పిల్లల్ని సాధారణ పాఠశాలలో చేర్చుకునేందుకు నిరాకరిస్తే నేరంగా పరిగణిస్తామన్నారు. వికలాంగుల సమస్యల్ని పరిష్కరించేందుకు ఆయా రాష్ట్రాల కమిషనర్లతో కలసి జాతీయ చీఫ్ కమిషనర్ మొబైల్ కోర్టులు నిర్వహిస్తుంటారని తెలిపారు.



పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రెండురోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని మంగళవారం విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గతేడాది ఈ కాలానికి ఎండలు సాధారణ స్థితిలో ఉండగా, రెండు రోజులుగా ఎండలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు అధికంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రమంతటా పొడివాతావరణమే కొనసాగుతుందని వెల్లడించారు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. దేశంలో తొలి ట్రామ్ తరహా ట్రాలీ ఎక్కడ ప్రారంభించనున్నారు?
2. 'శ్రమ్' పురస్కారాలు ఎవరికి ప్రదానం చేస్తారు ?
3. స్ట్రాండ్‌జా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో 'బెస్ట్ బాక్సర్' పురస్కారం ఎవరికి లభించింది?
4. ఆస్ట్రియా బ్యాడ్మింటన్ ఓపెన్ - 2018 విజేత?
5. ఘంటా చక్రపాణికి తెలుగు వర్సిటీ సాహిత్య పురస్కారం ఏ రచనకు లభించింది?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

హోదా కోసం నిరసన

- విజయవాడ రేడియో స్టేషన్ వద్ద వామపక్షాల పికెటింగ్ - అరెస్టు
- అక్రమ అరెస్టులను ఖండించిన సిపిఎం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి/అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదాను వెంటనే ఇవ్వాలని, విభజన హామీలనూ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం.,సిపిఐ విజయవాడ నగర కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రేడియో స్టేషన్ వద్ద పికెటింగ్ నిర్వహించారు. పికెటింగ్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలను ఎసిపి శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు 150 మందిని అరెస్టు చేసి కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అరెస్టయిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు, నగ నాయకులు డి కాశీనాధ్, డి.విష్ణువర్ధన్, యువి రామరాజు, సూరిబాబు, బి నాగేశ్వరరావు, కార్పొరేటర్ జి ఆదిలక్ష్మి, సిపిఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, సహాయ కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కుర్రా శివకుమార్, దుర్గారావు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంగన్న, మహిళా నాయకురాలు మైనంపాటి సుబ్బలక్ష్మి, వరలక్ష్మి, మహిళా సమాఖ్య నాయకులు పంచదార్ల దుర్గాంబ, దుర్గాభవానీ, ఐద్వా నాయకురాలు శ్రీదేవి తదితరులున్నారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు నియోజకవర్గాల పెంపుపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర ప్రయోజనాలపై లేదన్నారు. విభజన చట్టంలోని వెనుక బడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక



పికెటింగ్ నిర్వహిస్తున్న నాయకులు

ప్యాకేజీ ఇస్తామని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తామని, ఏపికీ రైల్వేజోన్ ఇస్తామని ప్రకటించిన బిజెపి ప్రస్తుత బడ్జెట్‌లో ఏ ఒక్క అంశాన్నీ ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. సిపిఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ ఏపికి ప్రత్యేక హోదా కల్పిస్తామని చెప్పిన ప్రధాని మోడీ మాటమార్చి పిడికెడు మట్టి, చెంబుడు నీళ్లతో రాష్ట్రాన్ని దగా చేశారన్నారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబులు దోబూచులాడుతున్నారని చెప్పారు.

అరెస్టులను ఖండించిన సిపిఎం

ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని ఆందోళన చేస్తున్న సిపిఎం.,సిపిఐ., ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి మధు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చట్ట ప్రకారం రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు, ఏర్పాటు చేయాల్సిన సంస్థలు విష యంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, కడప ఉక్కు, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల్ని తెలుగుదేశం ప్రభుత్వం పట్టించుకోకుండా కేంద్రంతో కొనసాగుతోందని విమర్శించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వైఖరులకు వ్యతి రేకంగా ఆలిండియా రేడియో కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారని వివరించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. వెంటనే వీరందరినీ విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించాలని ప్రజాతంత్రవాదుల్ని మధు కోరారు.

రేషన్ బియ్యం పక్కదారి పడితే కఠిన చర్యలు : పుష్పరాజ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రేషన్ బియ్యం పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ జెఆర్ పుష్పరాజ్ హెచ్చరించారు. విజయవాడలో మంగళవారం రాష్ట్ర ఆహార కమిషన్ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు ప్రాంతాల్లో రేషన్ షాపులు, ఎమ్ఎల్ఎస్ పాయింట ద్వారా బియ్యం మళ్లింపు, అర్హులకు అందకపోవడం, పలువురు ప్రజాపంపిణీని వినియోగించుకోకపోవడం తదితర విషయాలపై చర్చించారు. ఇటీవల నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో 25 శాతం మంది లబ్ధిదారుల ఆచూకీ లభించకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. చనిపోయిన వారి వివరాల్ని పౌరసరఫరాల శాఖ రిజిస్టర్ నుంచి తొలగించలేదన్నారు. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకంలోని అవకతవకలపై తీవ్ర స్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు. సిఎమ్ఆర్ బియ్యానికి సంబంధించి రూ.95 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. వీటిని రాబట్టడానికి చర్యలు తీసుకోవడంలేదన్నారు. దీనిని సుమోటోగా స్వీకరించి మిల్లర్లకు త్వరలో సమన్లు జారీ చేసి , కేసులు పెడతామన్నారు. పిడిఎస్ నియంత్రణా చట్టంలో కొన్ని సవరణలు చేయనున్నామన్నారు. తూనికలు కొలతల చట్టంలో చేసిన మార్పులపై దుకాణాల్లో సైన్‌బోర్డుల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సుబాబుల్ రైతులకు ఆన్‌లైన్‌లో చెల్లింపులు

మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సుబాబుల్ రైతులకు ఇక నుంచి ఆన్‌లైన్‌లో చెల్లించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. సచివాలయంలో మంగళవారం సుబాబుల్ రైతుల సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జీవో నెంబరు 31 ప్రకారం సుబాబుల్ టన్నుకు రూ.4200, జామాయిల్ రూ.4400కు కొనుగోలు చేసేందుకు నికర ధరను తేల్చి మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు తెలియజేయాలన్నారు. జీవోలో పొందుపరిచిన విధంగా ప్రతి జిల్లా నుంచి కొనాల్సిన కర్ర మొత్తం, నిర్ణయించిన కొనుగోలు నిష్పత్తి తప్పనిసరిగా అనుసరించాలని యాజమాన్యాలను ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల్ని సాగుచేసే విధంగా రైతులను చైతన్యవంతుల్ని చేయాలని విస్తరణ విభాగాన్ని కోరారు. బిల్ట్ ట్రీ లిమిటెడ్ రైతులకు చెల్లించాల్సిన రూ. 40 కోట్లకు సంబంధించి షెడ్యూల్ తెలియజేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణ రెడ్డి, అటవీ శాఖ మంత్రి సిద్దా రాఘవరావు, మార్కెటింగ్ శాఖ కమిషనర్ శ్యాముల్ ఆనంద్, రైతు సంఘాల నాయకులు, పేపరు మిల్లు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'వేదాంత'తో చంద్రబాబు దొంగచాటు ఒప్పందం

- రూ.21,500 కోట్లతో మూడు ప్రాజెక్టులకు ఎంఒయు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

హిందుస్థాన్ జింక్ ఇండస్ట్రీ (హెచ్‌జెడ్ఎల్)ను హస్తగతం చేసుకుని 2013లో మూసివేసి ఉద్యోగులను రోడ్డున పడేసిన స్టెరలైట్ (వేదాంత) కంపెనీ దొడ్డిదారిన ఎంఒయు కుదుర్చుకుంది. ఈ నెల 24 నుంచి 26 వరకూ ఎపిఐఐసి గ్రౌండ్స్‌లో జరిగిన సిఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు సోమవారం సాయంత్రం 4.30 గంటలకు పూర్తయింది. ఆ తరువాత చంద్రబాబు ఈ సంస్థతో ఎంఒయు కుదుర్చుకున్నారు. ఈ కంపెనీ సిఇఒ సునీల్ దుగ్గల్ తమ సంస్థ విశాఖలో రూ.21,500 కోట్లతో మూడు ప్రాజెక్టులను చేపట్టబోతుందని ప్రకటించారు.

వేదాంత కుదుర్చుకున్న ఒప్పంద వివరాలివీ..

హిందుస్థాన్ జింక్ లిమిటెడ్, స్టెరలైట్ పవర్, స్టెరలైట్ టెక్ ప్రాజెక్టుల సమాహారంగా రూ.21,500 కోట్లతో 15వేల మందికి ఉపాధి కల్పించేలా ఎంఒయు కుదుర్చుకుంది. గ్రీన్ ఫీల్డ్ స్మెల్టర్లు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కోసం 1,000 ఎకరాలను వేదాంత యాజమాన్యం కోరింది. రెండు చోట్ల ఈ భూమిని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు సదరు సిఇఒకు హామీ ఇచ్చారు. కాలుష్యం లేకుండా ప్లాంట్‌లో వాడే నీటిని డబుల్ ట్రీట్‌మెంట్ జరిగేలాగ చర్యలు తీసుకోనున్నట్లు సిఇఒ వెల్లడించారు. 350 ఎకరాల్లో సిటీ సెంటర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును విశాఖలో ఏర్పాటు చేసి దీంట్లో హోటళ్లు, ఆసుపత్రులు, టూరిజం ఆధారిత కార్యక్రమాలు చేపట్టే ఒప్పందం కుదిరింది. స్టెరలైట్ పవర్ కంపెనీ రూ.5వేల కోట్లతో విద్యుత్ సరఫరా ప్రాజెక్టుకు పెట్టుబడి పెట్టేందుకు, స్టెరలైట్ టెక్ టెక్నాలజీ బ్లూ ప్రింట్‌ను స్మార్ట్‌సిటీలైన అమరావతి, తిరుపతికి అందించేందుకుగానూ ఎంఒయు కుదిరింది. ప్రపంచంలోనే ఉత్తమ టెక్నాలజీ ప్యాకేజీలను స్టెరలైట్ కంపెనీ చూపేందుకు బ్లూ ప్రింట్‌ను ప్రభుత్వం ముందు ఉచ్చేందుకు అంగీకరించింది. ఈ ఎంఒయులో భాగంగానే ఎపి ఫైబర్‌గ్రిడ్‌ను కూడా స్టెరలైట్ సరఫరా చేసి ప్రభుత్వానికి అందజేయనుంది.

స్టెరలైట్ వేదాంత గత చరిత్ర ఇదీ!

1975లో విశాఖ గాజువాకలో హిందుస్థాన్ జింక్ పరిశ్రమ స్మెల్టర్ స్థాపించబడింది. దేశంలోనే జింక్ ఉత్పత్తి చేసే ఏకైక ప్రభుత్వరంగ పరిశ్రమ ఇది. బిజెపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ రెండు దఫాలుగా 71శాతం వాటాలను స్టెరలైట్ (వేదాంత) కంపెనీకి రూ.445 కోట్లకు అమ్మేశాయి. కంపెనీ వాస్తవ విలువ రూ.50వేల కోట్లకు పైగానే ఉంటుంది. సుమారు రూ.20వేల కోట్ల రిజర్వు నిధులు కూడా ఉన్నాయి. లాభాల్లో ఉండే ఈ పరిశ్రమ వాటాలను అమ్మేయడమే గాకుండా 2013లో ఈ యాజమాన్యం మూసేసింది. 4వేల మంది ఉద్యోగులు రోడ్డున పడ్డారు. కార్మికులకు ఎలాంటి సెటిల్‌మెంట్ చేయలేదు. జింక్ పరిశ్రమ భూమి 365 ఎకరాలను ఎకరా రూ.3 కోట్ల నుంచి రూ.5కోట్లకు అమ్మేసుకోవాలని స్టెరలైట్ కంపెనీ చూసింది. జింక్ యాజమాన్యం అప్పట్లో ఇక్కడి రైతులకు ఎకరాకి రూ.800 కంటే పరిహారం ఇవ్వలేదు. స్టెరలైట్ కంపెనీ తాజాగా భూమినంతటినీ హస్తగతం చేసుకుని రియల్ ఎస్టేట్‌గా మార్చుకోవడాన్ని రైతులు,ఉద్యోగులు అడ్డుకుంటున్నారు. ఈ దశలో సిఐఐలో ఎంఒయు కుదుర్చుకోవడంపై అంతటా చర్చ జరుగుతోంది.

అప్పుడు మీరే సీఎస్ కదా..?

స్విస్ చాలెంజ్ కేసులో ఐవైఆర్‌ను ప్రశ్నించిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

అమరావతి ప్రాంత అభివద్ధి కోసం స్విస్ ఛాలెంజ్ విధానాన్ని ఆమోదించినప్పుడు మీరే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.. ఇప్పుడు మీరే స్విస్ ఛాలెంజ్‌ను తప్పుపడుతూ ప్రజాహిత వ్యాజ్యాన్ని వేశారు.. ఈ వ్యాజ్యాం వెనుక మీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవా?.. దీనిపై మీరేమంటారు.. అని ఉమ్మడి హైకోర్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా చేసి పదవీ విమరణ చేసిన ఐవైఆర్ కష్ణారావును ప్రశ్నించింది. స్విస్ ఛాలెంజ్ విధానం సుప్రీంకోర్టు మార్గదర్శ కాలకు వ్యతిరేకమని, ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఎనేబలింగ్ చట్ట నిబంధనల ఉల్లంఘనని పేర్కొంటూ ఐవైఆర్ హైకోర్టులో దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం మంగళవారం మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ముందుకు విచారణకు వచ్చింది. స్విస్ ఛాలెంజ్ విధానాన్ని ఆమోదించి నప్పుడు ఏపీ సీఎస్‌గా మీరే ఉన్నారు కదా.. అప్పుడు ఆమోదం పొందినప్పుడు మీరు ఏవిధమైన అభ్యంతరాలు చెప్పకుండా పదవీ విరమణ చేశాక స్విస్ ఛాలెంజ్ విధానం కోసం ఇచ్చిన జీవోలు రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించాలని కోరడం వెనుక వ్యక్తిగత ప్రయోజనాలుండే అవకాశాలు లేవంటారా..అని బెంచ్ పిటిషనర్‌ను ప్రశ్నించింది. దీనిపై అనుబంధ పిటిషన్ దాఖలు చేస్తామని, అందుకు అనుమతివ్వాలని ఐవైఆర్ కష్ణా రావు కోరడంతో అందుకు బెంచ్ అనుమతి మంజూరు చేసింది. తొలుత కేసు విచారణకు రాగానే అడ్వకేట్ జనరల్ శ్రీనివాస్ కల్పించుకుని, స్విస్ ఛాలెంజ్ ఆమోదం తెలిపినప్పుడు సీఎస్‌గా ఐవైఆర్ ఉన్నారని, ఈ విషయాన్ని వ్యాజ్యంలో ఎక్కడా చెప్పలేద న్నారు. దీనిపై బెంచ్ వివరణ కోరడంతో కష్ణారావు అదనపు అఫిడవిట్ వేస్తా మని చెప్పడంతో కేసు విచారణ వచ్చే వారానికి వాయిదా పడింది. ఐవైఆర్ కష్ణారావే స్వయంగా కేసును వాదించుకున్నారు.

నెల రోజుల్లోగా పరిష్కరించాలి

సర్వే శాఖపై భారం పెరిగింది

రెవెన్యూశాఖ మంత్రి కెఇ కృష్ణమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భూమి సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోగా పరిష్కరించకపోతే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ శాఖ మంత్రి కెఇ కృష్ణమూర్తి హెచ్చరించారు. విజయవాడ జలవనరులశాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సర్వే శాఖ సమీక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత సర్వే శాఖపై పనిభారం పెరిగిందని, దీంతో ఆశించిన మేర పనిచేయడం లేదనే విమర్శ ఈ శాఖ పై ఉందన్నారు. జాబు చార్ట్ ప్రకారం సర్వేయర్లు పనిచేస్తూ విమర్శల్ని అధిగమించాలన్నారు. కాకినాడ, అడవివరం ప్రభుత్వ భూముల్ని ప్రయివేటు భూములుగా మార్చిన ఉదంతంపై ప్రభుత్వం ఇబ్బందులకు గురైందన్నారు. పట్టాదారు పాసు పుస్తకాల మంజూరు, మ్యుటేషన్, సబ్ డివిజన్ కోసం సర్వే తప్పనిసరి అని తహశీల్దార్లు చెబుతూ పాస్ పుస్తకాల మంజూరు నిలిపేస్తున్నారన్నారు. దీంతో నిర్దేశించిన లక్ష్యాన్ని ప్రభుత్వం చేరుకోలేక పోతోందన్నారు. సర్వే దరఖాస్తుల్ని సకాలంలో పరిష్కరించకపోవడానికి తహశీల్దార్లు, ఆర్‌డివోలు కూడా భాధ్యులేనన్నారు. జిల్లాల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు మండలాలకు వెళ్లి తహశీల్దార్ల సమక్షంలో సర్వేయర్ల పనితీరును సమీక్షించాలన్నారు. ప్రతి సర్వేయర్ పనితీరుపై జాయింట్ కలెక్టర్లకు వారం వారం రిపోర్టులు అందజేయాలన్నారు.

మత్స్య శాఖకు నాబార్డు రుణం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మత్స్య శాఖ ప్రాజెక్టుల నిర్మాణం, అభివృద్ధికి జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) రుణం మంజూరు చేసింది. మత్స్య, కార్మిక, ఉపాధి శాఖలు, ఇంటర్మీడియేట్ కమిషనరేట్‌లకు సంబంధించిన వివిధ ప్రాజెక్టుల నిర్మాణ నిమిత్తం రూ 95.195 కోట్లను గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి (ఆర్ఐడిఎఫ్) నుంచి రుణం మంజూరు చేస్తున్నట్లు నాబార్డు ఏపి సిజిఎం కె. సురేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం రుణంలో మత్స్య శాఖకు రూ 41.57 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. వాటిలో రూ 36.76 కోట్లు విజయవాడ పెనమలూరు వద్ద మత్స్య పరిశ్రమలో శిక్షణ ఇచ్చేందుకు గాను ఎన్టీఆర్ అడ్వాన్స్ పరిశోధన, శిక్షణ కేంద్ర నిర్మాణానికి మంజూరు చేశామని వివరించారు. ఫిషింగ్ పద్ధతులలో శిక్షణ ఇచ్చేందుకు చిత్తూరు జిల్లాలో మత్స్య శిక్షణా కేంద్ర నిర్మాణానికి రూ 1.42 కోట్లు, వాటితోపాటు మూడు బ్రూడ్ బ్యాంకులు, మత్స్యకారులు నివసించే గ్రామాలను కలిపేందుకు నాలుగు రోడ్డు ప్రాజెక్టులకు రూ 3.38 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

మార్చి1,2 తేదీల్లో విధుల బహిష్కరణ

ఉమ్మడి హైకోర్టు న్యాయవాదుల తీర్మానం

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయవాదులు మార్చి 1,2 తేదీల్లో విధుల్ని బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. హైకోర్టు ఆవరణలోని బార్ కౌన్సిల్ భవనం నుంచి మదినా భవనం వరకూ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తితోపాటు సగానికిపైగా ఉన్న న్యాయమూర్తులు (మొత్తం పోస్టులు 61) భర్తీ చేయాలని రెండు సంఘాలూ తీర్మానించినట్లు సంఘ అధ్యక్షులు ధనుంజయ, కనకయ్యలు తెలిపారు. 'ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పోస్టు 2015 నుంచి ఖాళీగా ఉంది. 61 న్యాయమూర్తుల పోస్టుల్లో సగం ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయకపోగా 2012లోపు దాఖలైన కేసుల్ని పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలి. హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్‌ను నెలకొల్పాలి. సీఆర్‌పీసీ సెక్షన్ 41ఎ సెక్షన్‌కు సంబంధించి కేంద్రంతోపాటు రెండు తెలుగు రాష్ట్రాలు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి. ఈ ఆందోళనల తర్వాత సుప్రీంకోర్టు, కేంద్ర సర్కార్‌ల నుంచి చర్యలు లేకపోతే తమ తదుపరి ఆందోళనను పక్షం రోజుల తర్వాత వెల్లడిస్తాం' అని వారు తెలిపారు.

ప్రత్యేకం

పెట్టుబడులపై జిఎస్‌టి పోటు

- తగ్గనున్న పన్ను ప్రోత్సాహకాలు
- పరిస్థితిపై కేంద్రం ఆరా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పెట్టుబడిదారులపై జిఎస్‌టి పిడుగు పడుతోంది. పెట్టుబడిదారులకు అందించే వివిధ ప్రోత్సాహకాల్లో పన్నుల విభాగంలో షాక్ తగులుతోంది. పన్ను ప్రోత్సాహకంలో దాదాపు 80 శాతం వరకు తగ్గిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రోత్సాహకాల్ని ఆశిస్తూ పెట్టుబడులు పెట్టేందుకు వచ్చేవారిలో ఆందోళన పెరుగుతోంది. తాజా పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా దృష్టి సారిస్తున్నాయి.

పెట్టుబడులు పెట్టే వారిని ఆకర్షించేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రాయితీలు, ప్రోత్సాహకాల్ని ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. దీనికోసం పారిశ్రామిక పాలసీలను కూడా ఎప్పటికప్పుడు ప్రకటిస్తున్నాయి. ఇందులో భాగంగానే విద్యుత్ ఛార్జీల్లో రాయితీలు, భూమి కేటాయింపులో ప్రోత్సాహకాలు, వివిధ పన్నుల్లో ప్రోత్సాహకాలు, రోడ్ల నిర్మాణం, నీటి సరఫరా వంటి అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నారు. మిగిలిన వాటి పరిస్థితి ఎలా ఉన్నా జిఎస్‌టి వచ్చిన తరువాత పన్ను ప్రోత్సాహకం గుదిబండగా మారుతోంది. గతంలో వ్యాట్ అమలులో ఉన్న సమయంలో ప్రభుత్వం ప్రకటించే పన్ను ప్రోత్సాహకాన్ని వివిధ రూపాల్లో అందించేవారు.



ఒకే మొత్తంగా, ఐదారేళ్ల గడువుతో చెల్లింపులు, దశల వారీ చెల్లింపులుగా రాయితీలు అందించేవారు. ఎలా అందించినప్పటికీ పాలసీ మేరకు వంద శాతం ప్రోత్సాహకం పెట్టుబడిదారులకు అందేది. తాజాగా జిఎస్‌టి వచ్చిన తరువాత పరిస్థితిలో మార్పు వచ్చింది. జిఎస్‌టి అమలులో సిజిఎస్‌టి, ఐజిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టిలుగా విభజించారు. ఇందులో ఐజిఎస్‌టి ద్వారా ఉత్పత్తి, రవాణాకు అనుగుణంగా ఆయా రాష్ట్రాలకు పన్నుల్లో వాటా ఇస్తారు. సిజిఎస్‌టి ద్వారా వసూలయ్యే మొత్తం కేంద్రానికే మిగులుతుంది. ఇక కేవలం రాష్ట్రంలో వినియోగించిన వస్తువులపై ఎస్‌జిఎస్‌గా వసూలుచేసే పన్ను మాత్రమే రాష్ట్రా లకు మిగులుతుంది. అందుకే పరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహకాలకు కేవలం ఎస్‌జిఎస్‌టి ద్వారా వచ్చే వసూళ్ల నుంచే ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కారణంగానే గతంలో వంద శాతం జరిగే ప్రోత్సాహకాల చెల్లింపులు నేడు కేవలం 20 నుంచి 25 శాతానికే పరిమితం కానున్నాయి. ఇలా ప్రోత్సాహకాలు తగ్గిపోవడం వల్ల నేరు గా ప్రభుత్వానికి జరిగే నష్టం లేకపోయి నప్పటికీ, పారిశ్రామిక వేత్తలకు మాత్రం నష్టం జరుగుతోంది. ఒకేసారి పన్ను ప్రోత్సాహకాల్లో 75 నుంచి 80శాతం వరకు కోత పడడంతో వారిలో ఆందోళన పెరుగుతోంది.

ఈ పరిస్థితిని గుర్తించిన కేంద్రం వాస్తవ పరిస్థితుల్ని చెప్పాలంటూ అన్ని రాష్ట్రాలకూ లేఖలు రాసింది. జిఎస్‌టి అమలుకు ముందు, అమలు తరువాత ప్రోత్సాహకాల పరిస్థితి ఎలా ఉందో చెప్పాలంటూ కోరింది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాల కోతలవల్ల తలెత్తే ప్రభావంపై అంచనాలు వేసుకుంటోంది. దీనిపై ప్రభుత్వానికి కొన్ని సలహాలు, సూచనలు కూడా వస్తున్నాయి. పన్ను ప్రోత్సాహకాలు తగ్గిపోవడం వల్ల పరిశ్రమలు వెనకడుగు వేయకుండా, ఇతర ప్రోత్సాహకాల్ని పెంచితే ఎలా ఉంటుందన్న కోణంలో అధ్యయనం చేస్తున్నారు. అలాగే విభజన తరువాత రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్ని గుర్తించి, కేంద్రం తన సిజిఎస్‌టి ఆదాయం నుంచి కొంత రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు వచ్చే వారికి విడుదల చేయాలని కేంద్రాన్ని కోరాలన్న ప్రతిపాదన కూడా తెరపైకి వస్తోంది.

సంక్షిప్తం

శ్మశాన వాటికలు, మసీదులకు రూ.2 కోట్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అనంతపురం జిల్లా కదిరి నియోజక వర్గంలో శ్మశానవాటికలు, 53 పీర్ల చావడీలకు ప్రహరీ గోడలు, మసీదుల నిర్మాణాలకు ప్రభుత్వం రూ. 2 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కె ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించనున్నారు.

సాంస్కృతిక అకాడమీలకు గ్రీన్ సిగ్నల్

రాష్ట్రంలో సాంస్కృతిక అకాడమీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అకాడమీల ఏర్పాటుకు పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వుల్ని చేశారు. సాహిత్య, సంగీత, నృత్య, నాటక, దృశ్య కళలు, జానపద, చారిత్రక, శాస్త్ర, సాంకేతిక అకాడమీల ఏర్పాటుకు అమోదం తెలిపారు. ప్రతి అకాడమీకి చైర్మన్, కార్యదర్శితో పాటు ఆ రంగంలో నిపుణులైన 11 మంది సభ్యులతో ఒక కమిటీని నియమించుకునేందుకు అవకాశాన్ని కల్పించారు. సభ్యుల్లోని ఒకరిని వైస్ చైర్మన్‌గా నియమించనున్నారు.

ప్రైవేటు బీఈడీ కాలేజీలు నిర్వహించిన పరీక్ష ఫలితాల్ని వెల్లడించొద్దు : హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఉభయగోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రైవేటు బీఈడీ,డీఈడీ కాలేజీలు నిర్వహించిన పరీక్షల ఫలితాల్ని వెల్లడించొద్దని హైకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. కన్వీనర్ కోటా సీట్లు భర్తీ కానప్పుడు యాజమాన్య కోటా కింద ఆయా కాలేజీ యాజమాన్యాలు సీట్లను భర్తీ చేయడాన్ని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం తప్పుపట్టింది.

ఈ-హాజరుపై మెమోలిస్తే ఊరుకోం : యుటిఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ-హాజరు నమోదులో ఏర్పడే సాంకేతిక లోపాల వల్ల ఉపాధ్యాయులకు మెమోలిస్తే ఊరుకోమని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ పి హెన్స్ డేవిడ్‌రాజుకు వినతి పత్రాన్ని అందించినట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ-హాజరులో ఏర్పడే సాంకేతిక సమస్యలకు ఉపాధ్యాయుల్ని బాధ్యులను చేస్తే ఆందోళన చేపడతామన్నారు. నూతనంగా ప్రవేశ పెట్టిన ఎపిటెల్ యాప్‌లో సెలవుల వివరాల్ని నమోదు చేసే బాధ్యతను ఎమ్ఇవోలకు ఇవ్వాలని వారు కోరారు.



గుంటూరు జిల్లా మందడం భూ కుంభకోణం కేసు వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

మందడం భూ కుంభకోణంలో మరో ముగ్గురు అరెస్టు

రూ.82.25 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని ప్రాంతంలో కలకలం రేపిన మందడం భూ కుంభకోణం కేసులో మరో ముగ్గుర్ని తుళ్లూరు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుండి రూ.82.25 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మందడం డిఎస్‌పి కార్యాలయంలో మీడియా ఎదుట హాజరుపర్చిన డిఎస్‌పి శ్రీనివాసరావు కేసు వివరాలను వెల్లడించారు. మందడంలో 207 సర్వే నెంబరులో తనకు ఎకరం పొలం ఉన్నట్లు పఠాన్ గౌస్‌ఖాన్ నకిలీ పత్రాలను సిఆర్‌డిఎ అధికారులకు ఇచ్చాడు. వాటిని సరిగా పరిశీలించని అధికారులు భూమిని ల్యాండ్ పూలింగులో తీసుకుంటున్నట్లు రికార్డుల్లో నమోదు చేశారు.

పఠాన్ గౌస్‌ఖాన్‌కు ల్యాండ్ పూలింగ్ నిబంధనల ప్రకారం 500 గజాలు నివాస, వాణిజ్య ప్లాట్లతో పాటు మూడేళ్ల పాటు కౌలుకు కూడా ఇచ్చారు. దీనిపై సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్ కెఇ సాధన ఫిర్యాదు మేరకు కేసు నమోదైన నేపథ్యంలో ప్రధాన నిందితునిగా పఠాన్ గౌస్‌ఖాన్‌ను ఈ నెల 19న అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఎ2, ఎ4, ఎ5 నిందితులుగా సిఆర్‌డిఎ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు డి.సందీప్, ఎన్.అవినాష్‌కుమార్, ఎం.నరేష్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తంగా రూ.83.40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా పఠాన్‌గౌస్‌ఖాన్ కుమారుడు మీరావలిఖాన్ ఆచూకీ తెలియలేదని, అతనితో పాటు ఇంకా మరికొందరిని విచారించాల్సి ఉందని డిఎస్‌పి వివరించారు.

'చింత'లపూడి..!

- రైతుల నుంచి బలవంతగా భూసేకరణ
- న్యాయం చేయాలంటూ అన్నదాతల పోరాటం



ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

పశ్చిమగోదావరి జిల్లాలోని చింతలపూడి ఎత్తిపోతల పథకం భూసేకరణలో ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది. 2.52 లక్షల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో నడుస్తున్న ఈ ప్రాజెక్టు భూసేకరణలో ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. రూ.4,909 కోట్లతో సవరించిన అంచనాలతో ముందుకు సాగుతున్న ప్రాజెక్టులో రైతులకు న్యాయమైన పరిహారం ఇచ్చేందుకు మాత్రం ప్రభుత్వం ససేమిరా అంటోంది. సరైన పరిహారం ఇవ్వకుండా రైతుల నుంచి బలవంతంగా భూములులాక్కుంటూ నిరంకుశంగా వ్యవహరిస్తోంది. తమకు న్యాయం చేయాలంటూ ప్రశ్నిస్తున్న రైతులపై అక్రమ కేసులు బనాయించి చిత్రహింసలకు గురిచేస్తోంది.

ఏడాదిన్నర కిందట జిల్లాలో పట్టిసీమ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును నిర్మించి ప్రభుత్వం కృష్ణా జిల్లాకు నీరు తరలిస్తోంది. ఈ సందర్భంగా జిల్లాలో కుడికాలువకు, ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలోనూ ప్రభుత్వం పెద్దఎత్తున భూసేకరణ చేపట్టింది. ఎకరాకు రూ.19 లక్షల నుంచి రూ. 52లక్షలు వరకూ పరిహారంగా ఇచ్చింది. చింతలపూడి ప్రాజెక్టుకు వచ్చేసరికి మాత్రం ప్రభుత్వం అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఎకరాకు కేవలం రూ.12.50లక్షలు మాత్రమే ఇస్తానంటూ మొండిగా ముందుకు సాగుతోంది.

చింతలపూడి ప్రాంతంలో బహిరంగ మార్కెట్లో ఎకరా ధర రూ.30 నుంచి రూ. 40 లక్షలు పలుకుతోంది. ప్రధాన రహదారి పక్క భూములైతే రూ.60 లక్షలకు పైగానే ధర పలుకుతుంది. ప్రభుత్వం చెబుతున్న ధర ప్రకారం రైతులకు చెల్లిస్తే రెండెకరాల కోల్పోయిన రైతు ఆ సొమ్ముతో మరోచోట ఎకరా కూడా కొనలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఎకరాకు రూ.30 లక్షలైన పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

కాలువల తవ్వకం... తప్పుడు సర్వేలు

రైతుల గోడు ఏమాత్రమూ పట్టించుకోని ప్రభుత్వం రైతులకు పరిహారం చెల్లించకుండానే ఆ భూముల్లో బలవంతంగా కాలువలు తవ్వేస్తోంది. కోర్టు కేసుల్లో ఉన్న భూముల్లో సైతం పనులు చేపడుతోంది. రైతులు అడ్డుకుంటే అక్రమ కేసులు బనాయిస్తోంది. దీంతో తమకు న్యాయం చేయాలంటూ రైతులు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. అంతేకాకుండా భూసేకరణ కోసం చేసిన సర్వే అంతా తప్పుల తడకగా ఉందంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. పామాయిల్ సాగవుతున్న భూమిని, వరిపొలంగా సర్వేలో పేర్కొన్నారు. భూముల్లో బోర్లు, చెట్లు వంటివి ఉన్నా ఎక్కడా నమోదు చేయలేదు. ఇదేమని రైతులు అడిగినా అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదంటూ అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పామాయిల్ తోటను వరిభూమిగా నమోదు



'నాకు రెండున్నరెకరాల పొలం ఉంది. అందులో పామాయిల్ సాగుచేస్తున్నాను. చింతలపూడి ప్రాజెక్టు భూసేకరణలో నా పొలం పోతుంది. సర్వే చేసిన అధికారులు నా పొలంలో వరి పంట సాగవుతున్నట్లు నమోదు చేశారు. ఎకరాకు కేవలం రూ. 12.50లక్షలు మాత్రమే పరిహారం ఇస్తామంటున్నారు. నాపొలం మొత్తానికిచ్చే సొమ్ముతో బహిరంగ మార్కెట్లో ఒక్క ఎకరా కూడా కొనలేను. మరి మాకుటుంబం ఎలా బతకాలి.'

- భీమారెడ్డి కృష్ణారెడ్డి, యర్రగుంటపల్లి, బాధిత రైతు

తప్పల తడకగా సర్వే



నాకున్న 80 సెంట్ల భూమిలో పామాయిల్ సాగుచేస్తున్నాను. భూసేకరణ సర్వేలో నా పొలంలో మొక్కజొన్న సాగవుతున్నట్లు నమోదు చేశారు. పరిహారం రూ. 12.50లక్షలు మాత్రమే ఇస్తానంటున్నారు. అదేమని అడిగితే అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఇదేం న్యాయమో ప్రభుత్వం చెప్పాలి.'

- కనమతరెడ్డి రాజశేఖర్‌రెడ్డి,భూమికోల్పోతున్న రైతు యర్రగుంటపల్లి,

కొత్త మున్సిపాల్టీలపై తర్జన భర్జనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని గ్రామాలను పట్టణ ప్రాంతంగా మార్చాలా... గ్రామాలుగానే కొనసాగించాలా అనే అంశం రాష్ట్ర అధికారులలో సందిగ్ధ పరిస్థితి నెలకొంది. మొత్తం 29 గ్రామాలను కలిపి ఒక మునిసిపాలిటీగా మార్చాలా లేక మేజర్ పంచాయతీలను నగర పంచాయతీలుగా ప్రకటించి పక్కన ఉన్న గ్రామాలను వీటిలో విలీనం చేయాలా అనే అంశంపై మునిసిపల్ పరిపాలన అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్తర్వులు రాలేదు. దీంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులూ రావడం లేదని అధికారులు చెబుతున్నారు. 2014 డిసెంబరులో సిఆర్‌డిఎ ఏర్పాటు చేసి ఇక్కడ రాజధాని ప్రకటించినా ఇప్పటివరకూ ఈ ప్రాంతాన్ని గ్రామ పంచాయతీలుగానే కొనసాగించారు. రాజధానిలో మెట్రో రైలు ఏర్పాటు చేయడానికి కేంద్రం అంగీకరించలేదు. బడ్జెట్‌లో నిధులు సైతం కేటాయించలేదు. రాజధాని మొత్తం ఇప్పటికీ గ్రామీణ ప్రాంతంగా ఉండటం వల్ల ఇక్కడ మెట్రో ఏర్పాటుకు కేంద్రం అంగీకరించలేదని తెలిసింది. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజధాని ప్రాంతం అటు పల్లె కాదు.. ఇటు పట్టణం కాకుండా ఉన్నాయని వ్యాఖ్యానించడంతో అధికారులు హడావుడిగా మునిసిపల్ ప్రాంతంగా మార్చే అంశంపై ప్రణాళిక తయారు చేయాలనుకున్నా ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాలేదు. రాజధాని ప్రాంతంలో తొమ్మిది నగరాలను అభివృద్ధి చేయాలని మాస్టర్‌ప్లాన్ రూపొందించిన ప్రభుత్వం మొత్తం 29 గ్రామాలను ఇప్పటి వరకూ మునిసిపల్ ప్రాంతంగా గుర్తించలేదు. ఈ నేపథ్యంలో 29 గ్రామాలను కలిపి ఒక మునిసిపాలిటీ లేదా కార్పొరేషన్‌గా మార్చాలనే ప్రతిపాదనపై ఉన్నతాధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. జూలై చివరి వరకూ పంచాయతీ పాలక వర్గాలు ఉన్నందున ఆగస్టులో రాజధాని ప్రాంతంపైనా తుది నిర్ణయం తీసుకునే అవకాశముందని మునిసిపల్ పరిపాలన శాఖలోని ఓ రాష్ట్ర అధికారి తెలిపారు. మరో వైపు కేంద్రం నుంచి ఎక్కువ నిధులను తెచ్చుకునేందుకు అమరావతి మెగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గతంలో అధికారులు ప్రతిపాదించినా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదు. తుళ్లూరు, మంగళగిరి, అమరావతి, తాడేపల్లి, తాడికొండ, పెదకాకాని మండలాలను కలుపుతూ మెగా కార్పొరేషన్‌కు కొంతమంది అధికారులు ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు చేసినట్టు తెలిసింది. దీనిపై ఇంకా నిర్ణయం వెలువడలేదు.



ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- విశాఖపట్నం

ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకూ జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి జనరల్, ఒకేషనల్ విద్యార్థులు బాలురు, బాలికలు మొత్తం 10,26,891 మంది హాజరవుతున్నారన్నారు. 1423 పరీక్షా కేంద్రాలు, 48 సెల్ఫ్ సెంటర్లు, 116 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశామని, రవాణా సౌకర్యం కల్పించామని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ ఫర్నీచర్ ఏర్పాటు చేశామని, ఏ కేంద్రంలోనైనా విద్యార్థులు పరీక్ష కింద కూర్చుని రాసినట్లు తన దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షా కేంద్రాల లోకేషన్‌ను తెలుసుకునేందుకు ఐపిఇ సెంటర్ లోకేటర్ యాప్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని, ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసునాయుడు పాల్గొన్నారు.

లారీ ఢీకొని టెట్ అభ్యర్థి మృతి

ప్రజాశక్తి - సబ్బవరం (విశాఖపట్నం)

టెట్ పరీక్ష రాసేందుకు వెళ్తున్న అభ్యర్థి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన విశాఖ జిల్లా సబ్బవరం దరి బొర్రామ్మ గెడ్డ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. మాకవరపాలెం మండలం పైడిపాల గ్రామానికి చెందిన ఎమ్.పోతురాజు (34), మరో టెట్ అభ్యర్థి దుంగల నూకరాజుతో (31) బైక్‌పై టెట్ పరీక్ష రాసేందుకు వెళుతున్నారు. ఇంతలో సబ్బవరం దరి బొర్రామ్మ గెడ్డ వద్ద పెందుర్తి నుంచి సబ్బవరం వస్తున్న ఐషర్ వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో వెనుక కూర్చొన్న పోతురాజు మృతి చెందాడు. నూకరాజుకు స్పల్ప గాయాలయ్యాయి. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పతికి తీసుకెళ్లారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు

వ్యవసాయ ఇంజినీరింగ్ కాలేజీకి ఎన్‌టిఆర్ పేరు పరిశీలన అదనంగా ఏడు ఎకరాలు : మంత్రి సోమిరెడ్డి

ప్రజాశక్తి-బాపట్ల/పొన్నూరు (గుంటూరు జిల్లా)

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిందని, ఇంకా తెస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి అన్నారు. నిర్దిష్టమైన వ్యవసాయం, ఉత్పత్తుల విలువ జోడింపునకు డిజిటల్ ఇంజినీరింగ్ టెక్నాలజీపై గుంటూరు జిల్లా బాపట్లలో రెండ్రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు ముగింపులో మంత్రి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా బిల్‌గేట్స్ సహకారంతో వారి టెక్నాలజీ వినియోగానికి మార్గం సుగమమైందని, ఉపగ్రహం ద్వారా భూ పరీక్షలకు శ్రీకారం చుట్టనున్నామని చెప్పారు. విశాఖ సదస్సులోనూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టడానికి పెట్టుబడిదార్లు సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. విదేశీ వ్యవసాయాన్ని ప్రస్తావించిన మంత్రి అయోవా రాష్ట్రంలో రైతు గంటకు 8,500 ఎకరాలు సాగు చేస్తుంటే మన రాష్ట్రంలో రైతు గంటకు 88 ఎకరాలకు మందు వేయగలుగుతున్నట్లు చెప్పారు. 62 శాతానికి మించి వ్యవసాయ కుటుంబాలు కష్టించి పని చేస్తుంటే మన నాలుగు వేళ్ళూ నోట్లోకి వెళుతున్నాయని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ అన్నం ప్రభాకర్ కోరిన విధంగా వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలకు ఎన్‌టిఆర్ పేరు పెట్టే అంశాన్ని సిఎంతో మాట్లాడతానన్న మంత్రి కాలేజీకి అదనంగా 7 ఎకరాల ఇవ్వాలనే అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ.మణి విజ్ఞప్తిని ఆమోదించారు. మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ డిజిటల్ ఇంజినీరింగ్‌పట్ల ఆసక్తి పెంచుకోవాలని రైతులకు సూచించారు. నాబార్డ్ ద్వారా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.140 కోట్లు విడుదల కానున్నాయ్యన్నారు.



వ్యవసాయ యంత్రాన్ని నడుపుతున్న మంత్రి సోమిరెడ్డి

బ్యాంకు మేనేజర్ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-గొలుగొండ (విశాఖ)

విశాఖజిల్లా గొలుగొండ మండలం కేడిపేటలోని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ గవిరెడ్డి రవికుమార్ (28) మంగళ వారం ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సమస్యల కారణంగా ఈ ఘటనకు పాల్పడినట్లు బాధితుడు పోలీసులకు తెలిపాడు. కొయ్యూరు మండలం శరభన్నపాలెం బ్రాంచి పేరుతో కేడిపేటలో ఇండియన్ బ్యాంకు ఉంది. గత రెండు రోజులుగా బ్యాంకు మేనేజర్ విధులకు రాకుండా అద్దె ఇంట్లోనే ఉండిపోయాడు. మంగళవారం ఉదయం కత్తితో పీకను కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఉదయం 10 గంటలైనా బ్యాంకుకు రాకపోవడంతో సిబ్బంది పలుమార్లు మేనేజర్‌కు ఫోన్ చేశారు. స్పందించకపోవడంతో బ్యాంకు సిబ్బంది ఆయన ఇంటిని స్థానికుల సహకారంతో తలుపులు పగలుగొట్టి లోపలికి వెళ్లారు. రక్తంతో తడిసి ఉన్న అతనిని వెంటనే కేడిపేట పిహెచ్‌సికి తరలించారు. ఇదిలా ఉండగా, పరిమితికి మించి రుణాలు మంజూరు చేయడంతో ఈయనపై ఉన్నతాధికారులు ఒత్తిడి తేవడంతో డిప్రెషన్‌కు వెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని సహోద్యోగులు, సన్నిహితులు చెబుతున్నారు.

పర్యాటకానికి ప్రోత్సాహం : అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ (కర్నూలు)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రం ఇప్పుడు అవకాశాల గనిగా నిలుస్తుండడంతో పాటుగా భారతదేశంలో సుప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా వెలుగొందుతుందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. ఎపి క్రియేటివిటి, కల్చర్ కమిషన్‌తో కలిసి రాష్ట్ర పర్యాటకశాఖ సంయుక్తంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. మంగళవారం దిగువ అహోబిలంలోని కళ్యాణ మండపం వద్ద మ్యూజిక్ అండ్ డ్యాన్సు ఫెస్టివల్ కార్యక్రమాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. అఖిలప్రియ మాట్లాడుతూ ప్రస్తుతం అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్యాపరంగా ఎపి 12వ స్థానానికి చేరిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కళలు, సంగీతం, నృత్యాలు, కల్చరల్ ఫెస్టివల్‌ను ప్రోత్సహిస్తుందన్నారు. కూచిపూడి నృత్యకారుడు టివి గంగాధరం, శశాంక్ సుబ్రమణ్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రపంచ ప్రసిద్ధ కర్నాటక గాత్రదారులు రజని, గాయత్రిలు అద్భుతమైన ప్రదర్శనలు చేశారు.

ప్రారంభోత్సవం

ప్రజాప్రతినిధులూ ఎసిబి పరిధిలోకి

- అన్ని జిల్లాల్లోనూ ఎసిబి నూతన కార్యాలయాలు
- హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప



ఎసిబి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

అవినీతికి పాల్పడే ప్రజా ప్రతినిధులను కూడా ఎసిబి పరిధిలోకి తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రూ.95 లక్షలతో నిర్మించిన అవినీతి నిరోధక శాఖ భవన సముదాయాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవినీతి రహిత పాలన అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పోలీసు శాఖను బలోపేతం చేశామన్నారు. అవినీతికి పాల్పడేవారిని ఉపేక్షించబోమన్నారు.

త్వరలోనే రాజమహేంద్రవరంలో ఎసిబి కోర్టును ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం మాట్లాడుతూ అవినీతి రహిత పాలన ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ ఆర్‌పి ఠాకూర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అవినీతి నిరోధక శాఖ జిల్లా కార్యాలయాలను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇప్పటి వరకూ 7 నూతన భవనాలు నిర్మించామని పేర్కొన్నారు. అవినీతి జరిగితే 1100 నెంబరుకు ఫోన్ చేసి చెప్పొచ్చన్నారు. రాజమహేంద్రవరం ఎంపి మాగంటి మురళీమోహన్ మాట్లాడుతూ అవినీతి నిరోధక శాఖ మరింత పటిష్టంగా పని చేయాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ దురాశ వల్ల అవినీతి జరుగుతోందన్నారు. అవినీతి పరులను కచ్చితంగా శిక్షించాల్సిందేనన్నారు. అవినీతి లేని సమాజం కోసం అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, ఎసిబి డైరెక్టర్ శంఖబ్రత బాగ్చి, రాజమహేంద్రవరం అర్బన్ ఎస్‌పి బి.రాజకుమారి, సబ్‌కలెక్టర్ ఎం.సాయికాంత్‌వర్మ, మున్సిపల్ కమిషనర్ విజయరామరాజు, ఎసిబి డిఎస్‌పిలు ఎం.సుధాకర్, వి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కుక్కల దాడిలో విద్యార్థి మృతి

బలిజిపేట (విజయనగరం జిల్లా):కుక్కల దాడిలో ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన విజయనగరం జిల్లా బలిజిపేట మండలం అంపావల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాగాల జస్వంత్ (11), అతని స్నేహితుడు రాజేష్ కలిసి పొలంలో పని చేస్తున్న రాజేష్ తండ్రి రెడ్డి గణపతికి అన్నం తీసుకెళుతున్నారు. మార్గమధ్యంలో వారిపై ఐదు కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. రోడ్డు మార్గంలో రాజేష్ పరుగులంకించుకొని ప్రాణాలు దక్కించుకున్నాడు. పొలంలోంచి పరిగెడుతున్న జస్వంత్‌ను కుక్కలు తీవ్రంగా గాయపర్చాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

వత్సవాయి (కృష్ణా):ట్రాక్టర్ ట్రక్కు ఒక్కసారిగా ఒరిగిపోవడంతో భయపడిన మిరప కూలీలు పొలాల్లోకి దూకి గాయాలపాలయ్యారు. ఈ సంఘటన కృష్ణా జిల్లా వత్సవాయి మండం మక్కపేట గ్రామంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే.. గ్రామానికి చెందిన 30 మంది కూలీలు రోజు మాదిరిగానే ట్రాక్టరులో మిరపతీతలకు బయలుదేరారు. ట్రాక్టర్ ప్రయాణించే దారి గుంతలమయంగా ఉండటంతో పొలానికి సమీపంలో ట్రాక్టర్ ఒక టైర్ ఒరిగిపోయింది. దీన్ని గమనించిన కూలీలు భయపడి పొలంలోకి దూకేశారు. దీంతో ఐదుగురికి గాయాలయ్యాయి.

9 ట్రాక్టర్లను దగ్ధం చేసిన మావోయిస్టులు

చింతూరు(తూర్పుగోదావరి)చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ జిల్లాలో మార్‌డుం పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు పనులకు ఉపయోగిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను మంగళవారం ఉదయం మావోయిస్టులు దగ్ధం చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మార్‌డుం పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన పథకంలో భాగంగా రోడ్డు పనులకు ఉపయోగించిన తొమ్మిది ట్రాక్టర్లను మావోయిస్టులు దగ్ధం చేశారని తెలిపారు. జెసిబి ఆపరేటర్‌పై దాడికి పాల్పడారన్నారు.

సంపాదకీయం

భాగస్వామ్య ప్రహసనం

విశాఖలో భారీ హంగులు, ఆర్భాటాల మధ్య మూడు రోజుల పాటు సాగిన భాగస్వామ్య సదస్సు పిసి సర్కార్ మ్యాజిక్ షోను తలపించింది. వందల్లో అవగాహనా ఒప్పందాలు, లక్షల కోట్లలో పెట్టుబడులు, ఇబ్బడి ముబ్బడిగా ఉద్యోగాలంటూ ప్రభుత్వం చేసిన ప్రకటనల హోరు, వాటినే పరమ సత్యాలుగా ప్రచార బాకాలు మోత మోగించిన తీరు చూస్తే పెట్టుబడులు సునామీలా వచ్చి పడబోతున్నాయని, ఇక నిరుద్యోగ సమస్య అనేదే వుండదనేంతగా ప్రచారం సాగింది. ఆంధ్ర ప్రదేశ్ పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందితే సంతోషించనివారెవరుంటారు. విభజన తరువాత రాష్ట్రం వ్యవసాయ, పారిశ్రామిక, సేవలు తదితర రంగాల్లో ఇతర రాష్ట్రాలతో పోటీపడి అభివృద్ధి చెందాలని, అందరికీ ఉపాధి దొరకాలనేదే అయిదు కోట్ల మంది ఆంధ్ర పజల ప్రగాఢ ఆకాంక్ష. ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తే ఎవరూ ఆక్షేపించాల్సిన పని లేదు. కానీ విశాఖ భాగస్వామ్య సదస్సులో గతంలో మాదిరిగానే పాత ప్రతిపాదనలకే కొత్త ఎంఒయు ముసుగులేయడం, రాని పెట్టుబడులను వచ్చినట్లు, లేని ఉద్యోగాలు కల్పించేసినట్లు భ్రమలు కల్పించడమే అభ్యంతరకరం.

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఏటా జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యు ఇఎఫ్) తరహాలో సిఐఐతో కలిసి మన రాష్ట్రంలో ప్రతి ఏటా ఇటువంటి సదస్సులు నిర్వహించి పెట్టుబడులను పెద్దయెత్తున ఆకర్షిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందుకోసం విశాఖలో ఓ బ్రహ్మాండమైన అంతర్జాతీయ సమావేశ కేంద్రం, అయిదు నక్షత్రాల హోటల్, షాపింగ్ మాల్ ఏర్పాటుకు దుబాయికి చెందిన లూలూ గ్రూపు సంస్థతో ఒక అవగాహనా ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. విలాసవంతమైన సమావేశ మందిరాలు, ఖరీదైన హోటళ్లు, భారీ షాపింగ్ మాల్స్ కడితే పెట్టుబడిదారులు ఆంధ్ర ప్రదేశ్‌కు క్యూ కడతారనేది భ్రమ. విశాఖలో గత మూడేళ్లలో ఈ భాగస్వామ్య సదస్సుల కోసం ప్రభుత్వం కొన్ని వందల కోట్లు వెచ్చించి అనేక హంగులు, ఆర్భాటాలు చేసినా, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మంత్రులు, ఉన్నతాధికారుల బృందం విదేశీ యాత్రలు, రోడ్ షోలు ఎన్ని నిర్వహించినా పెట్టుబడులు వచ్చింది చాలా తక్కువ. పెట్టుబడికి కావాల్సింది లాభం. ఎక్కడ ఎక్కువ లాభం వస్తుందనుకుంటే అక్కడికి అది పరుగులు తీస్తుంది. పెట్టుబడి స్వభావమే అంత. అంతేకాదు పెట్టుబడులు రావడంతోనే ఉపాధి దానంతటది పెరుగుతుందనుకోవడం కూడా పొరపాటు. ఆ పెట్టుబడులు ఏ రంగంలో వస్తున్నాయన్నది కూడా ముఖ్యం. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చాక ఉపాధి రహిత అభివృద్ధి అనేది ఒక పెద్ద సమస్యగా ముందుకొస్తున్నది. ఆధునిక టెక్నాలజీతో వస్తున్న పెట్టుబడులు కొత్త ఉద్యోగాలిస్తున్నది చాలా తక్కువ కానీ స్థానిక ప్రజల జీవనోపాధిని పెద్ద ఎత్తున దెబ్బ తీస్తున్నాయి. దాంతో మొత్తంగా ఈ పెట్టుబడుల వల్ల నిరుద్యోగం పెరుగుతున్నదే గానీ తగ్గం లేదు.

మరో ఏడాదిలో రానున్న ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం రాష్ట్ర ప్రజలకు మరోసారి అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. తాజా భాగస్వామ్య సదస్సు వల్ల 4లక్షల కోట్ల పెట్టుబడులు తరలివస్తున్నట్లు, దీనివల్ల పదకొండు లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు రాబోతున్నట్లు త్రీడీ చిత్రం చూపిస్తున్నారు. ప్రజల వద్ద కొనుగోలు శక్తి పెంచేందుకు కృషి చేయకుండా, కొత్తగా పరిశ్రమలు పెట్టేవారికి పూర్తి పన్ను రాయితీ కల్పించే ప్రత్యేక హోదా గురించి పట్టించుకోకుండా భాగస్వామ్య సదస్సుల పేరుతో 2016లో 4.76 లక్షల కోట్లు, 2017లో 10.54 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని ప్రభుత్వం చూపే లెక్కలన్నీ కాగితాలపై బాగానే కనిపిస్తున్నా, వాటిలో కార్య రూపం దాల్చినవి చాలా తక్కువ. 1991-2014 మధ్య రాష్ట్ర ప్రభుత్వానికి, వివిధ సంస్థలతో 8,96,000 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకుంటే వాటిలో 4.67 శాతం మాత్రమే ఆచరణ రూపం దాల్చాయి. సిఐఐ భాగస్వామ్య సదస్సులు ఒక్క మన రాష్ట్రంలోనే కాదు, చాలా రాష్ట్రాల్లోనూ జరుగుతున్నాయి. అక్కడ పాల్గొన్న పెట్టుబడిదారులే ఇక్కడా పాల్గొంటారు. ఒకే విధమైన వ్యాపార అంశంపై విభిన్న ఎంఓయులను కుదుర్చుకుంటారు. ఇది నిత్యం జరుగుతున్న తంతు. విశాఖలోనూ అదే పునరావృతం అయింది. మరోవైపు రాని పరిశ్రమలను సాకుగా చూపి ప్రభుత్వం రైతుల నుంచి భూములను బలవంతంగా లాక్కొని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోంది. ఏళ్లు గడిచినా పరిశ్రమ రాదు. భూములు, రాయితీలు, బ్యాంకు రుణాలు మాత్రం కార్పొరేట్ సంస్థలకు దక్కుతున్నాయి. ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే కేవలం పెట్టుబడులపై ఆధారపడితే చాలదు. ప్రజల వద్ద కొనుగోలు శక్తిని పెంచే చర్యలు చేపట్టాలి. మరోవైపు రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రత్యేక హోదా అభిస్తే కొంతమేరకైనా పరిశ్రమలు మన రాష్ట్రంలోకి వస్తాయి. ఈ దిశగా కృషి చేయకుండా ప్రచారార్భాటంతో ప్రజలను వంచించబూనుకోవడం క్షంతవ్యం కాదు.

ఇదీ విషయం




సీమ దొరల సమ్మిట్లో
అలుపెరుగని ప్రసంగాలు...
పెన్నులరిగి పోయేలా
ఒప్పందపు సంతకాలు!

జిమ్మిక్కుల లెక్కలతో
పేపరుపై పెట్టుబడులు
కనుచూపు మేరలోన
కానరాని పరిశ్రమలు!

- కొల్లూరు వెంకట్

ప్రజాస్వామ్య ముసుగులో నిరంకుశత్వం

విశ్లేషణ



తెలకపల్లి రవి



మత మార్కెట్ తత్వాల అడకత్తెరలో ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టడం చాలా పోరాటంతో గాని సాధ్యం కాదు. మోడీ ఏక వ్యక్తి పోకడలపై ప్రతిపక్షాలే గాక అరుణ్‌శౌరి, యశ్వంత్‌సిన్హా వంటి వారు కూడా తిరుగుబాటు చేయాల్సి వచ్చింది. ట్రంప్‌కు ఎంతగా వంతపాడినా భారతీయుల హెచ్ 1 బి వీసాతో పాటు అన్నిటినీ గండంలో పడేశారు.

ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య ఎన్నికల పద్ధతిని ఏకపక్ష పాలనవైపు, ఏక వ్యక్తి పెత్తనం వైపు మరల్చడం ఆందోళన కలిగిస్తోంది. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ నుంచి మన దేశంలో నరేంద్ర మోడీ వరకూ ఆఖరుకు రెండు తెలుగు రాష్ట్రాలతో సహా ప్రభుత్వాధినేతల పోకడలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. ఏమంటే మాకు ప్రజలు ఎన్నికల్లో ఓట్లేశారన్నది సమాధానంగా వుంటున్నది. ఎన్నికల మెజార్టీ వున్నంత మాత్రాన మొత్తం రాజకీయ రాజ్యాంగ వ్యవస్థలను తలకిందులు చేసేంత అధికారం లభిస్తుందా అనేది పెద్ద సవాలుగా మారుతోంది. పాశ్చాత్య మేధావులు, సిద్ధాంతకారులు కూడా ఈ వాస్తవాన్ని అంగీకరించాల్సి వచ్చింది. వారు దీనికే ప్రజారంజక నియంతృత్వం (పాపులిస్టు అథారిటేరియనిజం) అని నామకరణం చేశారు. ఆసియా, ఆఫ్రికా, యూరప్ దేశాలలో అమెరికా ఖండంలో ఎన్నికల ద్వారా వచ్చిన నాయకులే ఇష్టానుసారం వ్యవహరించడం ప్రత్యర్థులను అణచివేయడం సర్వసాధారణమై పోయింది. ఈ రాజకీయార్థిక పెత్తనానికి మీడియా కూడా తోడై ప్రజలకు సరైన సమాచారం కూడా రాకుండా చేస్తోంది. పాశ్చాత్య మీడియాధినేతలైన రూపర్ట్ మర్డోక్ వంటి వారు గాని, దేశంలోనూ, తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రాబల్యం వహిస్తున్న మీడియాధిపతులు గాని ఏది ఎలా రాయాలి? ఏ మేరకు చెప్పాలి? చూపాలి? ముందే నిర్ణయించేస్తున్నారు.

జనస్వామ్యమా? ధనస్వామ్యమా?

ఏకధృవ ప్రపంచమనే ప్రచారంలో అగ్రరాజ్య పీఠాధిపతి ఒకరు అంత వికృతంగా వినాశకరంగా మాట్లాడగలరని వ్యవహరిస్తారని అంతకు ముందు కొందరి ఊహలో కూడా లేదు. తన తండ్రి ట్రంప్ అమెరికా అధ్యక్షుడైన కారణంగా తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఆయన కుమారుడు వ్యాఖ్యానించాడంటే అహంభావం ఏ స్థాయిలో వుందీ తెలుస్తుంది. నిజానికి ఇది ఏకధృవ ప్రపంచం కాదు గనక బహుళ ధృవాలు పని చేస్తున్నాయి గనక ప్రత్యర్థి శక్తులపై దేశాలపై దుర్భాషలకూ, దాడులకూ దారితీస్తున్నది. ప్రపంచంలో కొన్ని దేశాలలో వామపక్ష ప్రత్యామ్నాయ శక్తులు విజయాలు అందుకున్నా అనేక చోట్ల మితవాద జాతి దురహంకార శక్తులు అధికారం అందిపుచ్చుకోవడం అందరూ గుర్తిస్తున్న విషయమే. అయితే అంతగా గుర్తించబడని అంశం ఈ అధికారిక నిరంకుశత్వం (కొంతమంది ఈ జాబితాలో చైనాను వెనిజులా వంటి వాటిని చేర్చి మాట్లాడటం పొంతనలేని విషయం.). బూర్జువా ప్రజాస్వామ్యం ఎప్పుడూ సంపూర్ణమైంది కాదనీ, సార్వత్రిక ఓటింగు వున్నా అక్కడ గుత్తాధిపతుల మాటే చెల్లుతుందని అనుభవం చెబుతున్న సత్యం. రాచరిక భూస్వామ్యంతో పోలిస్తే బూర్జువా ప్రజాస్వామ్యం మెరుగైంది కావచ్చు గాని అక్కడ జనస్వామ్యం ధనస్వామ్యంగానే వుంటుంది. ప్రత్యామ్నాయ శక్తుల పెరుగుదలను అడ్డుకోవడానికి నిర్బంధాలూ నిరంకుశత్వాలతో పాటు అనేక రాజకీయార్థిక ప్రలోభాలనూ కొన్ని సంక్షేమ పథకాలనూ కూడా ఈ రాజ్యాలు అమలు చేశాయి. సామ్యవాదానికి విరుగుడు సంక్షేమ రాజ్యమేనని ప్రచారం చేశాయి. అయితే సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం సోషలిజానికి ఎదురుదెబ్బల తర్వాత వారికి ఆ అవసరం లేకుండా పోయింది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పథకం నిరాఘాటంగా ప్రపంచ వ్యాప్తంగా అమలు కావాలంటే ప్రజాస్వామ్య విలువలూ ప్రజోద్యమాలూ వారికి ప్రమాదంగా కనిపిస్తుంటాయి. అభివృద్ధి జపంతో వాటిపై దాడి చేయడం మొదలెట్టారు.

భారతీయుల అనుభవం

సిద్ధాంతాలు విధానాలతో నిమిత్తం లేని అభివృద్ధి ఒక బూటకపు తతంగమే. అభివృద్ధి అంటే ఎవరి అభివృద్ధి? కొద్దిమంది కోటీశ్వరులదా లేక కోట్ల మంది సామాన్యులదా? ఈ మూడేళ్లలో సంపదల తరలింపు భారీగా జరిగి పది శాతం చేతుల్లోనే 63 శాతం ఆస్తులు చేరాయి. అట్టడుగు వర్గాల వారికి సామాజిక న్యాయమే గాక అల్ప సంఖ్యాకుల హక్కులు కూడా నిరాకరించబడుతుంటాయి. అయినా స్వచ్ఛభారత్, మేకిన్ ఇండియా వంటి నినాదాలు మార్మోగుతుంటాయి. జాతి, మతం వంటి వాటికి తమవైన నిర్వచనాలిచ్చి వాటిని ఏమాత్రం విమర్శించినా దేశద్రోహమన్నట్టు చిత్రించడం సినిమాలు మీడియాలు సోషల్ మీడియాలపైన కూడా దాడి చేయడం ట్రోల్సును ఉసిగొల్పడం, మానవుల కన్నా గోవుల రక్షణ జపం ఎక్కువై నరమేధాలు జరగడం ఇవన్నీ ఆందోళనకరమైన విషయాలే. రాజ్యాంగం మొదటి అధికరణంలోనే చెప్పుకున్న రాష్ట్రాల సమాఖ్య అంశాన్ని విస్మరించి కేంద్రం ఏకపక్షంగా నిర్ణయాలు చేయడం నోట్లరద్దు వంటి వాటిపై రిజర్వుబ్యాంకుకు కూడా పాత్ర లేకుండా నిర్ణయం తీసుకోవడం చెప్పాలంటే చాలా ఉదాహరణలున్నాయి. సైన్యం ఎన్నికైన ప్రభుత్వానికి లోబడి రాజకీయ రహితంగా వుండాలనే ప్రాథమిక సూత్రం కూడా పాటించకుండా సైనిక దళాల ప్రధానాధికారి ఓవైపు... ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ మరోవైపు అత్యంత అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినా సమాధానం లేదు. మత మార్కెట్ తత్వాల అడకత్తెరలో ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టడం చాలా పోరాటంతో గాని సాధ్యం కాదు. మోడీ ఏక వ్యక్తి పోకడలపై ప్రతిపక్షాలే గాక అరుణ్‌శౌరి, యశ్వంత్‌సిన్హా వంటి వారు కూడా తిరుగుబాటు చేయాల్సి వచ్చింది. ట్రంప్‌కు ఎంతగా వంతపాడినా భారతీయుల హెచ్ 1 బి వీసాతో పాటు అన్నిటినీ గండంలో పడేశారు. మీరు మీ ప్రయోజనాలు చూసుకుంటే మేం మాత్రం చూసుకోవద్దా అని దావోస్ శిఖరాగ్ర సభలో సూటిగానే చెప్పారు. దేశదేశాల్లో వారి సైనిక ఉనికి రకరకాల రూపాల్లో కొనసాగుతూనే వుంది. స్వదేశంలోనూ ముస్లింలను వేధించే అనేక చర్యలకు పాల్పడుతున్నారు, జాతి వివక్ష పెరుగుతోంది. మీడియా కావలసినంత ప్రచారం ఇస్తున్నా దానిపై రోజూ విరుచుకు పడుతున్నారు, చైనాను బెదిరించడం, ఉత్తర కొరియాపై సైనిక కవ్వింపులూ, వెనిజులాలో కుట్రలూ క్యూబా వంటి దేశాల పట్ల గత విధానాలను తిరగదోడటం, జెరూసలెంను రాజధానిగా గుర్తించడం ద్వారా ఇజ్రాయిల్‌కు, మరోవైపు నిరంకుశ సౌదీ అరేబియాకు పూర్తి వత్తాసునివ్వడం, అనేక అంతర్జాతీయ ఒప్పందాలను తోసిరాజనడం ఇవన్నీ అమెరికా పాలకుల ఆధిపత్య ధోరణులకు నిదర్శనాలు.

అమెరికాలో ఆందోళన


ఈ నేపథ్యంలోనే ఇటీవల వాషింగ్టన్ పోస్టు పత్రిక 'అంధకారంలో అంతరిస్తున్న ప్రజాస్వామ్యం' అని పతాక శీర్షిక ఇచ్చింది. ప్రజాస్వామిక ఉదారవాదులే గాక మితవాదులు కూడా అమెరికా గమనంపై ఆందోళనలో మునిగిపోతున్నారు. స్వతహాగా మితవాది అయిన డేవిడ్ ఫ్రమ్ ఇటీవలనే బ్రూకింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఒక సదస్సులో ప్రసంగిస్తూ అమెరికా రాజ్యాంగ వ్యవస్థలు ప్రజాస్వామ్యాన్ని రక్షించగలవా అని సందేహం వెలిబుచ్చారు. రాజ్యాంగ నిబద్ధత అన్నది లేని పాలకులు ఇష్టానుసారం వ్యవహరించడానికి ఆ నిబంధనలే దోహదం చేస్తున్నాయని ఆయన విశ్లేషించారు. భారత దేశంలోనూ రాష్ట్రాలకు సంబంధించిన అంశాలలో కేంద్రమే ఇంకా చెప్పాలంటే ప్రధాని నిర్ణయం తీసుకోవడం ఈ తరహాలోకే వస్తుంది. గత ఏడు దశాబ్దాలుగా అమలవుతున్న అనేక లౌకిక ప్రజాస్వామిక సంప్రదాయాలను తోసిపుచ్చి మతవాద మితవాద విధానాలను ప్రతిష్ఠించడం చూస్తున్నాం. సుప్రీం కోర్టు చెప్పినా రాష్ట్రాలలో 'పద్మావత్' చిత్రం విడుదల అనుమతించకపోవడం, తెలంగాణలో పూర్తి గానూ ఏపిలో పాక్షికంగానూ టీవీ ఛానళ్లు పత్రికలపై ఆంక్షలు పెట్టి అడ్డుకోవడం కూడా చూశాం. వీటి ఫలితంగా గాని లేక తమ ప్రయోజనాల కోసం గాని ఆ మీడియా సంస్థలు కూడా పాలక పక్షాలకు అనుకూలమైన కథనాలే వండి వార్చడం నిత్యకృత్యమై పోయింది. అప్రజాస్వామిక ఉత్తర్వులతో సభలూ సమావేశాలు నిరసనల హక్కులను హరించడం కూడా ఈ కోవలోదే. చట్టసభలలో చర్చలు విలువే కోల్పోతున్న పరిస్థితి. ప్రజాధనంతో ఏవో కొన్ని సంక్షేమ పథకాలు ప్రకటించి అరకొరగా అమలు చేస్తూ అది కూడా స్వంత ఘనతగా చెప్పుకోవడం రివాజుగా మారింది.

అప్రమత్తత, ఆచరణశీలత

ఎన్నికల వ్యయం విపరీతంగా పెంచేసి ప్రత్యామ్నాయ శక్తులూ ప్రజాస్వామిక వాదులూ పోటీపడలేని స్థితి తీసుకు రావడం ఈ దుష్పరిణామాలకు ఒక ప్రధాన కారణం. మితవాద భావజాలానికి పేరు మోసిన అమెరికా సుప్రీం కోర్టు 2010లో సిటిజన్స్ యునైటెడ్ పేరిట కార్పొరేట్లు ప్రయివేటు బృందాల ఎన్నికల విరాళాలపై అంటే రాజకీయ పెట్టుబడులపై పరిమితులు ఎత్తివేసింది. ఇండియాలోనూ మోడీ ప్రభుత్వం బడ్జెట్ ద్వారా తమ వివరాలు తెలియకుండానే బాండ్ల కొనుగోలుద్వారా తమ చెప్పుచేతల్లో వుండే పార్టీలకు ఎంతైనా ధనం సమకూర్చేలా కార్పొరేట్లకు వీలు కలిగించింది. దాదాపు ఎనభై శాతం నిధులు బిజెపికే వెళ్లినట్టు కూడా ఇప్పటికే వెల్లడైంది. ద్రవ్య సంస్థలూ గనులూ వనరులూ ఎయిరిండియా విమానాల వరకూ అన్నీ ప్రయివేటు పరం కావడం అందువల్లనే! ఈ తరలింపును అడ్డుకోకుండా ప్రజలు మతఛాందసంలో మునిగి వుండాలి. చైతన్యవంతులు అడ్డుకోకుండా ఆంక్షలు అమలు చేయాలి. ఇదంతా ఒక విష వలయం. భారత సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తులు కూడా న్యాయం కోసం ప్రజల ముందుకు రావలసి వచ్చింది. ఇన్ని ప్రతికూలతల మధ్య ప్రజాస్వామిక శక్తులూ ప్రత్యామ్నాయ వాదులూ తమ పోరాటం సాగిస్తూనే వుండటం వూరట కలిగించే అంశం. ఆర్థిక పోరాటాలకు తోడు సామాజికాంశాలు కూడా తోడవుతుండటం, సాంస్కృతిక స్వేచ్ఛలను కాపాడుకోవాలనే స్పృహ పెరగడం ఆహ్వానించదగింది. ఈ తరహా భావ స్రవంతులనూ చర్చలనూ కార్యాచరణనూ బలోపేతం చేసుకోవడం ద్వారానే ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోగలం. నిరంతర అప్రమత్తతే స్వాతంత్ర్యా నికి మూల్యం అన్నమాట ఎప్పటికీ చెరిగిపోని పరమ సత్యం. ♦

శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయాలి

ఎస్ వెంకట్రావు



ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28ని జాతీయ సైన్సు దినోత్సవంగా జరుపుకుంటున్నాం. సైన్సులో నోబెల్ బహుమతి పొందిన ఏకైక భారత శాస్త్రవేత్త సివి రామన్ తన శాస్త్రీయ ఆవిష్కరణ 'రామన్ ఎఫెక్ట్‌'ను 1928 ఫిబ్రవరి 28న ఆవిష్కరించినందుకు గుర్తుగా ఈ రోజును జరుపుకుంటున్నాం. రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరించి నేటికి 90 ఏళ్లు గడిచింది. మనకు స్వాతంత్ర్యం వచ్చి గతేడాదికి 70 ఏళ్లు నిండాయి. ఈ కాలంలో దేశం శాస్త్ర సాంకేతి రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించింది. కానీ దానికి అనుగుణంగా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి కాకపోవడం విచారకరం. శాస్త్రీయ దృక్పథం లేని శాస్త్ర-సాంకేతికాభివృద్ధి అశాస్త్రీయ పద్ధతిలో వినియోగించబడుతుంది. అది దేశ ప్రజలకు మేలు కన్నా కీడే ఎక్కువ చేస్తుంది.

పెరిగిన పరిశ్రమలు ప్రజలను నిరుద్యోగులను చేస్తున్నాయన్నా, పెరిగిన వైద్య సాంకేతిక పరిజ్ఞానం ప్రజలను భయ పెడుతోందన్నా, ఉన్నత చదువులు పిల్లలను ఆత్మహత్యలకు గురిచేస్తున్నాయన్నా కారణం శాస్త్ర-సాంకేతికాభివృద్ధితో పాటు ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగకపోవడమే.

పౌరుల ప్రాథమిక విధులను గురించి వివరించే రాజ్యాంగంలోని 51ఎ అధికరణంలో... 'శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతావాదాన్ని, అన్వేషణ, సంస్కరణ స్ఫూర్తినీ పెంపొందించడం' పౌరుని ప్రాథమిక విధిగా పేర్కొన్నారు. ఇలా రాజ్యాంగంలో పేర్కొన్నారంటే మన దేశ పరిస్థితుల్లో దానికో ప్రాధాన్యత ఉంది. దేశంలో విస్తారమైన ప్రజానీకం నిరక్షరాశ్యులుగా ఉండడం, సమాజంపై ఫ్యూడల్ ఆలోచనా ప్రభావం బలంగా ఉండడం, సుదీర్ఘకాలం దేశం వలస పాలనలో మగ్గడం...ఈ కారణాల రీత్యా స్వాతంత్ర్యానంతరం దేశం పురోగమించాలంటే ప్రజల ఆలోచనా విధానం అభివృద్ధికర మార్గంలో సాగాలనే ఉద్దేశంతో రాజ్యాంగంలో ఈ అంశాన్ని చేర్చారు.

శాస్త్రీయ దృక్పథం (సైంటిఫిక్ టెంపర్) అనేది ఒక జీవన విధానం. ఆధునిక సైన్సు ఏ పద్ధతుల్లో అభివృద్ధి చెంది నేడు మానవాళికి సేవ చేస్తోందో ప్రజలు కూడా రోజువారీ జీవనంలో అటువంటి పద్ధతులు అనుసరించాలని దీనర్థం. శాస్త్రీయ పద్ధతిలో ప్రతిదాన్నీ ప్రశ్నించడం, భౌతిక వాస్తవికతను పరిశీలించడం, పరీక్షించడం, సైద్ధాంతీకరించడం, విశ్లేషించడం, ఇతరులకు చెప్పడం అనే క్రమం ఉంటుంది. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలంటే ప్రజల్లో తర్కం, చర్చ, వాదన, విశ్లేషణ వంటి గొప్ప ధోరణులను అభివృద్ధి చేయాలి.

యూరప్‌లో లిబరల్ బూర్జువా వర్గం ఈ దృక్పథాన్నే ఆయుధంగా చేసుకుని ఫ్యూడల్ శక్తులపై పోరాడి పారిశ్రామిక విప్లవం సాధించింది. అభివృద్ధి చెందింది. మన దేశంలో కూడా స్వాతంత్ర్య పోరాటంలో లిబరల్ బూర్జువా వర్గం ఈ ఆయుధాన్నే ఉపయోగించుకుంది. నిజానికి శాస్త్రీయ దృక్పథం అనే మాటను వాడింది మన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. ఈ ధోరణి మన దేశంలో పారిశ్రామిక, శాస్త్ర సాంకేతిక పునాది పడడానికి ఎంతగానో తోడ్పడింది.


కానీ ఇప్పుడు అధికారం చేపట్టిన చీకటి శక్తులు ఈ శాస్త్రీయ దృక్పథానికీ, విజ్ఞాన శాస్త్రానికీ విరుద్ధమైన భావజాలాన్ని ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. డార్విన్ పరిణామవాదం తప్పు అని ఒక కేంద్ర మంత్రి బహిరంగంగా ప్రకటిస్తే, దేశ ప్రధాని అంతటి వాడు జాతీయ సైన్సు కాంగ్రెస్‌లో పురాణాల కాలంలోనే మనవాళ్లు ప్లాస్టిక్ సర్జరీలు చేసేశారని ఏ ఆధారాలు లేకుండా చెప్పేశారు. అదే సైన్సు కాంగ్రెస్‌లో ఒక ప్రబుద్ధుడు వేదకాలంలోనే మన వాళ్లు విమానాలు తయారు చేశారని ఏకంగా పత్రమే ప్రవేశపెట్టారు. సూర్య 'దేవునికి' స్కూళ్లలో నమస్కారాలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద కార్యక్రమం ప్రకటించారు. ఒక ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకుడు వ్యవసాయానికి ఆవు పేడ, మూత్రం చాలు... వ్యవసాయ విశ్వవిద్యాలయాన్నిటినీ మూసేయాలని శెలవిచ్చాడు.

'అన్నీ వేదాల్లోనే ఉన్నాయష' అంటూ ఏ చాందసత్వాన్నయితే మహాకవి గురజాడ ఈసడించుకున్నారో ఆ చాందస వాదం నేడు గద్దెనెక్కి మనల్ని పరిపాలిస్తోంది. ఈ చాందస వాదం ప్రకటనలకే పరిమితం కాలేదు. పాలకుల అండతో పాఠ్యపుస్తకాల ద్వారా, మీడియా ద్వారా, చాందసవాదుల అశాస్త్రీయ కార్యకలాపాల ద్వారా ప్రజల మస్తిష్కాలను ఆవహించేస్తోంది. ప్రతిరోజూ టివి కార్యక్రమాల ద్వారా, సినిమాల ద్వారా, పత్రికల శీర్షికల ద్వారా ఎన్నెన్ని మూఢ నమ్మకాలు, అశాస్త్రీయ భావాలు ప్రచారం అవుతున్నాయో చూస్తున్నాం. నిజానికి ఇవన్నీ రాజ్యాంగ విరుద్ధ చర్యలు. అయినా పాలకులు దీనిపై చర్యలు తీసుకుంటున్నది లేదు. కానీ రాజ్యాంగంలో పౌరుల విధిగా పేర్కొన్న శాస్త్రీయ దృక్పథాన్ని గురించి ఈ ప్రసార మాధ్యమాల్లో ఎన్ని కార్యక్రమాలు వస్తున్నాయంటే... దాదాపు లేనట్లే.


ప్రజలు శాస్త్రీయ దృక్పథం నుండి తప్పుకుంటే ఏమవుతుందో ఈనాడు మనం ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ వంటి దేశాల్లో చూస్తున్నాం. ఒకప్పుడు ఆధునికత వైపు అడుగు లేస్తున్న ఈ దేశాలపై అమెరికా దాడి చేసి చాందస శక్తులను పెంచి పోషించిన ఫలితంగా నేడు అక్కడ చీకటి శక్తులు రాజ్యమేలుతున్నాయి. పౌర హక్కులు, ప్రజాస్వామ్యం లేని అంధ యుగంలోకి ఆ దేశాలను తీసుకుపోయాయి. భారతదేశం కూడా ఆ స్థితికి వెళ్లకుండా ఉండాలంటే ప్రజల మస్తిష్కాలపై చాందస శక్తులు పూర్తి విజయం సాధించకుండా అడ్డుకోవాలి. దీనికి ప్రజల్లో సైన్సునూ, శాస్త్రీయ దృక్పథాన్నీ ప్రచారం చేయడం అవసరం. ♦

మూడుపదుల ప్రజాసైన్సు ఉద్యమ ప్రస్థానం

సందర్భం



డా॥ సిహెచ్ రవికుమార్



నేడు జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం

వ్యక్తులు తమకు తాముగా చరిత్ర సృష్టించరు. ఒకానొక చారిత్రక అవసరం మహనీయులను సృష్టిస్తుంది. సంస్థలూ అంతే. ప్రత్యేక అవసరాలు, చారిత్రక సందర్భాలు సంస్థల పుట్టుకకు కారణమౌతాయి. జనవిజ్ఞానవేదిక ఆవిర్భావం కూడా సరిగా అలాంటిదే. జనవిజ్ఞానవేదిక ఆవిర్భావానికి దేశవ్యాప్తంగా ఉన్న వాతావరణం ప్రేరణ అందించింది. 1987 సం॥ అక్టోబరు 2 నుండి నవంబరు 14వరకు దేశవ్యాప్తంగా భారత జనవిజ్ఞాన జాతా జరిగింది. ఈ జాతా దేశవ్యాప్తంగా ఎంతో మంది ప్రజాసైన్సు ప్రేమికుల్ని, దేశభక్తుల్ని, శాస్త్రవేత్తల్ని, మేధావుల్ని ఆకర్షించింది. ఆలోచింపచేసింది. ఈ జాతా జరిగిన సంవత్సరంలోనే ఉమ్మడి రాష్ట్రంలోని అనేకమంది ఆలోచనాపరులు, ప్రజాసైన్సు ప్రేమికులు ఒకచోట చేరి తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రాష్ట్రంలో ప్రజాసైన్సు ఉద్యమ అవసరాన్ని గుర్తించారు. ఆ విధంగా ప్రజాసైన్సు ఉద్యమ నిర్మాణానికి బీజాలు ఏర్పడ్డాయి. ఎంతో మంది మేథోమథనం నుండి పుట్టిన బిడ్డే జనవిజ్ఞానవేదిక. పూర్వ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో సైన్సు ఫలితాలు ప్రజలకు చేరాలని, సైన్సు ప్రజల జీవితాలలో విజ్ఞానదీపిక కావాలని కోరుకునేవారందరూ ఒక గొప్ప ఆశయానికి శ్రీకారం చుట్టారు. ఈ సమిష్టి కృషి ఫలితంగా 1988 ఫిబ్రవరి 28వ తేదీన విజయవాడలో జనవిజ్ఞానవేదిక ఆవిర్భవించింది.

ప్రజల నుండి ప్రజల కోసం పనిచేసే సంస్థగా జనవిజ్ఞానవేదిక తన ప్రయాణాన్ని 30 ఏళ్ల నుండి కొనసాగిస్తోంది. అవకాశం చిక్కిన ప్రతి సందర్భంలోనూ సైన్సుని ప్రజలకు ఉపయోగపడే కార్యాచరణగా, ఆయుధంగా మలిచింది. సమాజం కోసం తమ వంతు బాధ్యతల్ని నిర్వర్తించే ఎంతో మంది విద్యావంతుల్ని జె.వి.వి ఆకర్షించింది. వారిని మెరికల్లాంటి కార్యకర్తలుగా, నాయకులుగా తీర్చిదిద్దింది. జనవిజ్ఞానవేదిక ఆచరణలో ఎన్నో కార్యక్రమాలు ప్రజల అవసరాల నుంచి పుట్టినవే. ఎవరో వచ్చి చేసేదాకా ఎదురుచూడకుండా తన శక్తి మేరకు కార్యక్రమాల్ని రూపొందించుకుంది. ఫలితంగానే ఎన్నో కొత్త ఆలోచనలు, ఆచరణలకు పునాది వేసింది. గ్రామాలలో కనీస ఆరోగ్య సదుపాయాలు లేని పరిస్థితులకు స్పందించింది. దాని పర్యవసానంగా పుట్టిన ఆలోచనే ఉపాధ్యాయులకు ప్రాథమిక ఆరోగ్య శిక్షణ. 1988లో ఆరోగ్యం మరియు మందులపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. అదే సంవత్సరం 'జనవిజ్ఞానం' పేరు మీద సురక్షిత నీరు, వాంతులు, విరేచనాల నిర్మూలన గురించి గ్రామాలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించింది. శిక్షణ పొందిన వందలాదిమంది ప్రజారోగ్య కార్యకర్తలు ప్రజలకు ఆరోగ్యాన్నిచ్చే గొప్ప కృషిని చేపట్టారు. అలాగే పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు సైన్సుపట్ల అవగాహన కల్పిస్తే వారిలో ప్రాథమిక స్థాయి నుంచే శాస్త్రీయ ఆలోచనల ప్రేరేపించవచ్చని భావించింది. దాని ఫలితమే సైన్సు టీచర్లకి శిక్షణా శిబిరాలు. ప్రయోగాల ద్వారా పాఠశాలల్లో పిల్లలకు సైన్సు సులువుగా నేర్పించడం శాస్త్రీయమైన పద్ధతి. ఇందుకోసం 1988లోనే హైదరాబాదులో తక్కువ ఖర్చుతో బోధనా పరికరాలతో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చింది. గ్రామాలలో మూఢవిశ్వాసాల వ్యవస్థ ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తుంది. ఇవి కొన్నిసార్లు ప్రాణసంకటంగా కూడా మారిన సందర్భాలు వున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా జె.వి.వి మెజీషియన్లు, కార్యకర్తలు మూఢ విశ్వాసాల ఫలితంగా ప్రజల మధ్యఏర్పడిన ఘర్షణలను ఎన్నోసార్లు సామరస్యంగా పరిష్కరించగలిగారు. సైన్స్ మేజిక్ దీనికి ఎంతో తోడ్పడింది. పిల్లలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం భవిష్యత్ సమాజానికి ఎంతో అవసరం. ఇందు కోసం పిల్లలలో ఆలోచనలను, ప్రశ్నలను, సృజనాత్మకతను రేకెత్తించడానికి చెకుముకి మాసపత్రిక 1990లో ప్రారంభించబడింది. ప్రతీఏటా నిర్వహించే చెకుముకి పరీక్షలో లక్షలాది మంది పిల్లలు పాల్గొంటున్నారు.

ప్రజలు విజ్ఞానవంతుల కావాలంటే వాళ్ళు కనీస అక్షరాస్యులు కావాలనే అవసరాన్ని జె.వి.వి గుర్తించింది. కేరళ సైన్సు ఉద్యమం సాధించిన అక్షరాస్యతా ఫలితాలు మన రాష్ట్రానికి ఎంతో ప్రేరణనిచ్చాయి. దాని ఫలితంగానే 1990లో నిర్వహించిన అక్షర కళాయాత్ర, తదనంతర సాక్షరత ఉద్యమం ఇందులో వందలాది మంది ఉపాధ్యాయులు, వాలంటీర్లు ఒక యజ్ఞంగా పాల్గొన్నారు. సాక్షరత ఉద్యమం వేలాదిమంది గ్రామీణ ప్రజలకు విద్యాబుద్ధులు చెప్పింది. ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచింది. 'ఇంటికి దీపం ఇల్లాలి చదువు' అనే నినాదం వేలాది మంది గ్రామీణ మహిళల్లో చైతన్యం నింపింది. జన విజ్ఞానవేదిక కృషి ఫలితంగా నెల్లూరు జిల్లా సారా వ్యతిరేక ఉద్యమ సమన్వయ సమితి ఆవిర్భవించింది. అదే సంవత్సరం నెల్లూరులో 50 వేల మందితో సారా వ్యతిరేక ప్రదర్శన, ఆ తర్వాత రాష్ట్ర సదస్సు జరిగాయి. సారా ఉద్యమం సృష్టించిన ప్రకంపనం చాలా పెద్దది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం మద్యనిషేధ ప్రకటన చేయక తప్పలేదు.

జనవిజ్ఞానవేదిక దేశ సైన్సు ఉద్యమ సంస్థ ఎ.ఐ.పి.ఎస్.ఎన్‌లో భాగస్వామ్యమే. దేశవ్యాప్తంగా ప్రజా సైన్సు ఉద్యమం నిర్వహించే అనేక కార్యక్రమాలలో జె.వి.వి కూడా భాగస్వామ్యం వహిస్తుంది.

జనవిజ్ఞావేదిక ప్రజల అవసరాల కేంద్రంగా అనేక సర్వేలు నిర్వహించింది. వ్యవసాయ సంక్షోభంపై సర్వే, రాష్ట్రంలో కరువుపై వివిధ ప్రాంతాలలో సర్వేలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై సర్వే సమగ్రాభివృద్ధి ప్రణాళిక కొరకు సర్వేలు వీటిలో కొన్ని ముఖ్యమైనవి. ప్రజలను చైతన్యం చేసేందుకు ఎన్నో జాతాలను నిర్వహించింది. ప్రజల కోసం అనేక రకాల కార్యక్రమాలు చేపట్టింది. జనవిజ్ఞానవేదిక శాస్త్ర ప్రచారంలో చేసిన కృషికి గుర్తింపుగా 2006లో కేంద్ర ప్రభుత్వం జాతీయ అవార్డు ఇచ్చి గౌరవించింది. ప్రజలకు-మేధావులకు, ప్రజలకు-శాస్త్రవేత్తలకు, ప్రజలకు- శాస్త్ర విజ్ఞానానికి మధ్య ఒక వారధి నిర్మించే కృషి జనవిజ్ఞాన వేదిక చేసింది. ప్రజల కోసం సైన్సు, ప్రగతి కోసం సైన్సు, స్వావలంబన కోసం సైన్సు అనే నినాదాలతో ఒక వైజ్ఞానిక కార్యచరణ కోసం జె.వి.వి కృషి చేసింది.

ఐతే జన విజ్ఞానవేదిక, ఇతర సైన్సు ప్రచార సంస్థలు ఎంతో కృషి చేపడుతున్నా అంతకుమించిన సవాలు ఎదురవుతున్న కాలంలోకి మనం నెట్టబడుతున్నాము. ప్రపంచీకరణ విషవలయంలో సైన్సు కూడా చిక్కుకోవడం ఒక విషాదం. విజ్ఞానశాస్త్ర పరిశోధనా రంగాలు వ్యాపారుల చేతిలో బందీగా మారుతున్న కాలం. పరిశోధనలకు, ప్రజలకు మధ్య పూడ్చలేని అగాథం ఏర్పడుతోంది. మౌలిక పరిశోధన నిర్లక్ష్యం చేయబడుతుంది. కాసులను కురిపించే టెక్నాలజీకే ప్రాధాన్యత పెరుగుతోంది. టెక్నాలజీని అమ్ముకుని ప్రజలను వినియోగ దారులుగా మార్చే సంస్క ృతి బలపడుతోంది. సైన్సును ఉపయోగించుకునే పరిస్థితి నుంచి సైన్సు దుర్వినియోగం అయ్యే పరిస్థితికి మనం నెట్టబడ్డాం. మరోపక్క అదుపు చేయగలిగామని భావిస్తున్నప్పటికీ మూఢ విశ్వాసాలు జడలు విప్పుతున్నాయి. సూడో సైన్సు ప్రచారం విస్తరిస్తోంది. సైన్సు శాస్త్రీయ దృక్పథాలమీద దాడులు పెరుగుతున్నాయి. ఈ పరిణామాలన్నిం టినీ ప్రజాసైన్సు ఉద్యమ కార్యకర్తలు నిశితంగా పరిశీలించాలి. అధ్యయనం చేయాలి. దీనికి విరుగుడుగా శాస్త్రీయమైన కార్యచరణ రూపొందించుకోవాలి. ఈ కాలంలో ఎదురవుతున్న రెండు సవాళ్ళమీద మనం దృష్టిపెట్టాలి. 1) సైన్సు మీద జరుగుతున్న దాడి మరియు సూడో సైన్సుని నిలవరించడం. 2) వ్యాపార ప్రయోజనాల కోసం శాస్త్రవిజ్ఞానాన్ని, పరిశోధనలను దుర్వినియోగపరచడం ఈ రెండు అంశాలను సరిగా అవగాహన చేసుకోవడంతోపాటు ప్రజలకు శాస్త్రీయ దృక్పథాన్ని అందించే వివిధ కార్యక్రమాల రూపకల్పన చేయాలి. ప్రజల నిత్యజీవితంలో, ఆచరణలో సైన్సుని అంతర్భాగం చేయాలి. ఆ విధంగా ప్రజలు స్వావలంబన కోసం చేసే ప్రయత్నంలో ప్రజాసైన్సు కార్యకర్తలు అండగా నిలవాలి. ఆ దిశగా మన జనవిజ్ఞాన వేదిక ప్రస్థానం ముందుకు సాగాలి.

(రచయిత జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు)



వెండితెర సిరిమల్లె

కొన్ని పదాలు ఎప్పుడోగానీ.. వాడుకలోకి రావు. అలాంటిదే 'షాక్' అనే ఇంగ్లీష్ పదం. మన తెలుగులోని దిగ్భ్రాంతి.. అనే మాటా ఇంచుమించు అలాంటిదే. నటి శ్రీదేవి వల్ల ... కొన్ని లక్షలమంది నోటివెంట ఈ రెండు పదాలూ గత మూడు, నాలుగు రోజుల నుంచి సర్వ సాధారణంగా వాడే పదాలుగా మారిపోయాయి. శ్రీదేవి హఠాన్మరణం ఇచ్చిన 'షాక్' అలాంటిది. ప్రేక్షకుల్ని 'దిగ్భ్రాంతి'కి గురిచేసిన సందర్భం అలాంటిది. శ్రీదేవి మరణించి మూడురోజుల కావొస్తోంది. అయినా.. అభిమానులు ఇంకా షాక్‌లోనే ఉన్నారు. 'మానవా!.. మానవా!' అంటూ నిన్నటి మొన్నటి అర్ధరాత్రి వరకూ ప్రేక్షకుల్ని వెంటాడిన ఆ స్వరం.. అంతే నిశ్శబ్దంగా.. ముంజేతి వేళ్ళతో నమస్కరిస్తూ.. పలకరిస్తూ.. దేవకన్యలానే మాయమైపోయింది. మాయమైతే మాయమైపోయిందిగానీ, ఆమె గురించి మరో నాలుగుతరాలు చెప్పుకునేలా.. లెక్కకుమించిన పాఠ్యపుస్తకాలను మనకు బహుమతిగా ఇచ్చి పోయింది. శ్రీదేవి ఒక నటశిక్షణాలయం. అందులో మనందరిదీ ప్రేక్షకపాత్ర మాత్రమే. ఆమె నటకీర్తిని తక్కిట్లో వేసి తూకమేయడం కష్టం. వేయాలని ప్రయత్నించడమూ సాహసమే!

నలభై ఏళ్ళక్రితం పుట్టిన అంకుల్స్, ఆంటీస్ నుంచి.. నిన్ననే నిర్మలా కాన్వెంట్‌కి వెళ్ళడం మొదలెట్టిన నటుడు శ్రీకాంత్ పిల్లాడు వరకూ.. 'నీకు నచ్చిన హీరోయిన్ ఎవరోయ్..?' అని అడిగితే.. 'ఒకటి శ్రీదేవి, రెండు శ్రీదేవి, మూడు శ్రీదేవి। అంటూ.. వరసగా వందంకెలు వరకూ శ్రీదేవి పేరే చెప్తారు. ఆపేరులో ఉన్న మహత్యం అలాంటిది. ఒక నటి.. ఇన్ని భాషలు, ఇన్ని ప్రాంతాలు, ఇంతటి వైవిధ్యాల సంస్కృతుల్ని పెనవేసుకుంటూ, అందర్నీ.. అంటే దేశం మొత్తాన్ని తనవైపు తిప్పుకోవడం అంటే.. సాధారణ విషయం కాదు. ఎల్లలులేని కళ అనే మాటను అక్షరాల నిజంచేసి చూపించారు శ్రీదేవి. అంతేకాదు, ఎక్కడైనా అగ్రతారగానే వెలుగొందడం అంటే.. నటులందరికీ సాధ్యంకాని విషయం. కానీ శ్రీదేవిని భారతీయ చిత్ర పరిశ్రమంతా.. తమ సొంతూరమ్మాయిగానే భావించింది. అంతే ప్రేమగా గుండెల్లో పెట్టుకుని ఆదరించింది. ఆరాధించింది.

ఆమె.. ఓ గాడ్‌ఫాదర్

ఎక్కడో తమిళనాట అయ్యంగార్ కుటుంబంలో పుట్టిన శ్రీఅమ్మ అయ్యంగార్ అనే అమ్మాయిలో ఏముందబ్బా?! అందర్నీ.. అంతలా తనను ఆకట్టుకునేసింది.. నిజానికి ఉత్తరాది వాళ్ళు.. దక్షిణాది కళాకారుల్ని అంతగా ఒప్పుకోరు. నటనలో ఎంత ప్రతిభ ఉన్నా.. పట్టించుకోరు. పట్టించుకున్నా.. భుజానెత్తుకుని.. ఊరేగించరు. కానీ, శ్రీదేవి మాత్రం దక్షిణాది అమ్మాయా? అనే ప్రశ్నలకూ ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా.. బాలీవుడ్ తెరపై అగ్రస్థాయిలో వెలుగొందింది. అలా హిందీ సినిమాల్లోకి వెళ్ళిందో లేదో... రెండు మూడు సినిమాలకే.. నెంబర్‌వన్ స్థాయిని అందుకోవడం అంటే.. ఏదో మిరాకిల్ జరగాలి. జరిగితేనే.. శ్రీదేవిలాంటి అద్భుతాలు జరుగుతాయి. కానీ, ఇక్కడ శ్రీదేవి.. తానో అగ్రతారగా మారడానికి తనని తానే ఓ వారధిగా మలచుకుంది. ఇంకా వివరంగా చెప్పాలంటే.. తన ఎదుగుదలలో తన వెనకున్న గాడ్‌ఫాదర్ ఎవరోకాదు.. శ్రీదేవినే.

బాలీవుడ్ మాత్రమే కాదు, పుట్టిపెరిగిన తమిళ సినిమా, తెలుగు, మలయాళీ పరిశ్రమ, కన్నడం ఇలా.. దక్షిణాది పరిశ్రమమలోనూ శ్రీదేవి నెంబర్‌వన్‌గా రాణించి.. దశాబ్దాలపాటు ఓ వెలుగు వెలిగిన వైనంలో ఆమె వెనుక గాడ్‌ఫాదర్స్ ఎవరూ లేరు. అక్షరాలా ఆమెకు ఆమే గాడ్‌ఫాదర్ అయ్యింది. కేవలం స్వయంకృషితో బహుభాషా చలనచిత్ర పరిశ్రమలో తిరుగులేని, ఎదురులేని కథానాయిక అనిపించుకుంది. ఇలా వెలగాలంటే.. ఏదో ఉంటేగానీ సాధ్యం కాదు. నిజంగానే శ్రీదేవిలో ఏదో మహత్తు ఉంది. అదే.. ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసే సమ్మోహనం. అది తనలో మాత్రమే ఉన్న ప్రత్యేక సమ్మోహనాస్త్రం. అలా సమ్మోహన పరిచేది ఆమె నటనా..? అందమా? అని ప్రశ్న వేసుకున్నప్పుడు.. రెండూ కారణమే! ఆమె అతిలోక సుందరి.. ఎంత అతిలోక సుందరో అంత నటనా వైదుషిణి.

కెమెరా ముందు సివంగి

బాలనటిగా మొదలైన శ్రీదేవి సినిమా ప్రస్థానంలో బాల్య నటజీవితమూ వైభవోపేతమైందే. చిన్నప్పటి పాత్రల్లో చిచ్చర పిడుగులా నటించి.. 'ఉత్తమ బాలనటి' అవార్డులూ బోల్డన్ని తెచ్చుకుంది. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ ఇలా బాలనటిగా ఏభాషలో నటించినా.. ముద్దుముద్దుగా తనే.. ఆ భాషలో డబ్బింగ్ చెప్పి.. ప్రేక్షకుల్ని అలరించింది. అంతేకాదు, అప్పటి టాప్‌హీరోలు శివాజీగణేషన్, ఎన్టీఆర్, అక్కినేని, కృష్ణలకు పాపగానూ నటించింది. ఆనక ఆ హీరోలతోనే సరిజోడీగా.. నువ్వానేనా అన్నట్టు నటించడం గొప్ప విశేషం. నాడు మనవరాలిగా నటించి తర్వాత అదే హీరోతో హీరోయిన్‌గా నటించడమే ఒక అబ్బురమనుకుంటే.. ఆ హీరో వారసులతోనూ కథానాయికగా నటించడం మరో విశేషం. బహుశా ప్రపంచంలో ఏ హీరోయిన్‌కీ సాధ్యం కాని.. ఇలాంటి నటనావకాశాలు శ్రీదేవికే సాధ్యమయ్యాయి.

సింగిల్‌టేక్ హీరోయిన్

ఓకే.. అన్నీ బాగున్నాయ్.. అసలు శ్రీదేవి ఎలాంటి నటి..? అన్నప్పుడు.. సింగిల్ టేక్‌లో.. దుమ్ముదులిపే ఆర్టిస్టు అని ఎప్పుడో బాలీవుడ్ దిగ్గజ దర్శకులు యశ్‌చోప్రా, టాలీవుడ్ దర్శకేంద్రుడు రాఘవేంద్రుడు, దర్శకరత్న దాసరి వంటి దర్శకులు సర్టిఫై చేసేశారు. ఆమె కెమెరా గుట్టు తెలిసిన నటి. అలాంటి టైమింగ్, రైమింగ్ తెలియబట్టే.. శ్రీదేవి గొప్పనటి అయ్యింది. శ్రీదేవి ఓ అతిలోకసుందరి.. అంటూ అందమైన నటిగా... అభిమానులంతా కీర్తించుగాక.. అంతకుమించి నవరసాలను అద్భుతంగా పలికించగల నటి. 'శ్రీదేవి చాలా అందమైన హీరోయిన్ మాత్రమేకాదు.. అంతకుమించి మహాద్భుతంగా నటించగల నటి. నేనయితే ఆ అమ్మాయిని.. మహానటి అంటాను' అని సీనియర్ నటీమణి జమున అన్నారంటే శ్రీదేవి నటనాస్థాయి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. ఎప్పుడో 'బడిపంతులు' సినిమాలో ఎన్టీఆర్ మనవరాలిగా చేసిన ఆమె.. తర్వాత కాలంలో ఆయనతోనే హీరోయిన్‌గా చేయాలంటే.. ఎంతో ధైర్యం కావాలి? ఆటలు, పాటలు చేయడం ఒక ఎత్తు.. ముసలి హీరోలతో పడుచు హీరోయిన్లు.. సినిమాల్లో అలా ఆడిపాడి మెప్పించవచ్చు. కానీ, 'బొబ్బిలిపులి' లాంటి సినిమాలో క్లైమాక్స్‌లో వచ్చే కోర్టుసీన్‌లో.. ఎన్టీఆర్‌కు ఏమాత్రం తగ్గకుండా పోటీపడి శ్రీదేవి నటించడం.. ఎప్పటికీ ప్రేక్షకులు మరచిపోలేరు. ఇలా శ్రీదేవి గొప్పగా నటించిన పాత్రలెన్నో...! అవన్నీ వర్ధ, ప్రవర్ధమాన నటులకు వెలకట్టలేని నటశిక్షణ పాఠాలే!

స్టార్‌స్టేటస్ పట్టించుకోని.. నిగర్వి

శ్రీదేవిని దగ్గరగా చూసిన తోటి నటీనటులు, దర్శక నిర్మాతలు అనేమాట ఒకటే : 'ఆవిడ సెట్లో ఎంత నిశబ్దంగా, మృదుస్వభావిగా ఉంటారో.. కెమెరా ముందుకు వెళ్ళాక ఆమె తీరే వేరు. సివంగిలా మారిపోతారు. ప్రొఫెషనల్ ఆర్టిస్టు అనే మాటకు నిజమైన అర్థం ఆవిడే..' అంటారు శ్రీదేవితో కలిసి పనిచేసిన సినిమా టెక్నీషియన్లు. నటిగా శ్రీదేవి ప్రయాణం చాలా పెద్దది. బాలనటిగా, గ్లామర్ నటిగా.. ఆక్రమంలో భారతీయ సినిమారంగాన తొలి 'లేడీ సూపర్‌స్టార్'గా... ఆ వరసలో 'మామ్'గా... ఇలా నటిగా ఎంతో ఉన్నతంగా కొనసాగుతున్న ప్రయాణంలో.. తనను తాను కొత్తగా, వైవిధ్యంగా ఎప్పటికప్పుడు మలచుకుంటూ.. అతిలోక సుందరిగానే శ్రీదేవి వెలిగారు..మిగిలారు. ప్రొఫెషన్ కోసం ఎంత కష్టపడాలో అంత కష్టపడ్డంవల్లనే.. నటిగా శ్రీదేవి.. అందరికీ ఓ రోల్‌మోడల్ అయ్యారు.

ఓ కళాకారిణిగా.. అజాతశత్రువుగా ఉండగలగడం అందరికీ సాధ్యం కాదు. కానీ.. అలా ఉండొచ్చు.. అని శ్రీదేవి నిరూపించారు. "నేనొకసారి.. షూటింగ్‌లో.. శ్రీదేవిగారితో కలిసి పనిచేస్తున్నప్పుడు.. 'శ్రీదేవిగారూ' అని పిలిచాను. అందుకు ఆమె చాలా కోప్పడి... 'గారు అనొద్దు కవితా..! శ్రీ.. అను చాలు. మనిద్దరం కలిసి సినిమా చేస్తున్నాం. మధ్యలో ఈ గార్లు ఎందుకు?' అని ఎంతో స్నేహంగా అన్నారావిడ. నేను బాగా ఉండాలని మేకప్ చేసుకునేటప్పుడు ఎన్నో టిప్స్ చెప్పారు. ఎవరైనా తోటి హీరోయిన్లు అందంగా కనపడితే ఈర్ష్య పడతారు. కానీ, శ్రీదేవే స్వయంగా నేను.. ఇంకా బాగా కనపడాలని.. నాకు మేకప్ టిప్స్ చెప్పడం మరచిపోలేను. ఆరోజు నుంచి నాకు నేనే మేకప్ వేసుకుంటున్నా. ఇప్పటికీ నామేకప్ గురువు ఆవిడే" అంటూ శ్రీదేవి తోటి నటీనటుల పట్ల ఎలా ఉండేవారో గుర్తు చేసుకున్నారు సీనియర్ నటి కవిత.

ఇలా ఒక నటిగా శ్రీదేవి... నూటికి నూరుపాళ్ళు తన వృత్తికి న్యాయం చేసిన నటి. వర్తమానమే కాదు.. రాబోయే తరాల నటీనటులకూ నటన అనే వృత్తిలో ఎలా ఉండాలో తానొక పాఠంగా నిలిచిన ఏకైక నటీమణి. అందుకే.. శ్రీదేవి.. వెండితెరపై చెరగని చిరునవ్వు. ఆ నవ్వు ఎలాంటిదంటే..

పూలరెక్కలు.. కొన్ని.. తేనెచుక్కలు
రంగరిస్తివో.. ఇలాంటి బొమ్మ చేస్తివో
అసలు భూలోకం..
ఇలాంటి సిరి చూసి ఉంటదా?!
మహాగొప్పగా.. మురిపించగా.. సరికొత్త సంగతి
తలతిప్పక.. మనసొప్పక నిలిచే జాబిలి..
వెండితెరపై సిరిమల్లి.. మన శ్రీదేవి..!
నో ఒన్ కెన్ రీప్లేస్ హర్!

- గంగాధర్ వీర్ల





మహిళా చైతన్యంతోనే మౌఢ్యానికి చరమగీతం

మానవ సంబంధాలను బలపర్చే శక్తి సైన్స్‌కి మాత్రమే ఉంది. శాస్త్రీయ ఆలోచనే వివేకం. మనిషిని మిగిలిన జంతుసమూహాల నుంచి వేరుచేసి నాగరికమైన కుటుంబవ్యవస్థని రూపొందించుకునేలా చేసిందీ శాస్త్రీయ అవగాహనే. కానీ సైన్స్‌ని గుప్పిట్లో పెట్టుకున్న పెట్టుబడిదారులు, శాస్త్రీయ ఆలోచనలను ఎదగనివ్వకుండా చేసే మూఢవిశ్వాసాల వ్యాపారులూ ప్రజలకు సైన్స్ అవగాహనని దూరం చేయడానికి ప్రసారసాధనాల ఆసరాగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలనే లక్ష్యంగా చేసుకుంటారు. ఫిబ్రవరి 28, 'జాతీయ సైన్స్ దినోత్సవం' సందర్భంగా ఆయా అంశాలపై 'జీవన' ఫోకస్.

మన కుటుంబాలలో సైన్స్ వల్ల ఉత్పత్తి అయిన వస్తు సామగ్రిని ఉపయోగించుకుంటూనే మరోవైపు శాస్త్ర విజ్ఞానానికి విరుద్ధంగా ప్రవర్తించడాన్ని చూస్తుంటాం. కడుపులోంచి బిడ్డ బయటకు వచ్చింది మొదలు మరణానంతరం బూడిదయ్యేంత వరకూ శాస్త్రవిజ్ఞానాన్ని పక్కనపెట్టేసి.. ఆచార సంప్రదాయాల పేరుతో గుడ్డిగా మూఢనమ్మకాలకు అందరూ పెద్దపీట వేస్తూనే ఉన్నారు.

పుట్టడమే సైన్స్‌కు దూరంగా!

శిశువు పుట్టిన వెంటనే తల్లి నుంచి తొలిపాలు అందాయో లేదో చూడకుండానే ఏ తిథిలో? ఏ నక్షత్రంలో పుట్టారు? పెద్దయ్యాక ఏమవుతారు? అంటూ జ్యోతిష్యుల దగ్గరకి పరుగులుతీసే ప్రబుద్ధులు ఎంతోమంది ఉన్నారు. వైద్యవిజ్ఞాన పరిశోధనలవల్ల కొన్ని సందర్భాలలో తల్లీబిడ్డలకు ప్రమాదం లేకుండా సిజేరియన్ ఆపరేషన్లని చేసే సౌలభ్యం వచ్చింది. దీనిని తమ స్వార్థానికి ఉపయోగించుకునే మూఢనమ్మకాల్లో మునిగినవాళ్ళ తామే సమయాన్ని నిర్ధేశించి, డాక్టర్లకు అధికమొత్తంలో సొమ్మిచ్చిమరీ ఆపరేషన్లు చేయిస్తున్నారు. సైన్స్ తెలిసిన డాక్టర్లూ మూఢనమ్మకాలను నమ్మేవారికి అనుగుణంగా ప్రలోభానికి గురై, వ్యవహరిస్తున్నారు. ఇలాంటి సమయాల్లో గర్భిణీలు పడే యాతన వర్ణనాతీతం.

కుటుంబవ్యవస్థలో సైన్స్ అవగాహన లేకపోవడానికి కారణం పురుషాధిక్యత ఒకటైతే మహిళలకు విద్య, స్వీయ ఆలోచనలకూ దూరం చేయడం ఇంకోకారణం, ఆర్థికంగా స్వాతంత్ర్యం లేకపోవడం వల్ల మహిళలు సైన్స్ అందించిన వివేకవంతమైన ఆలోచనలకు దూరమై, తమ ప్రమేయం లేకుండా మూఢనమ్మకాల ఊబిలో కూరుకుపోతున్నారు. సైన్స్‌ని ఉపయోగించుకుంటూనే మూఢ నమ్మకాలకు వక్ర భాష్యాలు చెప్పే సూడో సైన్స్ ప్రచారకులు ఎక్కువమంది కన్పిస్తున్నారు.

మూఢనమ్మకానికి సైన్స్ ముసుగులు

మహిళలు గాజులు వేసుకోవడానికీ సూడో సైన్స్ ప్రచారకులు దాని వెనుక సైన్స్ ఉందనే చెబుతున్నారు. వారు చెప్పేది ఇలా ఉంటుంది... "ప్రాచీన కాలంలో కేవలం పురుషులే బయటికి వెళ్లి శారీరకశ్రమ చేసేవారు. దీంతో వారు ఆరోగ్యంగా ఉండేవారు. అయితే మహిళలు ఎప్పుడూ ఇంటిపట్టునే ఉండి, తక్కువగా శ్రమిస్తారు కాబట్టి వారికి గాజులను ధరింపజేసేవారు. దీంతో ఆ గాజుల వల్ల అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయట! గాజులు ఎల్లప్పుడూ చేతి నరాలకు తాకుతూ ఉండడం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుందట!! అంతేకాకుండా స్త్రీ శరీరం నుంచి విడుదలయ్యే నెగెటివ్ శక్తిని నిర్వీర్యం చేసేందుకూ గాజులను ధరింపజేసే వారట!" ఇదీ వారు చెప్పే సైన్స్. అలా అయితే బీపీతో ఉన్న పురుషులకూ గాజులు వేస్తే సరి. కానీ సైన్స్ తెలిసిన డాక్టర్ ఎవరూ ఇలా చెప్పరు.

సూడో సైన్స్ ప్రచారం

పిల్లలకు చెవులు కుట్టించడం ఎప్పటి నుంచో వస్తున్న ఆటవిక సంప్రదాయం. అలా కుట్టించిన రంధ్రాల్లో రకరకాల ఆభరణాలు వేలాడదీయిస్తుంటారు. అయితే దీనికీ సూడోసైన్స్ ప్రచారకులు కొత్త అర్థం చెబుతున్నారు. అదేమిటంటే "ఇలా కుట్టించడం వల్ల ఆక్యుప్రెషర్ వైద్యం జరిగి, దాంతో వారికి వచ్చే అనారోగ్యాలు పోతాయట! ప్రధానంగా ఆస్తమా వంటి వ్యాధులు రావట!' మహిళలు మూఢంగా అనుసరించే ఒక సంప్రదాయానికి సూడోసైన్స్ ప్రచారకుల సమర్థన ఇదీ..


"కాలి వేళ్లకు మెట్టెలు ధరించడం వల్ల ఆక్యుప్రెషర్ వైద్యం జరిగి వారి గుండె నుంచి గర్భాశయానికి రక్త ప్రసరణ బాగా జరుగుతుందట! దీంతో వారి రుతు క్రమం సరిగ్గా ఉంటుందట.. అయితే వెండి మెట్టెలు ధరిస్తే ప్రకృతిలో ఉన్న పాజిటివ్ ఎనర్జీ వారి శరీరంలోకి ప్రవేశిస్తుందట". ఇది పూర్తిగా అశాస్త్రీయం. దీనికీ సైన్సుకీ ఎలాంటి సంబంధం లేదు.

ఇలాంటిదే మరొకటి ..."ఆలయాల్లో ఉండే గంటను ఏడు సార్లు కొడితే శరీరంలో ఉన్న ఏడు చక్రాలు ఉత్తేజం అవుతాయట! అంతేకాదు మెదడు కుడి, ఎడమ భాగాలు రెండూ కొంతసేపు ఏకమవుతాయట. దీంతో మనస్సుకు ప్రశాంతత కలుగుతుందట. ఏకాగ్రత పెరుగుతుందట. గంటను మోగించడం వల్ల ఆ ప్రాంతంలోని గాలిలో ఉండే క్రిములు నాశనమవుతాయట.." దీనిని పూర్తిగా సైన్స్ అంగీకరించదు. ఇదీ మహిళలను భక్తి పేరుతో గుప్పిట్లో పెట్టుకోవడానికి ప్రయత్నించే సూడో సైంటిస్టుల వ్యాపింపజేసే భావజాలమే.

భయపెట్టి నమ్మించడం

నిద్రించేటప్పుడు తలను ఉత్తరానికి పెట్టకూడదట! భూమికి అయస్కాంత క్షేత్రం ఉన్నట్టుగానే శరీరానికీ అయస్కాంత క్షేత్రం ఉంటుందట! ఇలాంటివన్నీ అవాస్తమని శాస్త్రవేత్తలు ఎప్పుడో స్పష్టం చేశారు. "మహిళలు నుదిటిన కుంకుమ బొట్టును ధరిస్తే అక్కడి నరాలు ఉత్తేజితమై పీయూష గ్రంథిని యాక్టివేట్ చేస్తాయట! దీంతో బీపీ, ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు తగ్గుముఖం పడతాయట!! ఇలాంటివన్నీ చాలా అశాస్త్రీయం.

సైన్స్ పరిశోధనల వల్ల రూపుదిద్దుకున్న టీవీ ఛానళ్ళ, సినిమాల్లో అందుకు విరుద్ధంగా మూఢత్వాన్ని ప్రచారం చేయడమే తీవ్రంగా ఉంది. ఉదయం వేళల్లో ప్రవచనాలు, స్వస్థత సభలు పేరుతో మూఢనమ్మకాలు ప్రసారం చేయడం, సాయంత్రం ప్రైమ్‌టైమ్‌లో ఆత్మలు, పాముపగలు, తాయత్తులు, మంత్రాలు వంటి మూఢనమ్మకాలను కథావస్తువులుగా చేసుకుని టీవీ సీరియళ్లని ప్రసారం చేయడం. ఆత్మలు, దేవుళ్ల వంటి కథావస్తువులకు సైన్స్ సాయంతో గ్రాఫిక్స్ సృష్టించి, జనాన్ని మూఢత్వంలోకి నెట్టడంలో సినిమాలు కూడా శాస్త్రీయ ఆలోచనలను దూరం చేస్తున్నాయి. వీటన్నింటినీ అవగాహన చేసుకుని, మహిళలు సైన్స్ పట్ల తగినంత అవగాహన పెంచుకుంటేనే కుటుంబం, తద్వారా సమాజం శాస్త్రీయ ఆలోచనల వైపు అడుగులేస్తుంది.



- బెందాళం క్రిష్ణారావు

మీ కోసం

నిమ్మరసంలో కర్పూరం కలిపి తలకు రాసుకుంటే చుండ్రు తగ్గుతుంది.



జీవన సౌరభం

వివేకి ఎన్నడూ జరిగిన నష్టాన్ని తలచుకొని దిగులుపడడు. దాన్ని ఎలా భర్తీ చేయాలా అని మాత్రమే ఆలోచిస్తాడు.

సెన్సెక్స్ ⬇ 99
34,346

నిఫ్టీ ⬇ 08
10,554

రూపాయి ⬇ 08 పైII
అమెరికా డాలరుకు రూ.
64.88



▮ హ్యుందాయ్ నుంచి 'నెక్సో'

ప్రముఖ కార్ల తయారీ కంపెనీ హ్యుందాయ్ తన ఐకానిక్ గ్లోబల్ ఎలక్ట్రిక్ వాహనం 'హ్యుందాయ్ నెక్సో'ను ప్రదర్శించింది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఇండియా-కొరియా బిజినెస్ సమ్మిట్ 2018లో దీన్ని ఆ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎస్‌హెచ్ కిమ్ ఆవిష్కరించారు.



▮ ఈ బైకు చాలా ఖరీదు

ట్రయంప్ మోటార్ సైకిల్స్ ఇండియా దేశ మార్కెట్లోకి కొత్త క్లాసిక్ 'బొన్నెవిల్లే స్పీడ్‌మాస్టర్' ను ఆ కంపెనీ ఎండి విమల్ సుమ్‌బ్లి విడుదల చేశారు. దీని ధర రూ.11.11లక్షలుగా నిర్ణయించారు. పవర్‌ఫుల్ ట్విన్ డిస్క్ బ్రెమ్బో బ్రేక్స్, ఫుల్ 5 అంగుళాల ఎల్ఇడి హెడ్‌లైట్స్, 10వేల కిలోమీటర్లకు ఒక్కసారి సర్వీసింగ్ దీని ప్రత్యేకతలుగా ఉన్నాయి.

డిజిటల్ వాలెట్లకు కెవైసి తప్పనిసరి

మార్చి 1 నుంచి అమలు : ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : డిజిటల్ పేమెంట్ వాలెట్లకు రిజర్వు బ్యాంకు నుంచి ఎదురుదెబ్బ తగిలింది. ఈ సంస్థలు మార్చి ఒక్కటో తేది నుంచి వినియోగదారుల నుంచి తప్ప కుండా కెవైసి వివరాలు తీసుకోవాల్సిందేనని ఆర్‌బిఐ ఆదేశించింది. కాగా గడువు పొడగించాలని వాలెట్ సంస్థలు పెట్టుకున్న విజ్ఞప్తిని పట్టించుకోలేదు. దీంతో పేటియం, ఓలా మనీ, గూగుల్ తేజ్ వంటి డిజిటల్ వాలెట్లకు లేదా ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రుమెంట్‌కు ఇప్పటికే సరిపోయేంత సమయం ఇచ్చామని ఆర్‌బిఐ పేర్కొంది. మరోసారి ఈ గడువును పొడిగించలేమని తేల్చి చెప్పింది. ఇప్పటికీ కెవైసి నిబంధనలు పూర్తి చేయని వారికి ఫిబ్రవరి 28 తర్వాత కూడా తమ బ్యాలె న్స్‌ను కొనుగోళ్లకు ఉపయోగించుకోవచ్చని లేదా పిపిఐ అకౌంట్‌ను క్లోజ్ చేసుకో వచ్చని ఆర్‌బిఐ తెలిపింది. ఈ బ్యాలెన్స్ నగదును ఖాతాదారులు తమ బ్యాంకు అకౌంట్లకు బదిలీ చేసుకోవచ్చని వెల్లడించింది. బ్యాంకులు ప్రమోట్ చేసే 50 వాలెట్లతో పాటు 55 ప్రీపెయిడ్ వాలెట్లు ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్నాయి. వీరం దరూ ఫిబ్రవరి 28 వరకు ఈ ప్రక్రియను పూర్తిగా చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. తొలుత 2017 డిసెంబర్ 31 వరకు కెవైసి వివరాలులు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

స్కూటర్ పరిశ్రమ 18% వృద్ధి

టివిఎస్ మోటార్ మార్కెట్ హెడ్ వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

భారత్‌లో స్కూటర్ పరిశ్రమ ప్రతీ ఏడాది 18 శాతం చొప్పున పెరుగు తుందని టివిఎస్ మోటార్ కంపెనీ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అనిరుద్ధ హల్దార్ అన్నారు. మంగళవారం హైద రాబాద్‌లో టివిఎస్ ఎన్‌టార్క్ 125ను విడుదల చేశారు. తెలుగు రాష్ట్రాలో ఈ స్కూటర్ ధర ఎక్స్‌షోరూం వద్ద రూ.61,450గా నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మొత్తంగా ప్రతీ నెల 5.7 లక్షల స్కూటర్లు అమ్ముడవుతున్నాయన్నారు. ద్విచక్ర వాహన మార్కెట్‌లో స్కూటర్లు 34 శాతం వాటా కలిగి ఉన్నాయన్నారు. 2018-19లో తాము టివిఎస్ 2 లక్షల యూనిట్లు అమ్మకాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు.



టివిఎస్ ఎన్‌టార్క్ 125ను ఆవిష్కరిస్తున్న ఆ కంపెనీ ప్రతినిధి అనిరుద్ధ హల్దార్.

ఎగవేతలన్నీ ప్రయివేటోళ్లవే..

ప్రభుత్వ సంస్థల పారు బకాయిలు లేవు

మొండి బాకీలపై ఎస్‌బిఐ చీఫ్ తీవ్ర వ్యాఖ్యలు

ఎగవేతదారులు.. హితబోధలా చేస్తారా

బ్యాంకులను ఎందుకు ప్రయివేటీకరించాలి?

పిఎస్‌బిలే ప్రమాణాలు పాటిస్తున్నాయి

ఇటి ఇంటర్వ్యూలో రజ్నీష్ కుమార్



ప్రజాశక్తి-బిజినెస్ డెస్క్

గత కొద్ది రోజులుగా ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రయివేటీకరించాలని వస్తున్న వ్యాఖ్యలపై ఎస్‌బిఐ చీఫ్ తీవ్రంగా మండిపడ్డారు. మొండి బాకీలన్నీ ప్రయివేటు సంస్థలవేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఎగ్గొట్టిన దాఖలలు లేవని పేర్కొన్నారు. దొంగలే.. దొంగా దొంగా అన్నట్లు వారి వ్యవహారం ఉందని పరోక్షంగా పారి శ్రామిక సంఘాల ప్రతినిధులను తీవ్రంగా విమర్శించారు. అప్పులు ఎగ్గొట్టే వాళ్లే తమకు ముందు వరుసలో కూర్చుండి నీతి సూత్రాలు వల్లిస్తున్నారని ఎస్‌బిఐ ఛైర్మన్ రజ్నీష్ కుమార్ అన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రయివేటీ కరణపై మంగళవారం ఆయన ఎనకామిక్స్ టైమ్స్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో పారిశ్రామికవర్గాల అప్పులపై విరుచుకుపడ్డారు. ఆ వివరాలు.. ప్రభుత్వ సంస్థల్లోనే అత్యున్నత పరిపాలనా ప్రమాణాలు పాటిస్తున్నారని స్పష్టం చెప్పారు. ప్రయివేటు రంగంలో గవర్నెన్స్ ప్రమాణాలు అంతంత మాత్రమేనని, దీంతో ఆ రంగం మొండి బాకీలు పెరుగుతున్నాయన్నారు.

వాళ్లు ముందు.. మేము వెనుకాలా..?

ప్రయివేటు రంగంలోని సంస్థల్లో కార్పొరేట్ పరిపాలనా విధానాలు చాలా బాగుంటే ఈ పరిస్థితి ఎందుకు ఉంటుందన్నారు. కాగా ప్రభుత్వ రంగంలోని ఏ సంస్థ ఇప్పుడు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) వద్ద ఉందో చెప్పాలని రజ్నీష్ ఒక విధంగా సవాల్ విసిరారు. ప్రస్తుతం లా ట్రైబ్యునల్ వద్ద ఉన్న కంపెనీలన్నీ ప్రైవేటువే కదా అని ప్రశ్నించారు. రుణ ఎగవేతదారులంతా వారి పరిశ్రమకు సంబంధించిన సంఘాల్లో ముందు వరుసలో కూర్చుకుంటారని, పైగా అందరికీ హితబోధలు చేస్తారని విమర్శలు గుప్పించారు. ఈ కాలంలో జరుగుతున్నదంతా ఇదే కదా అని ప్రశ్నించారు. ఎగవేతదారులంతా ముందు వరుసలో ఉంటే బ్యాంకర్లంతా వెనక వరుసలో కూర్చోవల్సిన దుస్థితి నెలకొందన్నారు. అద్దాల మేడల్లో ఉండేవారు అవ తలి వారిపై రాళ్లు విసరొద్దు అని ఘాటుగా స్పందించారు.

మొండి ఘటాల వెనుక..

ఈ మధ్య కాలంలో పంజాబ్ నేషనల్ బ్యాంకుకు వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ దాదాపు రూ.11,500 కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పలాయనమయ్యారు. బ్యాంకింగ్ చరిత్రలోనే ఈ అతిపెద్ద మోసంతో పిఎస్‌బిలపై తీవ్ర చర్చకు దారి తీసింది. కాగా అసోచామ్, ఫిక్కీ లాంటి సంస్థలు ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రయివేటీకరించాలని పలు వేదికలపై వాళ్ల ప్రతినిధులు పదేపదే సూచనలు చేశారు. ఇదే సందు అని ప్రభుత్వ బ్యాంకులను తమ సొంతం చేసుకోవచ్చు అనుకున్నారమే ఏమో కొటాక్ మహీంద్రా బ్యాంకు ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఉదయ్ కొటాక్ స్వరం పెంచి పిఎస్‌బిల్లో సర్కార్ వాటాను కుదించు కోవాలన్నారు. అసోచామ్ మాజీ అధ్యక్షుడు రాజ్‌కుమార్ దూత్ కూడా బ్యాంకులకు భారీగా అప్పులు పడి ఇప్పటికీ చెల్లించలేదు. మొండి బాకీల జాబితాలో ఈయన పేరూ ఉంది. కాగా నీరవ్ మోడీ సిఐఐ భాగస్వామ్యంతోనే దావోస్ లో జరిగిన అంతర్జాతీయ ఆర్థిక సమ్మిట్‌కు హాజరయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో రజ్నీష్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

అక్కడ ప్రయివేటు శాఖలేవీ..?

సమాజ శ్రేయస్సు, సామాజిక స్పృహతో ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రమే పని చేస్తున్నాయని రజ్నీష్ అన్నారు. సమాజం మెరుగుపడేందుకు ప్రభుత్వ సంస్థలు కచ్చితమైన పాత్ర పోషిస్తాయన్నారు. పట్టణాలకు దూరంగా, పల్లెల్లో, ఇబ్బందికరమైన పరిస్థితుల్లో శాఖలను నడుపుతున్న ప్రైవేటు సంస్థలు ఏమైనా ఉన్నాయా అని ఆయన ప్రశ్నిం చారు. 12 కిలోమీటర్ల చొప్పున నడిచి పోయి కూడా పిఎ స్‌బి సిబ్బంది సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. అంకిత భావంతో పిఎస్‌బిలు మాత్రమే పని చేస్తున్నాయన్నారు. ప్రజలకు బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకం పోగొట్టేలా పిఎన్‌బి వ్యవహరిస్తుందని తాను భావించడం లేదన్నారు.

విస్తరణపై మైగేట్ దృష్టి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

గేటెడ్ ప్రాంగణాలకు మొబైల్ ఆధారిత సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ అందించే మైగేట్ సంస్థ హైదరాబాద్‌కు విస్తరించినట్లు తెలిపింది. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మైగేట్ సిఇఒ విజయ్ అరిశెట్టి మాట్లాడుతూ ఇది వరకు బెంగళూరులో మాత్రమే తమ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రాబోయే రెండేళ్లలో 7 నగరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇటీవలే ప్రైమ్ వెంచర్ పార్టనర్స్ ద్వారా తొలి దశ ఫండింగ్‌లో భాగంగా రూ.16 కోట్లు సమీకరించామన్నారు. మైగేట్ అనేది మొబైల్ ఆధారిత వ్యవస్థ అన్నారు. గార్డులు మాన్యువల్‌గా చేసే పలు పనులను ఇది ఆటోమేట్ చేయడంతో పాటుగా డిజిటైజింగ్ చేస్తుందన్నారు.

అందుబాటులోకి బ్యాచ్‌ట్యాగ్.కమ్



ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ వ్యవస్థాపకులు సిఇఒ డాక్టర్ మధుకర్ గంగాడి కొత్తగా ఆన్‌లైన్ పోర్టల్ బ్యాచ్‌ట్యాగ్.కమ్‌ను ప్రారంభిం చారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ ఫర్నీచర్, గృహోపకరణాలు, భవన నిర్మాణ సామగ్రి తదితర ఉత్పత్తులను తయారీదారు నుంచి డైరెక్టుగా వినియోగదారుడికి చేర్చే లక్ష్యంతో దీన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. వివిధ రకాల ఉత్పత్తులను అందించేందుకు గాను పరిశ్రమలోని ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ (ఒఇఎం)లతో బ్యాచ్‌ట్యాగ్.కమ్ ఒప్పందాలు కుదుర్చుకున్నా మన్నారు. ఇందుకోసం రూ.15 కోట్ల పెట్టుబడి పెట్టామన్నారు. భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులకు నిధులు సమీకరించనున్నామన్నారు.

డీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

మూర్తిమత్వం అనే పదం దేని నుంచి వచ్చింది?



ఎస్.పి. మనోహర్‌కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణాజిల్లా.
సెల్ : 9490300637

వ్యక్తి యొక్క మానసిక, శారీరక, సాంఘిక, నైతిక, ఉద్వేగ లక్షణాలతోకూడిన సమగ్ర వ్యక్తిత్వాన్ని మూర్తిమత్వం అంటాం. మూర్తిమత్వం అనే పదం పర్సొనలైట్ అనే ఫ్రెంచ్ పదం నుంచి, పర్సొనా అనే లాటిన్ పదం నుంచి ఉద్భవించింది. పర్సొనా అనగా ముసుగు అని అర్థం.

మూర్తిమత్వానికి కొన్ని నిర్వచనాలు

✧ 'వ్యక్తి పరిసరాలతో సర్దుబాటు చేసుకోవడానికి ఉపకరించే ప్రత్యేకమయిన, అనువైన, విస్తృతమైన శారీరక, మానసిక రీతులను మూర్తిమత్వం అంటారు' **- ఆల్‌ఫోర్ట్**

✧ వ్యక్తిలోని సాంఘిక సర్దుబాటులో ఉండే లక్షణాలను వ్యక్తిత్వం అని అంటారు **- డేషియల్**

✧ ఒక వ్యక్తియొక్క సమగ్ర వాస్తవ లక్షణాల సముదాయాన్ని వ్యక్తిత్వం అంటారు **- ఐసెంక్**

✧ మూర్తిమత్వం ఒక సమగ్ర వ్యవస్థ లేక సంపూర్ణ వ్యవస్థ **- లెవెన్**

✧ వ్యక్తి పరిసరాలతో ప్రతిచర్యను పొందినప్పుడు ప్రస్ఫుటమయ్యే శాశ్వత మానసిక లక్షణాలు **- విల్‌బర్డ్ జేమ్స్**

✧ వ్యక్తి నివసించే సంఘంలో ఆ వ్యక్తి పాత్రను, హోదాను నిర్ణయించే లక్షణాంశాల మొత్తాన్ని మూర్తిమత్వం అంటారు **- ఇ డబ్ల్యూ. బర్జెస్**

✧ ఒక సన్నివేశంలో వ్యక్తి ప్రవర్తించే తీరు **- రేమండ్.బి.కాటిల్**

✧ వ్యక్తి యొక్క లక్షణాంశాలు గుణాత్మక నమూనా **- జె ఎఫ్ బ్రౌన్**

★ **మూర్తిమత్వ లక్షణాలు :** మూర్తిమత్వం ప్రత్యేకమైంది. సమరూప కవలల్లోకూడా ఒకే రకంగా ఉండదు. ఇది అనేక లక్షణాల సమగ్ర స్వరూపం. దీనిలో స్వీయ చేతనత్వం ముఖ్యమైన అంశం. ఇది వ్యక్తిలో ఏర్పడే వైఖరుల వల్ల ప్రభావితం చెందుతుంది. దీనిని వివరించవచ్చు. లక్షణాంశాల ద్వారా అంచనా వేయవచ్చు. కానీ కచ్చితంగా కొలవలేము. వంశపారంపర్య లక్షణాలు, పరిసరాలపై ఆధారపడి ఉంటుంది. మూర్తిమత్వం గతిశీలకమైనది. అభ్యసన అనుభవాల ద్వారా మూర్తిమత్వం స్థిరత్వాన్ని పొందుతుంది. మూర్తిమత్వం స్థిరంగా ఉంటుంది కానీ స్తబ్ధంగా ఉండక గతిశీలతను కలిగి ఉంటుంది.

★ **మూర్తిమత్వ సిద్ధాంతాలు :** వ్యక్తి రూపురేఖలను అనుసరించి, వ్యక్తి యొక్క లక్షణాంశాలను అనుసరించి, మానసిక విశ్లేషణను అనుసరించి మూడు రకాలుగా మూర్తిమత్వ సిద్ధాంతాలను ప్రతిపాదించారు.

1. రూప సిద్ధాంతాలు : హిప్పోక్రాటిస్, కెస్మర్, షెల్డన్, యంగ్, స్ప్రాంగ్లర్‌లు ఈ రూపసిద్ధాంతాలను వర్గీకరించారు.

★ **హిప్పోక్రాటిస్ వర్గీకరణ :** వ్యక్తియొక్క రసాలు - చిత్తవృత్తులను ఆధారంగా చేసుకొని హిప్పోక్రెటిస్ నాలుగు రకాలుగా పేర్కొన్నారు.

మూర్తిమత్వం

1. ఔత్సాహికుడు : వ్యక్తియొక్క రక్తం ప్రధాన ఆధారంగా అంచనా వేశారు. వీరు ఆశాజీవి, సంతోషంగా ఉంటూ, త్వరగా సర్దుబాటు చేసుకునే తత్వాన్ని కలిగి ఉంటారు. ప్రతి విషయాన్నీ తేలికగా తీసుకొనే స్వభావం, ఉద్వేగాల పరంగా, శారీరకంగా బలంగా ఉంటారు.

2. పైత్యప్రవృత్తికలవారు : వ్యక్తియొక్క పైత్యరసం ప్రధాన ఆధారంగా అంచనా వేశారు. కోపశీలత, చిరాకు స్వభావం, శారీరకంగా బలంగా ఉండి ఉద్వేగపరంగా బలహీనంగా ఉంటారు.

3. శ్లేష్మ ప్రవృత్తి గలవారు : వ్యక్తియొక్క శ్లేష్మరసం ప్రధాన ఆధారంగా అంచనా వేశారు. నెమ్మదస్తులు, సోమరులుగా, నిదానంగా ఉంటారు. సమాజంతో సంబంధం లేనివారుగా, ఏకాకులు, ఉద్వేగపరంగా బలంగా ఉంటూ శారీరకంగా బలహీనంగా ఉంటారు.

4. విషణ్ణువు : వ్యక్తియొక్క నల్లని పైత్యరసం ప్రధాన ఆధారంగా అంచనా వేశారు. విచారంగా, మందకొడిగా, నిరాశావాదులుగా ఉంటారు. వీరు శారీరకంగా, ఉద్వేగపరంగా బలహీనంగా ఉంటారు.

★ **క్రెష్మర్ వర్గీకరణ :** వ్యక్తియొక్క శరీర నిర్మాణం ఆధారంగా మూర్తిమత్వాన్ని వివరించాడు. పిచ్చివాళ్ల శరీర నిర్మాణాన్ని పరిశీలించి మూడురకాలుగా వర్గీకరించారు.

1. పీవరకాయులు : పొట్టిగా, లావుగా ఉంటారు. కలుపుగోలుతనంతో ఉంటూ ప్రతివిషయాన్నీ తేలికగా తీసుకొంటారు. ఉద్వేగ స్థిరత్వం ఎక్కువగా ఉంటుంది. వీరిని మేధావి వర్గంగా పేర్కొన్నాడు.

2. క్రీడాకాయులు : శరీరదారుఢ్యం కలిగి ఆశావాదులుగా, ఉభయవర్తనులుగా ఉంటారు

3. ప్రాంశుకాయులు : సన్నగా పొడుగా ఉంటారు. ఆదర్శజీవులు, భావవాదులు, ఖచ్చితత్వాన్ని పాటిస్తారు. సిగ్గరులు.

★ **యంగ్ వర్గీకరణ :** వ్యక్తి యొక్క మానసిక గుణాలు, సాంఘిక కార్యక్రమాలలో పాల్గొనే అభిరుచి ఆధారంగా రెండు రకాలుగా విభజించాడు.

1. అంతర్వర్తునులు : ముభావంగా, ఉపసంహరణ ధోరణితో తమలో తామే ఆలోచించుకుంటూ ఏకాకులుగా ఉండటాన్ని ఇష్టపడతారు. మితభాషులు, శాంతి స్వభావులు, ఇతరులతోకలవక నిశ్శబ్దంగా ఉంటారు. అయితే స్థిరమైన ఆలోచన కలిగి, ఉహాశక్తికలిగి ఉంటారు. కళలు సాహిత్యంలో ప్రావీణ్యం కలిగి నిరాశావాదంతో ఉంటారు. తమ బాధలను ఇతరులతో వ్యక్తపరచరు. పుస్తక పఠనం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతారు. తత్వవేత్తలు, రచయితలు, శాస్త్రవేత్తలు సాధారణంగా అంతర్వర్తనులుగా ఉంటారు.

2. బహిర్వర్తనులు : వీరు ఉల్లాసప్రియులు, సంఘజీవులు, వినోదజీవితం గడుపుతారు. వీరు వదరపోతులుగా ఉంటారు. అన్ని విషయాల్లో ఆసక్తిని కలిగి ఉంటారు. చింతనసామర్థ్యం తక్కువ, చొరవ ఎక్కువ. నాయకత్వ లక్షణాలు కలిగి మంచి మాటకారులుగా ఉంటారు. మార్పును తేలికగా అంగీకరిస్తారు. రాజకీయనాయకులు, టీం లీడర్లు, సంఘసేవకులు, క్రీడాకారులు బహిర్వర్తనులుగా ఉంటారు.

★ **షెల్డన్ వర్గీకరణ :** శరీర ఆకృతిని ఆధారంగా చేసుకొని మూర్తిమత్వాన్ని మూడు రకాలుగా వర్గీకరించాడు.

1. స్థూలకాయులు : సాంఘిక పరిపక్వత కలిగి, ఉల్లాసంగా సంతోషంగా ఉంటారు. వీరు బహిర్వర్తనులు.

2. మధ్యమకాయులు : శరీర ధారుఢ్యం కలిగి సాహసాలు చేయడానికి ఇష్టపడతారు. స్వయం ప్రతిపాదన కలిగి, కష్టసుఖాలను సమంగా ఎదుర్కొంటారు.

3. లంబకృశకాయులు : అంతర్ముఖులు, నిరాశావాదులు, సున్నితస్వభావంకలిగి సాంఘిక సంబంధాలను ఇష్టపడకుండా ముభావంగా ఉంటారు.

★ **స్ప్రాంగ్లర్ వర్గీకరణ :** విలువల ఆధారంగా మూర్తిమత్వాన్ని వర్గీకరించాడు.

1. సైద్ధాంతిక విలువ కలవారు : తమకు తాము ఆదర్శ సూత్రాలను ఏర్పరచుకొని నిర్దిష్ట పద్ధతిలో ప్రవర్తిస్తారు. రచయితలు, మేధావులు, ఈ రకానికి చెందుతారు.

ఉదా : అబ్దుల్ కలాం.

2. ఆర్థిక విలువలు కలవారు : ప్రతిపనినీ వ్యాపార దృక్పథంతో చూస్తారు. లాభనష్టాలతో బేరీజువేస్తారు.

ఉదా : బిల్‌గేట్స్, జుకెన్‌బర్గ్

3. సాంఘిక విలువకలవారు : సంఘసేవలో ఆసక్తికలిగి, ఉద్యమాలు నడపడం, నాయకత్వం వహించడం వంటివి చేస్తారు.

ఉదా : గాంధీజీ, మేధాపాట్కర్

4. రాజకీయ విలువకలవారు : సమస్యలను పరిష్కరించడం, మెజారిటీ వర్గానికి నచ్చే నిర్ణయాలు తీసుకోగలగడం, తనచుట్టూ ఉన్నవారిని ఒప్పించగలగడం. ఒక్కోసారి సమస్యలను కూడా సృష్టించగలరు.

ఉదా : ఇందిరాగాంధీ, ఎన్‌టిరామారావు

5. సౌందర్యోపాసన విలువకలవారు : వ్యక్తిగత అలంకరణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. గృహ అలంకరణ పారిశుద్ధ్యం కోసం కృషిచేస్తారు. అందానికి ప్రాముఖ్యత ఇస్తారు. వీరికి లలితకళలన్నా చేతిపనులన్నా ఎక్కువ ఇష్టం.

★ **లక్షణాంశ సిద్ధాంతాలు :** వ్యక్తిలో దాదాపు శాశ్వతంగా ఉండే గుణాలను లక్షణాంశాలు అంటారు. వీటిని ఆధారం



చేసుకొని ఆల్‌పోర్ట్, కెటిల్, ఐసెంక్‌లు మూర్తిమత్వాన్ని వర్గీకరించారు.

★ **ఆల్‌పోర్ట్ వర్గీకరణ :** వ్యక్తి యొక్క లక్షణాంశాల ఆధారంగానే మూర్తిమత్వాన్ని అంచానవేయగలం అన్న ఆల్‌పోర్ట్ ప్రాథమిక అంశాలు, కేంద్ర లక్షణాంశాలుగా వర్గీకరించాడు.

1. ప్రాథమిక లక్షణాంశాలు : అందరి వ్యక్తులలో ఎంతోకొంత ఉండే గుణాలైన దయ, జాలి వంటి వాటి ఆధారంగా వీటిని మూర్తిమత్వ పరీక్షలద్వారా మాపనం చేస్తారు. దీనిని సామాన్య లక్షణాంశాలు అనికూడా అంటారు.

2. కేంద్ర లక్షణాంశాలు : వ్యక్తుల్లో ఉండే హాస్యచతురత, సృజనాత్మకత వంటి ప్రత్యేక లక్షణాంశాలను పరిశీలన ద్వారా, వ్యక్తిగత రికార్డులద్వారా మాపనం చేస్తారు.

★ **కాటిల్ వర్గీకరణ :** లక్షణాల పట్టికను తయారుచేసి విశ్లేషణ పద్ధతిద్వారా వర్గీకరణ చేస్తాడు. 17,953 ప్రవర్తన లక్షణాంశాలను క్రోడీకరించి, వాటి మధ్య సారూప్యాన్ని అధారంగా వర్గీకరించి 171 ప్రాథమిక లక్షణాంశాలను గుర్తించాడు. ఈ ప్రాథమిక లక్షణాంశాల్లో కొన్నింటి మధ్య సంబంధం ఎక్కువగాను, కొన్నింటిమధ్య తక్కువగాను ఉంది. వీటిని 35 సమూహాలుగా గుర్తించి వీటిని ఉపరితల లక్షణాంశాలుగా పేర్కొన్నాడు. వీటిలో స్థిరత్వం ఉండదు. ప్రత్యేకంగా పరిశీలించగల ప్రవర్తనా గుణాలు.

ఉదా : ధైర్యం, పట్టుదల వంటి బహ్య లక్షణాలు. ఈ ఉపరితల లక్షణాంశాలను మరలా విశ్లేషించి పరస్పర సంబంధం ఉన్న వాటిని తీసివేసి 16 మూల లక్షణాంశాలను గుర్తించాడు. ఈ 16 స్థిరంగా ఉండే లక్షణాంశాలు.

ఉదాహరణ : విశ్వాస భావన. వీటిని సాధారణ పరీక్షలు, నిర్ధారణ మాపనులు, ప్రశ్నావళుల ద్వారా మాపనం చేస్తారు. **"మూల లక్షణాంశాలు మాత్రమే వ్యక్తి మూర్తిమత్వానికి తోడ్పడతాయి"** - కెటిల్.

★

ఉద్యోగాలు

ఎయిర్ ఇండియాలో 500 ఉద్యోగాలు

క్యాబిన్ క్రూలో 500 పోస్టుల భర్తీకి పెళ్లి కాని యువతీ యువకుల నుంచి దరఖాస్తులు కోరుతూ ఎయిర్ ఇండియా ప్రకటన విడుదల చేసింది.

పోస్టు: క్యాబిన్ క్రూ.

మొత్తం ఖాళీలు: 500 (పురుషులు-163 + మహిళలు-337).

రీజియన్ల వారీ ఖాళీలు: నార్తర్న్ రీజియన్ (ఢిల్లీ)-450 (పురుషులు-150 + మహిళలు-300), వెస్టర్న్ రీజియన్ (ముంబై)-50 (పురుషులు-13 + మహిళలు-37).

వేతనం: శిక్షణలో స్టైపెండ్ నెలకు రూ.15,000, ఉద్యోగంలో చేరాక మొదటి ఏడాది రూ.18,400. దీంతోపాటు ఫ్లైయింగ్ అలవెన్సు-రూ.21,125, ఇంటర్నేషనల్ క్యూటీఏ తదితరాల కింద అదనపు చెల్లింపులు ఉంటాయి.

అర్హతలు: ఇంటర్మీడియెట్/ తత్సమాన విద్యతోపాటు ఏదైనా షెడ్యూల్డ్ ఎయిర్‌లైన్స్‌లో క్యాబిన్ క్రూగా పనిచేస్తూ, కనీసం ఏడాది అనుభవం కలిగి ఉండాలి. అలాగే ఏదైనా ఎయిర్‌బస్/ బోయింగ్ ఫ్యామిలీ ఎయిర్‌క్రాఫ్ట్‌కు సంబంధించిన సెప్ (ఎస్‌ఈపీ) ఉండాలి. అలాగే ఇంగ్లీష్, హిందీ భాషల్లో పట్టు తప్పనిసరి.

శారీరక, ఆరోగ్య ప్రమాణాలు: ఎత్తు-పురుషులు కనీసం 172 సెం.మీ., మహిళలు కనీసం 160 సెం.మీ. ఉండాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలతోపాటు ఈశాన్య రాష్ట్రాల అభ్యర్థులకు 2.5 సెం.మీ. సడలింపు ఇస్తారు. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ)-పురుషులకు 18-25 లోపు, మహిళలకు 18-22 లోపు ఉండాలి. అలాగే తగిన దృష్టి సామర్థ్యం (ఎన్/5, ఎన్/6, 6/6, 6/9), ఇషిహార/ టోక్యో మెడికల్ కాలేజ్ చార్ట్ మేరకు తగిన కలర్ విజన్ ఉండాలి. అలాగే స్పష్టంగా మాట్లాడగలగాలి.

వయసు: దరఖాస్తు గడువు ముగిసే నాటికి 18-35 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: మెడికల్ ఎగ్జామినేషన్, రాతపరీక్ష.

దరఖాస్తు ఫీజు: రూ.1,000, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ: మార్చి 12, 2018.

పూర్తి వివరాలు: వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: airindia.in

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

ప్రజాశక్తి - ఉంగుటూరు (పశ్చిమగోదావరి)

పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు ఒకటో నంబరు తూముకు ఏలూరు కాలువ నుంచి నీరందకపోవడంతో 150 ఎకరాల్లో వరిపంట పొట్ట దశలోనే ఎండిపోతుందని ఆయకట్టు రైతులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు మంగళవారం 16వ నంబరు జాతీయ రహదారిలో బాదంపూడి వైజంక్షన్ వద్ద ఎండిన వరి దుబ్బులతో ధర్నా నిర్వహించారు. సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే గన్ని వీరాంజ నేయులు ఇరిగేషన్ అధికారులను సంఘటనా స్థలానికి పంపించి రైతులను శాంతింపచేశారు. సాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఇప్పటికే ఎకరానికి రూ.20 వేల వరకూ పెట్టుబడులు పెట్టామని, కీలక సమయంలో నీరివ్వకపోతే రైతులకు ఆత్మహత్యలే గతి అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



పశ్చిమగోదావరి జిల్లాలో పొట్టదశలో వరి పంట ఎండిపోకుండా ఏలూరు కాలువ నుంచి వందలాది ఎకరాలకు సాగునీరు విడుదల చేయాలని మంగళవారం ఉంగుటూరు సమీపంలోని 16వ నెంబరు జాతీయ రహదారి వద్ద ధర్నా చేస్తున్న రైతులు

మోడీ-బాబు నాటకంలో రాష్ట్రం అప్పులపాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

మోడీ, బాబు జోడీ నాటకంతో రాష్ట్రం అప్పులపాలైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య విమర్శించారు. గుంటూరు జిల్లా తెనాలికి మంగళవారం వచ్చిన ఆయన ఆ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం నుండి రూ.3.55 లక్షల కోట్లు రావాల్సి ఉండగా నాలుగేళ్లలో రూ.12,966 కోట్లే వచ్చాయని, కేంద్ర హామీలు, హోదా మట్టి పాలయ్యాయని విమర్శించారు. మోడీ అధికారంలోకొచ్చాక దేశంలో 20 లక్షల ఉద్యోగాలు ఊడిపోయాయని, హామీల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.

రాష్ట్రం ఇప్పటికే రూ.2 లక్షల కోట్ల అప్పులో ఉండగా దానికి వడ్డీయే రూ.34 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రయోజనాలు పోరాటాలతోనే సాధ్యమని వామపక్షాలు భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక ప్యాకేజీ గందరగోళాన్ని చంద్రబాబే సృష్టించాడన్నారు. ఈ క్రమంలో మార్చి 1న గుంటూరులో హోదా సాధన, హామీల అమలు కోసం రాష్ట్ర సదస్సు, 2, 3, 4 తేదీల్లో దీక్షలు, 5,6,7,8 తేదీల్లో ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. అప్పటికీ కేంద్రం వైఖరి మారకుంటే నాడు విశాఖ ఉక్కు పోరాట స్ఫూర్తితో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో సిపిఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజీ, తెనాలి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి ఎం.శివసాంబిరెడ్డి, వివిధ సంఘాల నాయకులు ఉన్నారు.

హోదా సాధించే వరకూ పోరాటం

- వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతిన
- అమలాపురంలో ఆత్మగౌరవ దీక్షను ప్రారంభించిన రఘువీరారెడ్డి
- హోదా పోరులో యువత ఆయుధాలుగా మారాలి : జెవివి



పశ్చిమగోదావరి జిల్లా అమలాపురం ఆత్మగౌరవ సభలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే వరకూ పోరాడతామని పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని కోరుతూ రాష్ట్రంలో మంగళవారం వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగాయి. తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మగౌరవ దీక్ష నిర్వహించారు. పిసిసి చీఫ్ రఘువీరారెడ్డి ఈ దీక్షను ప్రారంభించారు. పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు పాల్గొన్నారు. కాకినాడలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. జెవివి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ ముఖ్యవక్తగా హాజరై ప్రసంగించారు. ప్రత్యేక హోదా పోరులో యువత ఆయుధాలుగా మారాలని పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలోని నన్నయ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఎల్ఐసి యూనియన్ నాయకులు మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చే వరకూ పోరాడుతామని పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాల నాయకులు ప్రతినబూనారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో ఏలూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్ పార్టీ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎంసిపిఐ, జనసేన పార్టీ, ఎన్‌జిఒ నాయకులు పాల్గొన్నారు. ప్రత్యేక హోదాపై దేవరపల్లిలోని వినాయకగుడి వద్ద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గుంటూరు జిల్లా నాదెండ్ల మండల కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. శ్రీకాకుళం జిల్లా సీతంపేటలోని సిపిఎం కార్యాలయంలో అఖిలపక్షాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. విభజన హామీల సాధన కోరుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యాన మార్చి ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకూ చేపట్టనున్న జీపుజాతా వాల్‌పోస్టర్‌ను శ్రీకాకుళంలోని సిఐటియు కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ వైసిపి విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో విజయనగరంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష చేపట్టారు. పిసిసి ఉపాధ్యక్షులు తులసిరెడ్డి పాల్గొన్నారు. ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. విశాఖలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 'ఆంధ్రుల ఆత్మ గౌరవ దీక్ష' చేపట్టారు. పిసిసి ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను మోసగించిన బిజెపి, మరోపక్క రాయలసీమ ప్రజలను రెచ్చగొడుతూ ప్రాంతాల మధ్య చిచ్చు రేపుతోందని విమర్శించారు.

మార్చి 1న రాష్ట్ర సదస్సు

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోరుతూ వామపక్షాలు, ప్రత్యేక హోదా సాధనా సమితి ఆధ్వర్యంలో గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మార్చి ఒకటో తేదీన రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. గుంటూరులోని సిపిఎం కార్యాలయంలో వామపక్ష పార్టీల నాయకులతో కలిసి సదస్సు వివరాలను మంగళవారం మీడియాకు వెల్లడించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, దీనికి బిజెపి, టిడిపిలు రెండూ బాధ్యత వహించాలని అన్నారు. సదస్సులో వామపక్ష పార్టీలు, వివిధ సంఘాల రాష్ట్ర నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిపిఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, ఎంసిపి(యు) నాయకులు పూర్ణారావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు మల్లిక్ పాల్గొన్నారు.

పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

సిఎం చంద్రబాబు పెట్టుబడుల కోసం గతంలో సదస్సు పెట్టి రూ.16 లక్షల కోట్లు ఎంఒయులు కుదుర్చుకున్నారని, మళ్లీ ప్రస్తుతం మూడ్రోజులుగా విశాఖ సదస్సులో నిర్వహించి రూ.4 లక్షల కోట్లు ఎంఒయులు జరిగినట్లు పేర్కొంటున్నారని వీటిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. లక్షలకోట్ల పెట్టుబడులొస్తే రాష్ట్రంలో ఇప్పటికే లక్షలాది ఉద్యోగాలు కల్పించొచ్చని, అయితే ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదని విమర్శించారు. ప్రత్యేక హోదాపై బిజెపి, టిడిపిలు నాటకాలాడుతున్నాయని అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి 79 వేల ఎకరాలను తీసుకున్నారని, ప్రపంచంలో ఎక్కడా లేని నిర్మాణాలు చేపడతామన్నారని, ఎక్కడ ఏ భవనాలు నిర్మించారో చూపాలని ప్రశ్నించారు. రాజధాని ప్రాంతంలో ఏడు మెడికల్ కాలేజీల ఏర్పాటుపై స్పందిస్తు రాజధానిలో రోగులెక్కువగా ఉంటారా? అని ప్రశ్నించారు. ప్రపంచ బ్యాంకు రుణంతో నిర్మించే రాజధానిని ప్రజలు కోరుకోవడం లేదని, ప్రజా రాజధానిని కోరుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పవన్‌కల్యాణ్, వామపక్షాలు కలిసి పనిచేస్తాయని పేర్కొన్నారు. పీపుల్స్ ఎజెండాతో సిపిఐ, సిపిఎం ముందుకెళ్తూ కలిసొచ్చేవారితో పని చేస్తాయని చెప్పారు. మార్చి 1న గుంటూరులో సదస్సు, 6న ఢిల్లీలో నిరసన ఉంటుందన్నారు. టిడిపి, వైసిపి కార్పొరేట్లకే కొమ్ముగాస్తు న్నాయని, బిజెపితో సంబంధాల అంశంలో చంద్రబాబే రాష్ట్రాన్ని గందరగోళ పరుస్తున్నారని ఎద్దేవా చేశారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జె.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రాజెక్టుల్లో అవినీతిపై చర్చకు సిద్ధమేనా?

వైసిపి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రాజెక్టుల పేరుతో చంద్రబాబు నాయుడు సర్కార్ భారీ అవినీతికి పాల్పడుతోందని వైసిపి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. చేయని పనులకు కూడా కాంట్రాక్టర్లకు అడ్వాన్సులు కట్టబెడుతోందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులకు న్యాయం చేయాలని వైఎస్ఆర్ మొదలు పెట్టిన ప్రాజెక్టుల్ని కూడా తానే రూపకల్పన చేశానని చంద్రబాబు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతును, వ్యవసాయాన్ని, ప్రాజెక్టుల్ని వ్యతిరేకించే వ్యక్తి ఇలాంటి పనులు చేస్తున్నానంటే ఎవరైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. మిగిలిపోయిన పనులు పూర్తి చేయడానికి ప్రాజెక్టు అంచెనాలను విపరీతంగా పెంచుకుని డబ్బులు దండుకున్నారన్నారు. వెలుగొండ ప్రాజెక్టుకు సంబంధించిన సబ్ వర్క్‌కు రూ. 5 కోట్లకు చేయాల్సిన పనికి 5 శాతం ఎక్సెస్‌తో రూ. 91 కోట్లకు అంచనాలు పెంచి ఆర్కే ఇన్‌ఫ్రా కంపెనీకి కట్టబెట్టారన్నారు. దీనిపై చీఫ్ ఇంజినీర్ అభ్యంతరం వ్యక్తం చేస్తే, తక్షణం నీరు ఇవ్వాలని సింగిల్ టెండర్‌కు అనుమతించామని చెప్పారన్నారు. సెప్టెంబర్‌లో చిన్న యంత్రాన్ని అక్కడకు పంపి 1.90 లక్షల క్యూబిక్ మీటర్ల పని చేసినట్లుగా చూపి రూ.14 కోట్లకు బిల్లు పెట్టుకున్నారన్నారు. వెలుగొండ ప్రాజెక్టులో జరిగిన అవినీతిని ఆధారాలతో నిరూపిస్తామని, దమ్ముంటే సీఈ, ఎస్ఈ, మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావులు ప్రాజెక్టు వద్దకు చర్చకు రావాలని సవాల్ విసిరారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి- ముంచంగిపుట్టు, విశాఖ

నీటి ఎద్దడి నివారణలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విశాఖ జిల్లా ముంచంగిపుట్టు మండలం కొత్త సుజనకోట గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించి, ఎంపిడిఒ ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ హరీష్‌లను నిలదీశారు. గ్రామంలోని రక్షితనీటి పథకం మూలకు చేరి, ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారులకు అనేకసార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని మండిపడ్డారు. గత నెలలో నిర్వహించిన జన్మభూమిలో నీటి సమస్యను విన్నవిస్తే, రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పి, పత్తా లేకుండా పోయారని అధికారులపై నిప్పులు చెరిగారు. దీనిపై ఎంపిడిఒ, జెఇలు స్పందిస్తూ నీటి ఎద్దటి సమస్యను తక్షణం పరిష్కరిస్తామని సర్దిచెప్పే ప్రయత్నం చేసినా విశ్వసించని గిరిజనులు, ఎప్పుడు చేస్తారో చెప్పాలని పట్టుబట్టారు. ఈ నెల 28న తప్పకుండా నీటిసమస్య పరిష్కరిస్తామని అధికారులు స్పష్టం చేయడంతో ఆందోళన విరమించారు.

మహిళను వ్యాపార వస్తువుగా చూడటం సరికాదు

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహిళను వ్యాపార వస్తువుగా చూసే ధోరణి సరికాదని పలువురు వక్తలు పేర్కొన్నారు. మహిళల పట్ల సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఓ టీవీ షోలో చేసిన అసభ్య వాఖ్యలపై ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. వర్మ తన ప్రచారం కోసం కావాలనే మహిళలను కించపరుస్తున్నారని తెలిపారు. మీడియా కూడా ఇలాంటి వారికి ప్రచారం ఇవ్వడం సరికాదన్నారు. మహిళలను కించపరిచే వాఖ్యలు చేసిన రామ్‌గోపాల్ వర్మను వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మిదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి సావిత్రి, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శాఖలో కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి

ఆర్థిక శాఖ కార్యదర్శికి కాంట్రాక్టు ఉద్యోగుల జెఎసి వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య, ఆరోగ్య శాఖలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్ని రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆర్థిక శాఖ కార్యదర్శి మునివెంకటప్పకు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలను పెంచాలని, 180 రోజుల ప్రసూతి సెలవు ఇవ్వాలని, 35 రోజుల క్యాజువల్ లీవులను పునరుద్ధరించడంతో పాటు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.

ఐటిఐ ఎటిఒలతో పాటు ఇతర లేబర్ ఎంప్లాయిమెంట్ కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా వేతనాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న 50 శాతం వేతన పెంపు వల్ల కొన్ని కేడర్ల ఉద్యోగులకు వేతనాలు తక్కువగా పెరగడమేకాక కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న జూనియర్ ఉద్యోగుల కంటే సీనియర్లు తక్కువ వేతనాన్ని పొందే పరిస్థితి వైద్య, ఆరోగ్య శాఖలో ఉందని వివరించారు. ఆ పరిస్థితి రాకుండా వేతనాలను చెల్లించాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలివ్వాలని, సౌకర్యాల్ని వర్తింపజేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అందరికీ వేతనాలు చెల్లించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలోకొస్తే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

కొనసాగుతున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీక్షలు

విజయనగరంలో వంటావార్పు - గుంటూరులో భారీ ర్యాలీ



విజయనగరంలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి ఎనిమిదో రోజుకు చేరింది. జిల్లాల్లో పలుచోట్ల నిరసనలు, వంటావార్పు, ధర్నాలు చేపట్టారు. కార్మికులు పలువురు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోనే విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కార్మికుల సమ్మె శిబిరాన్ని మాజీ ఎంపి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ మిడియం బాబూరావు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 వేల కార్మికులు సమ్మెలో పాల్గొంటే ముఖ్యమంత్రి సంబంధం లేనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి కార్మికసంఘాల నాయకులతో చర్చలు జరపాలన్నారు. కాకినాడలో కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు రిలే దీక్షలకు దిగారు. రాజమహేంద్రవరంలోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మద్దతు తెలిపారు. విజయనగంరలోని విద్యుత్ భవనం వద్ద కాంట్రాక్టు ఉద్యోగులు నిర్వహిస్తోన్న సమ్మె శిబిరాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు సందర్శించి వారి పోరాటానికి మద్దతు తెలిపారు. దీక్షా శిబిరంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం నుంచి బృందావన్ గార్డెన్స్‌లోని ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయం వరకూ 200 మంది కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించి, వినతిపత్రం అందచేశారు. సిఐటియు సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎంవి.సుధాకర్ పాల్గొని సమ్మెకు మద్దతు తెలిపారు. ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కార్మికులు సమ్మెను కొనసాగించారు. సమస్యల పరిష్కారం పట్ల జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు విశాఖలోని ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, వెలగపూడి రామకృష్ణబాబులకు వినతిపత్రాలు అందించారు. మంత్రి కళా వెంకటరావుకు కూడా వినతిపత్రాన్ని తమ నాయకులు అందజేశారని జెఎసి కన్వీనర్ ఎన్ఎన్.మూర్తి తెలిపారు. సమస్యల పరిష్కారానికి బుధవారం చలో సిఎమ్‌డి కార్యాలయం చేపడుతున్నట్లు జెఎసి అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. విశాఖ జిల్లా పాడేరులో సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. పశ్చిమగోదారి జిల్లా ఏలూరులో మహిళా కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మంత్రి పితాని సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. పోడూరులో వంటావార్పు చేసి నిరసన తెలిపారు. అనంతరం మంత్రి పితాని స్వగృహానికి ర్యాలీగా చేరుకుని వినతిని అందించారు.అనంతపురంలోని కలెక్టరేట్ ఎస్ఇ కార్యాలయం వద్ద విద్యుత్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల దీక్షలు కొనసాగుతున్నాయి.కర్నూలులో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి.

మార్చి 14న నిరసనలు

విద్యుత్ సవరణ బిల్లు (2014)కు వ్యతిరేకంగా మార్చి 14న అన్ని రాష్ట్రాల ముఖ్య కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ నంది చౌదురి తెలిపారు. నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంపాయీస్ (ఎన్‌సిసిఒఇఇ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాల్ని చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె న్యాయబద్ధమైందని, కార్మిక సంఘాల నేతలతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యల్ని పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ వైఖరిని ఇఇఎఫ్ఐ, ఎన్‌సిసిఒఇఇ ఖండిస్తున్నట్లు చెప్పారు.

ప్రజ్ఞ

జవాబులు

1. నాసిక్, మార్చి 4 న
2. పిపిలో నిజాయితీగా పనిచేసే సిబ్బందికి
3. వికాస్ క షన్ (భారత్)
4. పారుపల్లి కశ్యప్
5. తెలంగాణ జైత్రయాత్ర రచనకు

రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికుల ఆందోళనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంవి యాక్ట్ సవరణ బిల్లును తక్షణం రద్దు చేయాలని, అక్రమంగా వసూలు చేస్తున్న పెనాల్టీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించారు. ఎపి ఆటోడ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు కర్నూలు కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ముట్టడిలో భారీ సంఖ్యలో ఆటోడ్రైవర్లు పాల్గొనడంతో ఉద్రిక్తంగా సాగింది. కలెక్టరేట్ గేట్లను తెరుచుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నాయకుల మధ్య తోపులాట జరిగింది. కలెక్టరేట్ పరిపాలనాధికారి వెంకటనారాయణ ఆందోళన దగ్గరికి వచ్చారు. యూనియన్ నాయకులు బి.రాధాకృష్ణ, ప్రభాకర్, విజయ్‌ల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీనిచ్చారు. విజయవాడ సిటీ ఆటోవర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుట ధర్నా నిర్వహించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో సిఐటియు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం, పాలకొండ, శ్రీకాకుళంలో సిఐటియు ఆధ్వర్యాన ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రవాణా శాఖ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. విశాఖలో జిల్లావ్యాప్తంగా ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్లకు విన్న వించారు. తూర్పుగోదావరి జిల్లాలో ఆర్‌టిఒ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి కాలం సుబ్బారావు సంఘీబావంగా మాట్లాడారు. కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ముందుగా మినిస్టేడియం నుండి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతపురం జిల్లావ్యాప్తంగా కార్మికులు నిరసన ర్యాలీలను చేపట్టారు.

బహిష్కరణ

టిడిపి దళిత నాయకురాలిపై ఆ పార్టీ నాయకుడే దాడి

దళిత తేజంను బహిష్కరించిన దళిత నాయకులు



మీడియా ఎదుట దాడి సంఘటనను వివరిస్తున్న వనరాణి

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు)

దళితురాలైన టిడిపి మహిళా నాయకురాలు దర్శి వనరాణిపై అదే పార్టీకి చెందిన పోలవరపు హరిబాబు దాడి చేశాడు. ఈ సంఘటనన గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిరంజీవి నివాసంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. టిడిపి మహిళా విభాగంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా పనిచేస్తున్న దర్శి వనరాణిని పెత్తందారీ పోలవరపు హరిబాబు దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషించి, అసభ్య పదజాలంతో దుర్భాషలాడాడు. దళితులకు పదవులు ఇప్పించే విషయంలో తలెత్తిన వివాదంతో వనరాణి చెంపపై హరిబాబు కొట్టాడు. పలువురు టిడిపి నాయకులు అక్కడే ఉన్నా నిలువరించలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై ఆమె పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం వనరాణి విలేకర్లతో మాట్లాడారు. తాను ఎన్నో ఏళ్లుగా టిడిపిలో కష్టపడి పని చేస్తున్నానని, పెత్తందారీ అహంభావంతోనే హరిబాబు దాడి చేశాడని కన్నీటి పర్యంతమయ్యారు. ఇదిలావుండగా నిరుద్యోగ యువకుల నుండి ఉద్యోగాలు ఇప్పిస్తానని కోట్ల రూపాయలు వసూలు, భూ కబ్జా తదితర ఐదు కేసులు హరిబాబుపై ఉన్నాయని ఆరోపించారు. ఆ సందర్భంలో అతన్ని పార్టీ నుండి సస్పెండ్ చేసినా మళ్లీ రంగంలోకి తెచ్చారన్నారు. మరోవైపు దాడికి నిరసనగా తాడేపల్లి మండలంలో దళిత తేజంను దళిత కార్యకర్తలు బహిష్కరించారు. హరిబాబుపై చర్యలు తీసుకునే వరకూ పాల్గొనబోమని నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు దొప్పలపూడి జ్యోతిబసు ప్రకటించారు. మంగళగిరిలోనూ దళిత నాయకులు సమావేశమై దళిత తేజాన్ని బహిష్కరిస్తున్నట్లు తీర్మానించారు.

కెవిపిఎస్ ఖండన

దర్శి వనరాణిపై పోలవరపు హరిబాబు దాడి చేయడాన్ని కెవిపిఎస్ ఖండించింది. టిడిపిలోని పెత్తందారీ సామాజిక తరగతులకు దళితులంటే ఎంత ఆక్రోశమే ఈ ఘటనే రుజువని కెవిపిఎస్ మంగళగిరి డివిజన్ కార్యదర్శి వై.కమలాకర్, సిఐటియు డివిజన్ ఉపాధ్యక్షులు ఎస్ఎస్.చెంగయ్య పేర్కొన్నారు. దాడిని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రవి ఖండించారు. ఒకవైపు దళితతేజం అంటూ మరోవైపు ఆ పార్టీలోని దళిత మహిళలకే రక్షణ లేకుండా చేశారని, ఇది ఆ పార్టీ స్వభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. హరిబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్తం

హోదాతోనే విద్యార్థులకు భవిష్యత్తు

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ కారెం శివాజీ

ప్రజాశక్తి - క్యాంపస్(తిరుపతి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాను సాధించడంతోనే రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజి పేర్కొన్నారు. మంగళవారం తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆయన విద్యార్థినులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, పర్యాటకం, ఉపాధి రంగాల్లో హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి సాధించిన తర్వాత రాష్ట్ర విభజన చేశారని తెలిపారు. కాంగ్రెస్, బిజెపిలు విభజన హామీలను అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించాయని వాపోయారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విద్యార్థి లోకం సంఘీభావం తెలపాలని కోరారు. సాంకేతిక మాధ్యమాల ద్వారా విద్యార్థులు ప్రత్యేక హోదా ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు.

కలిసి కట్టుగా పోరాడుదాం

రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రత్యేకహోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేకప్యాకేజీ కోసం పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పోరాడాలని రాయలసీమ ఐక్యవేదిక వ్యవస్థాపకులు, రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం కర్నూలులోని మౌర్యఇన్‌లో దర్బార్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్ దగ్గర రాయలసీమ ఐక్యవేదికను ప్రారంభించానని తెలిపారు. ఈ వేదికకు కమ్యూనిస్టులతో పాటు అన్ని పార్టీల వారు మద్దతునిచ్చారన్నారు.

గవర్నర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు

సమాచారం లేదన్న హోం శాఖ

న్యూఢిల్లీ : గవర్నర్‌పై లైంగిక వేధిపుల ఆరోపణలకు సంబంధించి తమ వద్ద ఎటువంటి సమాచారం లేదని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. మేఘాలయ గవర్నర్ లైంగిక వేధింపులకు సంబంధించి మీడియాలో వచ్చిన కథనాలపై వ్యాఖ్యానించమని హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధిని కోరగా తమ వద్ద అటువంటి సమాచారం లేదని చెప్పారు. రాజ్‌భవన్‌కు చెందిన కొంతమంది మహిళా సిబ్బంది గవర్నర్ లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేశారని, భద్రతా సంస్థలు ఆ అంశాన్ని పరిశీలిస్తున్నాయని పత్రికలలో కథనాలు వెలువడ్డాయి. కాగా గత ఏడాది మేఘాలయ గవర్నర్ వి. షణ్ముగనాథన్ తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రాజీనామా చేశారు.

భేటీ

జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ మంగళవారం హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పరిస్థితులపై వీరిరువురూ దాదాపు 20 నిముషాలు సమావేశం అయ్యారు.



హోళి పేరుతో వేధింపులు : ఎస్ఎఫ్ఐ ఖండన

అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

న్యూఢిల్లీ (ఇండియా న్యూస్ నెట్‌వర్క్) : హోళి పేరుతో వీధుల్లో విద్యార్థినులపై వేధింపులకు పాల్పడే అసహ్యకర సంఘటనలను భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటి తీవ్రంగా ఖండించింది. లేడి శ్రీరామ్ కాలేజికి చెందిన విద్యార్థినులపై వీర్యంతో నింపిన బెలూన్లను విసిరివేయనున్నట్లు వార్తలు వెలువడుతున్నాయని ఈ సందర్భంగా పేర్కొంది. గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్న విధానంగానే ఈ సంవత్సరం కూడా నీటితో నింపిన, ఉపయోగించిన కండోమ్‌లను మహిళలపైకి రువ్వే సంఘటనలు జరగనున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయని ఎస్ఎఫ్ఐ పేర్కొంది. నాగరిక సమాజంలో ఇది సహించరాని విషయమని పేర్కొంది. ఇటువంటి చర్యలను విద్యార్థినులపై జరిగే నేరపూరిత హింసలుగా ఎస్ఎఫ్ఐ పరిగణిస్తుందని ఆ కమిటీ తెలిపింది. హోళి పేరుతోగాని మరేదైనా ఉత్సవాల పేరుతో గాని ఇటువంటి సంఘటనలు జరగకూడదని స్పష్టం చేసింది. ఇది మన సమాజంలో వేళ్ళూనుకుపోయిన పితృస్వామ్య వ్యవస్థను ప్రతిబింబిస్తున్నదని పేర్కొంది. ఈ సంఘటనలను సాధారణ చర్యలుగా చూడరాదని పేర్కొంది. హోళి ఆడాలా?వద్దా? అనే విషయం ఆ మహిళ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని కమిటీ తెలిపింది. హోళి పేరుతో మహిళల గోప్యతకు ప్రజలు ఆటంకం కలిగించరాదని స్పష్టం చేసింది. నిందితుల పట్ల కఠినమైన చర్యలు తీసుకోవాలని, పోలీసులు అటువంటి అసాంఘీక శక్తులను గుర్తించి శిక్షించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది.

నావికా విన్యాసాలలో పాల్గొనేందుకు మాల్దీవులు నిరాకరణ



న్యూఢిల్లీ : ప్రతి రెండు సంవత్సరాలకొకసారి 'మిలాన్' పేరుతో నిర్వహించే నావికాదళ విన్యాసాలలో పాల్గొనాలంటూ భారత్ పంపిన ఆహ్వానాన్ని మాల్దీవులు నిరాకరించింది.. ఈ విషయాన్ని నావికాదళ అధికారి చీఫ్ అడ్మిరల్ సునీల్ లాంబా మంగళవారం తెలిపారు. మార్చి ఆరు నుంచి నావికాదళ విన్యాసాలు మిలాన్‌లో జరగనున్నాయి. అయితే తాము తీసుకున్న నిర్ణయానికి మాల్దీవులు ఎటువంటి కారణాన్ని తెలపలేదని ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో లాంబా తెలిపారు. దాదాపు 16 దేశాలు ఈ విన్యాసాలలో పాల్గొనేందుకు తమ అనుమతి తెలిపాయన్నారు. అండమాన్, నికోబార్ దీవులలో ఈ విన్యాసాలు జరగనున్నాయి. నావికా విన్యాసాలలో పాల్గొనే వివిధ దేశాల నావికాదళాధికారులతో జరిపే సమావేశంలోఈ అంశాన్ని చర్చకు తీసుకొస్తామని చెప్పారు.

భార్యను ఉగ్రవాదులకు అమ్మేందుకు యత్నించిన భర్త అరెస్టు

మరో 9 మందిని విచారిస్తున్న ఎన్ఐఎ

న్యూఢిల్లీ : సౌదీ అరేబియాలోని ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాదులకు తనను అమ్మేయాలని చూస్తున్నాడంటూ భర్త మహ్మద్ రియాస్ రషీద్‌పై గుజరాత్‌కు చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కేసును ఎన్ఐఎ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. హదియా కేసును సుప్రీం కోర్టు పరిశీలిస్తున్న నేపథ్యంలో ఈ కేసు విషయంలో ఎన్ఐఎ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. తనను ఇస్లాంలోకి మార్చాలని ప్రయత్నించడమే కాకుండా, సౌదీ అరేబియాలోని ఉగ్రవాదులకు అమ్మాలని చూస్తున్నట్లు ఆమె ఫిర్యాదు చేసింది. గుజరాత్‌కు చెందిన ఆ మహిళ కేరళకు చెందిన రషీద్‌ను రెండేళ్ళ క్రితం వివాహం చేసుకుంది. రషీద్ ఇంజనీరింగ్ తొలి సంవత్సర తొలి సెమిస్టర్ పరీక్షలు ఫెయిలవ్వడంతో బెంగళూరు చేరుకున్నాడు. బెంగళూరులోని ఒక కంప్యూటర్ కేంద్రంలో వీరిద్దరూ కలుసుకున్నారు. ఆ తరువాత వివాహం చేసుకున్నారు. వివాహమైన కొంతకాలానికి కేరళ చేరుకున్నారు. తనతో బయటకు వెళ్ళే సమయంలో బురఖా ధరించాలని, ముఖాన్ని కప్పుకోవాలని తన భర్త రషీద్ వేధిస్తున్నట్లు ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. సౌదీ అరేబియాలోని జెడ్డాలో పనిచేస్తున్న రషీద్ ఈ నెల 4న తిరిగి రావడంతో చెన్నై విమానాశ్రయం వద్ద ఎన్ఐఎ అధికారులు అతనిని నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆ తరువాత కొన్ని నెలలకు ఆ యువతి తన తల్లిదండ్రుల వద్దకు తిరిగి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అధికారులు 9 మందిని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

నిర్వహణా లోపాలపై చర్యలకు పిఎస్‌బి 15 రోజుల గడువు



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి)లో దాదాపు రు.13 వేల కోట్ల చోటు చేసుకున్న నేపథ్యంలో , తమ బ్రాంచీల్లో నిర్వహణా లోపాలను, సాంకేతికపరమైన అంశాలను మెరుగుపర్చుకొనేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో 15 రోజుల్లో తెలపాలని ప్రభుత్వ రంగ బ్యాంకు (పిఎస్‌బి)లను కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ ఆదేశించారు.. అలాగే పెరుగుతున్న నష్టాలను ఎదుర్కొవడానికి బ్లూప్రింట్‌ను తయారు చేయాలని ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ముఖ్య సాంకేతిక అధికారుల (సిటిఓలు)ను ఆయన కోరారు. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవడం, బలహీనతలను అధిగమించడం అధికారుల బాధ్యత అని రాజీవ్‌కుమార్ పేర్కొన్నారు. ఉత్తమ నిర్వహణ పద్ధతులను, లోపాలను సమర్థవంతంగా గుర్తించేందుకు మెరుగైన విధానాలను రూపొందించాల్సిన అవసరముందని అధికారులకు తెలిపారు. ఆమోదయోగ్యమైన పద్ధతులు ఆధారంగా నివేదికను సిద్ధం చేయాలని తెలిపారు. ఈ నివేదికను అమలు చేయడానికి సీనియర్ కార్యనిర్వహణ అధికారులను జవాబుదారీగా పేర్కొంటూ, బ్యాంకు బోర్డులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని ఆయన సూచించారు.

దళిత కుటుంబంపై దాడి బాలుడి మృతి

చెన్నై: ఓ దళిత కుటుంబంలోని తల్లీకూతుళ్లపై లైంగికదాడికి పాల్పడి బాలుడి(12)ని కిరాతకంగా హత్య చేసిన ఘటన తమిళనాడులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమిళనాడులోని వెల్లంపుత్తూర్ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ఈ నెల 22న గుర్తు తెలియని వ్యక్తులు ఓ దళితకుటుంబంపై దాడి చేశారు. కుటుంబంలోని మహిళ, ఆమె కుమార్తె(15) పై లైంగికదాడికి పాల్పడ్డారు. అంతేగాక వారిపై దాడి చేయడంతో తలలకు తీవ్ర గాయాలయ్యాయి. అడ్డువచ్చిన బాలుడిని కొట్టి కిడ్నాప్ చేశారు. అతని గొంతు కోసి హత్య చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపట్ల ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.

భారత్‌లో జోర్డాన్ రాజు పర్యటన



న్యూఢిల్లీ : మూడు రోజుల భారత పర్యటన నిమిత్తమై జోర్డాన్ రాజు అబ్దుల్లా-2 బిన్ అల్ హుస్సేని మంగళవారం న్యూఢిల్లీ చేరుకున్నారు. ప్రధాని మోడీ స్వాగతం పలికారు. ఈ పర్యటనలో రక్షణ, భద్రత, పెట్టుబడుల రంగాల్లోని పలు అంశాలపైన, తీవ్రవాదం, అతివాద గ్రూపులకు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలు వంటి వాటిపై ప్రధాని మోడీ- హుస్సేని చర్చలు జరపనున్నారు. రక్షణ, భద్రతరంగాలపై ఇరు దేశాల మధ్య గతంలోనే ఉన్నతస్థాయి చర్చలు జరిగాయి. సిరియా శరణార్థుల సంక్షోభం, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదం వంటివాటిని జోర్డాన్ సమర్థవంతంగా నియంత్రించగలిగింది. ఈ అంశంలో జోర్డాన్ అనుభవాల్ని, పద్ధతుల్ని తెలుసుకోవటంపై భారత్ ఆసక్తికనబర్చింది. జోర్డాన్ రాజు హుస్సేనికి ఆ దేశ ఆర్మీలో పనిచేసిన అనుభవముంది. అలాగే దేశ రక్షణ, భద్రతా అంశాల్లో అవగాహన ఉంది. ఇరాక్‌లో గల్లంతైన భారతీయుల్ని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావటంలో సాయం చేస్తామంటూ గతంలో జోర్డాన్ ముందుకు వచ్చింది. ఎన్నో దశాబ్దాల నుండి కొనసాగుతున్న ఇరు దేశాల వర్తక, వాణిజ్య బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవటంపై జోర్డాన్ రాజు దృష్టిపెట్టారు.


సొహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో బలిగానున్న మరో న్యాయమూర్తి

రాహుల్ వ్యాఖ్య



న్యూఢిల్లీ : సొహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసులో మరో న్యాయమూర్తి బలి కాబోతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మంగళవారం వ్యాఖ్యానించారు. ఈ కేసు విచారణ తీరుపై ఆయన తీవ్రంగా స్పందిస్తూ, ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లను బోంబే హై కోర్టులోని ఏకసభ్య ధర్మాసనానికి కేటాయించడంపై ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కేసును విచారిస్తున్న న్యాయమూర్తిని తొలగించారని మీడియాలో వచ్చిన వార్తలను రాహుల్ ప్రస్తావిస్తూ, మరో కొత్త న్యాయమూర్తి వస్తున్నారని అనడంతోపాటు ..సిబిఐ న్యాయమూర్తి బిజి లోయా మృతిని కూడా ఆయన గుర్తు చేశారు.. లోయా ఎలా మృతి చెందారంటూ తన ట్వీట్‌లో ప్రశ్నించారు. "సొహ్రాబుద్దీన్ కేసుకు మరో జడ్జి బలికాబోతున్నారు. ఈ కేసులో సిబిఐని సవాల్‌చేసిన జస్టిస్ రేవతి డేరేను తొలగించారు. కోర్టు ఎదుట హాజరుకావాలని అమిత్‌షాను ఆదేశించిన న్యాయమూర్తి జెడి ఉత్పాత్‌ను కూడా తొలగించారు. ఈ కేసుకు సంబంధించి కొన్ని కఠినమైన ప్రశ్నలు అడిగిన జస్టిస్ లోయ కూడా మరణించారు. లోయా ఎలా మృతి చెందారు?" అంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. సొహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో కొంతమంది సీనియర్ ఐపిఎస్ అధికారులను నిర్దోషులుగా విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటి విచారణ బాధ్యతలను బోంబే హై కోర్టులో కొత్త ఏకసభ్య ధర్మాసనానికి అప్పగించారు. ఈ కేసులో జస్టిస్ డెరే ప్రతి రోజూ విచారణను ప్రారంభించిన మూడు వారాల తరువాత కొత్త ధర్మాసనానికి అప్పగించారు. దీనికి సంబంధించిన నోటీసును హై కోర్టు వెబ్‌సైట్‌లో ప్రచురించారు.

రైతు ఉద్యమ నేత ప్రబోధ్ పాండ మృతి



న్యూఢిల్లీ : రైతు ఉద్యమ నేత ప్రబోధ్ పాండ మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయన వయస్సు72 సంవత్సరాలు. కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, రైతు ఉద్యమంలోనూ ఆయన కీలక నేతగా ఉన్నారు. ప్రబోధ్ పాండ మృతిపై అఖిల భారత రైతు మహాసభ (ఎఐకెఎస్) తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఎఐకెఎస్ (అజోయ్‌భవన్) అధ్యక్షులుగానూ ఆయన పనిచేశారు. 2015లో బెంగాల్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అయన మిడ్నపూర్ నియోజకవర్గం నుంచి మూడు సార్లు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. పార్లమెంట్‌లో రైతు, కార్మిక, పేద ప్రజల సమస్యలను ప్రస్తావించేవారు. తన నియోజకవర్గంలోని జూట్ రైతులు, జూట్ మిల్లు కార్మికుల సమస్యలను సభలో లేవనెత్తేవారు. మృదువుగా మాట్లాడే ఆయన నిరాడంబర జీవితాన్ని గడిపేవారు.ప్రస్తుతం కీలకమైన పోరాటాల సమయంలో ఆయన మృతి రైతు ఉద్యమానికి తీవ్రమైన లోటుగా ఎఐకెఎస్ పేర్కొంది. ప్రబోధ్ పాండ కుటుంబసభ్యులకు, ఆయన సహచరులకు ఎఐకెఎస్ తన సానుభూతిని తెలిపింది.

దాడి చేయబోమని హామీ ఇస్తేనే సమావేశానికొస్తాం

- ఢిల్లీ సీఎంకు సీఎస్ లేఖ

న్యూఢిల్లీ: తమపై దాడి చేయబోమని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ హామీ ఇస్తేనే ప్రభుత్వం నిర్వహించే సమావేశాలకు హాజరవుతామని ఢిల్లీ సీఎస్ అన్షు ప్రకాశ్ అన్నారు. ఈ విషయంపై కేజ్రీవాల్‌కు ఆయన మంగళవారం ఓ లేఖ రాశారు. మూడు రోజులుగా అధికారులు లేక పాలన స్తంబించిందని.. ప్రజల సౌకర్యార్థం అధికారులంతా తమ విధులకు హాజరు కావాలని ప్రభుత్వాధికారులను కేజ్రీవాల్ కోరారు. దీంతో సీఎస్ పై విధంగా స్పందించారు. గత వారం సీఎస్‌పై ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలు దాడికి పాల్పడిన తర్వాత ప్రభుత్వాధికారులు కేజ్రీవాల్ ప్రభుత్వంలో పనిచేయలేమని సచివాలయానికి రావడం మానేశారు. ఈ విషయమై కేజ్రీవాల్ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌తో మాట్లాడారు. ఇదిలా వుండగా, ఢిల్లీలో ఇకనుంచి జరిగే ప్రభుత్వ కార్యక్రమాలన్నింటినీ ప్రత్యక్షప్రసారం చేయనున్నారు. ఆ సమాచారాన్నంతా ప్రజలు చూడటం కోసం వెబ్‌సైట్‌లో ఉంచనున్నారు.



ఎల్ఫిన్‌స్టన్ బ్రిడ్జీ పునర్నిర్మాణం..

- 117 రోజుల్లో పూర్తి

ముంబయి: గతేడాది భారీ వర్షాలకు ముంబయిలో కూలిపోయిన ఎల్ఫిన్‌స్టన్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి(ఎఫ్ఓబీ)ని రికార్డుస్థాయిలో పునర్నిర్మించారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి పియూశ్ గోయల్ ఈ బ్రిడ్జిని మంగళవారం ప్రారంభించారు. కేవలం 117 రోజుల్లోనే దీని నిర్మాణం పూర్తవడం విశేషం. భారత ఆర్మీ యుద్ధ ప్రాతిపదికన దీనిని నిర్మించింది. ఈ సందర్భంగా గోయల్ మాట్లాడుతూ... 'ముంబయి వాసులు భారత సైనికాదళానికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి, అత్యున్నత నాణ్యతతో దీని నిర్మాణం జరిగింది' అని అన్నారు. వెస్ట్రన్ రైల్వే పరిధిలోని పరేల్, ఎల్ఫిన్‌స్టన్ స్టేషన్లను ఈ బ్రిడ్జీ అనుసంధానం చేస్తుంది. 73 మీటర్ల పొడవు, 3 మీటర్ల వైశాల్యంతో ఉన్న ఈ బ్రిడ్జీ నిర్మాణానికి రూ. 18 కోట్లు ఖర్చు చేశారు. దీంతో పాటు కర్రే రోడ్, అంబివిల్లి ఎఫ్ఓబీలనూ పియూశ్ ప్రారంభించారు. వీటిని ముంబయి వాసులకు అంకితమిస్తూ.. భారత ఆర్మీ ధైర్య సాహసాలను కీర్తిస్తూ ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. గతేడాది సెప్టెంబర్ 29న కురిసిన భారీ వర్షాలకు పురాతనమైన ఎల్ఫిన్‌స్టన్ బ్రిడ్జీ కూలిపోయింది. అంతకు ముందు జరిగిన తొక్కిసలాటలో 22 మంది మరణించారు.

తుపాకులు సరఫరా చేస్తున్న పూజారులు

- అరెస్టు చేసిన పంజాబ్ పోలీసులు

చండీగఢ్: దశాబ్దకాలంగా గుట్టుచప్పుడు కాకుండా తుపాకులు సరఫరా చేస్తున్న పూజారుల ధ్వయాన్ని పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే... ఉత్తరప్రదేశ్‌కు చెందిన భగవాన్ దాస్ (40), లేఖ్‌రాజ్ (40)లు మధుర జిల్లాలోని ఓ గ్రామంలో పూజారులుగా పనిచేస్తున్నారు. దశాబ్దకాలంగా వీరిరువురు.. యూపీలో నాటు తుపాకులను రూ. 6వేలకు కొని పంజాబ్‌లో రూ. 9వేలకు అమ్ముతున్నారు. పంజాబ్‌కు చెందిన అవతార్ సింగ్ తోడవ్వడంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తోంది. నిందితులిద్దరూ సోమవారం ఒక వ్యక్తికి తుపాకీ అమ్మడానికి బయలుదేరగా పంజాబ్‌లోని సంగ్రూరు వద్ద పోలీసులు వీరిని అరెస్టు చేశారు. విచారణ చేయగా అవతార్‌సింగ్ పేరు చెప్పడంతో మంగళవారం అతడినీ అరెస్టు చేశారు. వారి వద్ద మూడు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఒకడైన భగవాన్‌పై 2011లోనే తుపాకులు సరఫరా చేస్తున్నందుకు కేసు నమోదయ్యింది.

లూథియానా మున్సిపల్‌లో కాంగ్రెస్ 'పాగా'

- 62 వార్డుల్లో విజయం
- కేవలం 10 వార్డులకే పరిమితమైన బిజెపి
- ఎస్ఎడి 11, ఎల్ఐపి 7, ఆప్ 1, స్వతంత్రులకు 4 స్థానాలు
- ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్న ముఖ్యమంత్రి అమరిందర్



చండీగఢ్ : లూథియానా మున్సిపల్ కార్పొరేషన్‌ను కాంగ్రెస్ విజయభేరి మ్రోగించింది. వరుసగా రెండు సార్లు అధికారంలో వున్న ఎస్ఎడి-బిజెపి కూటమికి గట్టి 'షాక్' ఇచ్చింది. మొత్తం 92 వార్డులకు జరిగిన ఎన్నికల్లో 62 వార్డులలో కాంగ్రెస్ విజయం సాధించింది. ప్రతిపక్ష పార్టీలు కేవలం రెండంకెల స్థానాలతో సరిపెట్టుకున్నాయి. శిరోమణి అకాలీదళ్ (ఎస్ఎడి) 11 స్థానాలు గెలుచుకోగా, దీని మిత్రపక్షమైన బిజెపి కేవలం 10 స్థానాలకు పరిమితమైంది. ఈ ఎన్నికల్లో 59 స్థానాల్లో పోటీ చేసిన లోక్ ఇన్సాఫ్ పార్టీ (ఎల్ఐపి) కేవలం 7 స్థానాలకు పరిమితమయ్యింది. దీని భాగస్వామ్య పక్షమైన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఒక్క స్థానాన్ని సాధించుకోగలిగింది. ఆప్ లూథియానా కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే తొలిసారి. స్వతంత్ర అభ్యర్థులు నాలుగు స్థానాలను గెలుచుకున్నారు. లూథియానా మున్సిపల్ కార్పొరేషన్‌కు ఈ నెల 24న జరిగిన ఎన్నికల్లో 494 మంది అభ్యర్థులు పోటీ చేశారు. రెండు బూత్‌లలో మాత్రం సోమవారం తిరిగి పోలింగ్ జరిగింది. పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ ఈ ఫలితాలపై స్పందిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు మద్దతుగా ప్రజలిచ్చిన స్పష్టమైన తీర్పని పేర్కొన్నారు..ఈ విజయానికి కృషి చేసిన కార్యకర్తలను అభినందించారు. పంజాబ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సునీల్ జాఖర్, కేబినెట్ మంత్రి నవజోత్ సింగ్ సిద్ధులు కూడా ఫలితాలపై హర్షం వ్యక్తం చేశారు.

మోటారు సైకిళ్ళ దిగుమతి సుంకంపై భారత్ నిష్పాక్షికంగా లేదు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్ : అమెరికాకు చెందిన హార్లే డేవిడ్సన్ మోటార్ సైకిళ్ళ దిగుమతిపై భారత్ అత్యధిక సుంకాన్ని విధించడంపట్ల అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీదైన మోటారు సైకిళ్ళ దిగుమతిపై కస్టమ్స్ సుంకాన్ని 50శాతానికి తగ్గిస్తామని ఇటీవల భారత్ చేసిన ప్రకటనతో అమెరికాకు ఒరిగిందేమీ లేదని ట్రంప్ అన్నారు. నిష్పాక్షికమైన పరస్పర వాణిజ్య ఒప్పందాలను అమెరికా కోరుకుంటున్నదన్నారు. హార్లే డేవిడ్సన్ కంపెనీ భారత్‌కు మోటారు సైకిళ్ళు పంపితే నూటికి నూరు శాతం సుంకాన్ని చెల్లించాల్సి వస్తున్నదని ట్రంప్ అన్నారు. వైట్ హౌస్‌లో అన్ని రాష్ట్రాల గవర్నర్లతో జరిగిన సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారని తొలుత దిగుమతి సుంకాన్ని రద్దు చేస్తామని చెప్పిన నరేంద్ర మోడీ, ఆ తరువాత 50 శాతానికి తగ్గిస్తామన్నారని దానికి తాము ఓకే చెప్పినప్పటికి ఆయన ఆ పనిచేయలేక పోయారన్నారు. వారు మనకు అనుకూలంగా వ్యవహరించిన విధంగానే అమెరికా కూడా వ్యవహరిస్తుందని వారు భావించి ఉంటారని, అయితే అది అనుకూలత కాదని ట్రంప్ అన్నారు. ఆ తరువాత దానిని 75 శాతానికి తగ్గిస్తున్నట్లు చెప్పారని, ఆ తరువాత 50 శాతానికి కూడా తగ్గిస్తామన్నారన్నారు. అది సరైంది విధానం కాదని ట్రంప్ పేర్కొన్నారు.

ప్రత్యేకం

మ్యాన్‌హోల్స్ శుద్ధికి బందికూట్ రోబో

తిరువనంతపురంలో ప్రవేశపెట్టనున్న కేరళ ప్రభుత్వం



తిరువనంతపురం: మ్యాన్‌హోల్స్, మురికి కాలువలు శుద్ధిచేయడానికి జెన్‌రోబోటిక్స్ కంపెనీ యువ ఇంజనీర్లు రూపొందించిన బందికూట్ రోబోను తిరువనంతపురంలో ప్రవేశపెట్టడానికి కేరళ వాటర్ అథారిటీ నిర్ణయించింది. మ్యాన్‌హోల్స్ శుద్ధి చేయడమే లక్ష్యంగా రూపొందించిన ఈ రోబోను ఈ నెల ప్రారంభంలో విజయవంతంగా పరీక్షించారు. స్పైడర్ ఆకారంలో 80 కిలోగ్రాములు ఉండే ఈ రోబో.. పరీక్షలో భాగంగా చెత్తతో కూడిన ఐదు మ్యాన్‌హోల్స్ శుభ్రం చేసింది. మ్యాన్‌హోల్స్, కాలువలు శుద్ధి చేయడానికి దాదాపు 15 నుంచి 45 నిమిషాలు సమయం తీసుకుంటుంది. చేతులతో మ్యాన్‌హోల్స్ శుభ్రం చేసే పనులను భారత్‌లో రూపుమాపడమే లక్ష్యమని రోబో సృష్టికర్తలు తెలిపారు. మ్యాన్‌హోల్స్ శుద్ధి చేసే సమయంలో సరైన భద్రతా చర్యలు లేనందున కార్మికులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. కాగా వీరిలో చాలా మంది దళిత సామాజిక వర్గానికి చెందిన వారే. దీంతో బందికూట్ వారికి ఓ ఆశ కిరణం కాబోతుంది. ఈ రోబోకు సంబంధించిన పని విధానాన్ని కార్మికులకు నేర్పిస్తామని జెన్‌రోబోటిక్స్ ఇంజనీర్ గోవింద్ అన్నారు. 'బందికూట్ కార్మికులకు సురక్షితమైన జీవితాన్ని ప్రసాదిస్తుంది. ఉపాధి పై భరోసాతో కార్మికులు తమ జీవితాన్ని హుందాతో గడపవచ్చు' అని ఆయన అన్నారు. కేరళ ప్రభుత్వ తీసుకొచ్చిన స్టార్టప్ మిషన్ సహాయంతో ఇంజనీర్లు ఈ రోబోను రూపొందించారు. గతేడాది జూన్‌లో పనులు ప్రారంభించి విజయవంతంగా పూర్తి చేశారు. కేరళ ఐటీ సెక్రటరీ ఎం. శివశంకర్ సూచన మేరకే ఈ రోబోను రూపొందించామని గోవింద్ అన్నారు. దీన్ని రూపొందిండానికి మ్యాన్‌హోల్స్ శుద్ధి చేసే అనేక వీడియోలు, డాక్యుమెంటరీలు చూశామని, కార్మికులతో మాట్లాడామని ఆయన తెలిపారు. కేరళ వాటర్ అథారిటీ, స్టార్టప్ మిషన్‌కు రుణపడి ఉంటామన్నారు. ఒక్కో రోబో ఖరీదు దాదాపు రూ. 10 లక్షలు ఉంటుందని తెలిపిన ఇంజనీర్లు.. ప్రభుత్వంతో మాట్లాడిన తర్వాతే ధరను ఖరారు చేస్తామని తెలిపారు. పారిశుధ్యం(చేతులతో మానవ విసర్జితాలు, చెత్త శుభ్రం చేయడం) భారత్‌లో చట్టవిరుద్ధం. అయినప్పటికీ దేశంలో చాలా మంది ఈపనుల్లో కొనసాగుతునానరు. 2010-17 మధ్య దాదాపు 1,470 మంది కార్మికులు చనిపోగా, 1.80లక్షల మంది ఈ పనుల్లో కొనసాగుతున్నారు.

సంక్షిప్తం

భారత్‌తో వాణిజ్యానికి కొరియా సిద్ధం

న్యూఢిల్లీ : విదేశీ పెట్టుబడులను స్వాగతిస్తూ ప్రధాని నరేంద్రమోడీ ప్రపంచంలోనే అత్యంత బలమైన ఆర్థిక వ్యవస్థలో భారత్ ఒకటని, ప్రపంచ దేశాలతో వ్యాపారం చేయడానికి సిద్ధంగా ఉందని మంగళవారం వ్యాఖ్యానించారు. భారత్ - కొరియా వ్యాపార సమ్మిట్‌లో భాగంగా ప్రధాని పైవిధంగా వెల్లడించారు. భారత్‌తో వ్యాపారం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, భారత ప్రభుత్వం పెట్టుబడులను ప్రోత్సహించడానికి, కాపాడటానికి అన్ని విధాల సహాయం చేస్తామని వాగ్దానం చేసిందని కొరియాకు చెందిన వ్యాపార వేత్తలు అన్నారు.

రాజౌరి సెక్టార్‌లో కాల్పులు

శ్రీనగర్ : పాకిస్తాన్ భద్రతా బలగాలు మరోసారి కాల్పులను ఉల్లంఘించాయి. మంగళవారం ఉదయం రాజౌరి సెక్టార్‌లోని సరిహద్దు నియంత్రణ రేఖ వద్ద గల మంజ్‌కోట్ వద్ద విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డాయి. అయితే ఈ కాల్పుల ఘటనలో ఎవరికి ప్రమాదం జరగలేదని భద్రతా అధికారులు తెలిపారు. భారత భద్రతా అధికారులు కూడా పాక్ బృందాల కాల్పులకు దీటుగా సమాధానమిస్తున్నట్లు తెలిపారు. సమాచారం ఇంకా తెలియాల్సివుందని అధికారులు వెల్లడించారు.

ఆవుల అక్రమ రవాణాపై కొత్త నిబంధనలు

జైపూర్ : పశువుల అక్రమ రవాణాను అరికడతామంటూ రాజస్తాన్‌లోని వసుంధరరాజే ప్రభుత్వం కొత్త నిబంధనను ప్రవేశపెట్టనుంది. ఈ నిబంధనల ప్రకారం ఆవులను అక్రమంగా రవాణా చేసే వాహనాలను సీజ్ చేసి, నిందితులను అరెస్టు చేసే విధంగా రాజస్తాన్‌లోని బోవైన్ చట్టం 1995లో సెక్షన్ 6(ఎ)ను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. దీని ప్రకారం రాజస్తాన్‌లో అక్రమంగా ఆవులను తరలించే వాహనాలను సీజ్ చేస్తారు. అనంతరం జరిమానాను విధిస్తారు. అవసరమైతే నిందితులను కఠినంగా శిక్షించవచ్చని రాజస్తాన్‌కు చెందిన కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రాజేంద్రా రాథోర్ కేంద్ర మంత్రి మండలిలో తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ బిల్లును రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు.

దక్షిణ కొరియాలో ముగిసిన ఉ.కొరియా జనరల్ పర్యటన

సియోల్ : ఉత్తర కొరియా జనరల్ కిమ్ యాంగ్ చోల్ తన దక్షిణ కొరియా పర్యటన ముగించారు. ఆదివారం జరిగిన వింటర్ ఒలింపిక్స్ ముగింపు ఉత్సవానికి హాజరైన ఆయన స్వదేశానికి తిరిగి వెళ్ళారు. ఉభయ కొరియా వ్యవహారాలకు జనరల్ కిమ్ యాంగ్ ఇన్‌చార్జిగా వున్నారు. ప్యాంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌ను ఉపయోగించుకుని ఉత్తరకొరియా, అమెరికా మధ్య చర్చల క్రమం ప్రారంభించాలని దక్షిణ కొరియా భావించింది. కాగా జనరల్ కిమ్ యాంగ్‌ను పంపించడానికి ముందుగానే ఉత్తర కొరియా నేత కిమ్ తన సోదరిని ఒలింపిక్స్ క్రీడోత్సావానికి పంపించారు. అయితే ఈ ఇద్దరు కూడా అమెరికా ప్రతినిధులతో సమావేశమైన దాఖలాలు లేవు.

ఎన్నిక

పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్‌షరీఫ్ ను సుప్రీంకోర్టు అనర్హునిగా ప్రకటించిన నేపథ్యంలో ఆయన సోదరుడు షహ్‌బాజ్ షరీఫ్‌ను పిఎంఎల్ -ఎన్ అధ్యక్షునిగా ఎన్నుకున్నారు.



క్యూబన్ పార్లమెంట్‌లో విస్తరించనున్న 'స్థానిక'ప్రాతినిధ్యం

హవానా: క్యూబన్ పార్లమెంట్‌లో స్థానిక సంస్థలకు విస్తృత ప్రాతినిధ్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల అధికారి ఒకరు చెప్పారు. నేషనల్ అసెంబ్లీకి చెందిన కార్లోస్ రాఫెల్ ఫ్యూంటెస్ అనే అధికారి ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ క్యూబా పార్లమెంట్‌కు ఎన్నికైన 605 మంది ప్రతినిధుల్లో దేశవ్యాప్తంగా వున్న 150 మున్సిపాల్టీలకు కూడా ప్రాతినిధ్యం కల్పిస్తున్నామన్నారు. పట్టణం చిన్నదా, పెద్దదా అన్న ప్రశ్నతో నిమిత్తం లేకుండా ప్రజావాస ప్రాంతాలకు పార్లమెంట్‌లో కనీసం ఒక ప్రతినిధి వుంటారని, అట్టడుగు స్థాయి నుండి ఎన్నికైన వారు ప్రజల కోసం పనిచేస్తారని ఆయన వివరించారు. గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మున్సిపల్ అసెంబ్లీలకు ఎన్నికైన దాదాపు12,515 మంది ప్రతినిధుల (కౌన్సిలర్ల)ను కమ్యూనిటీలలో నామినేట్ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నైబర్ హుడ్ స్థాయిలో జరిగిన ఈ నామినేషన్లు క్యూబా ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజకీయ వ్యవస్థలో వున్న స్వచ్ఛతను చాటి చెబుతున్నాయని ఆయన అన్నారు. ఇది ఇతర దేశాలలో వున్న వ్యవస్థల కన్నా భిన్నమైనదని ఆయన వివరించారు. క్యూబా ఎన్నికల చట్టం ప్రకారం పార్లమెంట్, స్థానిక అసెంబ్లీలకు పోటీ చేసే మొత్తం అభ్యర్థులలో 50 శాతం మంది కౌన్సిలర్లు నుండి ఎన్నికకావాల్సి వుంటుంది. ఏప్రిల్ 19తో పదవీకాలం ముగియనున్న ప్రస్తుత పార్లమెంట్‌కు మార్చి 11న ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. పార్లమెంట్‌కు ఎన్నికయ్యే మొత్తం 605 మంది ప్రజా ప్రతినిధుల్లో 47.4 శాతం మంది నైబర్‌హుడ్ సభల నుండి ఎన్నికవుతారు.

అవసరమైతే రైఫిల్ అసోసియేషన్‌ను ఎదుర్కొంటాం : ట్రంప్



వాషింగ్టన్ : తుపాకీ సంస్కృతిని రూపుమాపేందుకు చట్టాలు తీసుకువచ్చే విషయంలో అవసరమైతే నేషనల్ రైఫిల్ అసోసియేషన్(ఎన్ఆర్ఎ)ను ఎదుర్కొనడానికి సుముఖంగా వున్నానని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే కాంగ్రెస్‌పై పూర్తిగా పట్టు వున్న రిపబ్లికన్లు మాత్రం ఈ విషయంలో స్పష్టతతో లేరు. తుపాకులకు పరిమితులు విధించే విషయంలో కొన్ని మార్పులు చేయడానికి మాత్రమే వారు ప్రాధాన్యతనిస్తున్నారు. ఫ్లోరిడా స్కూల్లో కాల్పులు జరిగి 17మంది విద్యార్థులు మృతి చెందిన నేపథ్యంలో రిపబ్లికన్ నేతలు తీవ్రంగా స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని హామీల వెల్లువ కురిపించినప్పటికీ ఆచరణలో మాత్రం శూన్యం. మరింత కఠినతరమైన తుపాకీ చట్టాలను తీసుకురావాలని కాల్పులు జరిగిన వెంటనే పదే పదే బహిరంగంగా పిలుపులు ఇచ్చినప్పటికీ ఆ తర్వాత కిమ్మనకుండా వుండిపోయారు.

ఈ వారంలో ఉభయ పార్టీలకు చెందిన సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు వైట్‌హౌస్ పేర్కొంది. రిపబ్లికన్ హౌస్ స్పీకర్ పాల్ రియాన్‌తో ట్రంప్ ఈ ఘటనపై మాట్లాడారు. టీచర్లకు ఆయుధాలివ్వాలని, అసాల్ట్ రైఫిల్స్ కొనుగోలు చేసేందుకు కనీస వయస్సు పెంచాలని ట్రంప్ సూచించినా వాటికి పెద్ద ఆదరణ లభించలేదు.

సౌదీ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రక్షాళకు చర్యలు

దుబాయ్ : యెమెన్‌లో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో రక్షణ మంత్రిత్వ శాఖ ప్రక్షాళనకు చర్యలను సౌదీ అరేబియా చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం తెల్లవారు జామున మిలటరీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌ని, ఇతర రక్షణ అధికారులను మార్చివేశారు. కార్మిక, సామాజిక అభివృద్ధి శాఖ డిప్యూటీ మంత్రిగా మహిళను నియమిస్తూ సౌదీ ప్రకటన చేసింది. పని ప్రదేశాల్లో మహిళల పాత్రను మరింత విస్తృతపరిచేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు సౌదీ అరేబియా వరుసగా డిక్రీలు జారీ చేసింది. రాజు సల్మాన్ వీటికి ఆమోద ముద్ర వేశారు. మిలటరీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ అబ్దుల్‌రహమాన్ బిన్ సలేహ్‌ను తొలగించడం ప్రధాన మార్పు. జనరల్ రాయల్ కోర్టుకు కన్సల్టెంట్‌గా వుంటారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మద్దతు గల సౌదీ నేతృత్వంలోని సంకీర్ణం యెమెన్ ప్రతిష్టంభనలో చిక్కుకున్న నేపథ్యంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. 10వేల మందికి పైగా ఈ యుద్ధంలో మరణించారు. దీంతో సౌదీపై అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సహాయక సంస్థలు కూడా యెమెన్‌ను దుర్భిక్షం బారిన పడేలా చేశారంటూ సౌదీ కూటమిపై మండిపడుతున్నాయి. సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ రక్షణ మంత్రిగా వున్నారు.

సిరియా సైన్యానికి లొంగిపోతున్న రెబల్స్

25 మంది పౌరులను పొట్టనపెట్టుకున్న అమెరికా దళాలు



డెమాస్కస్: సిరియా ఉత్తరాన వున్న హసాకే ప్రావిన్స్‌లోని మన్బిజ్ మున్సిపాల్టీలో దాదాపు 2 వేల మందికి పైగా సాయుధ తిరుగుబాటు దారులు తమ ఆయుధాలను సైన్యానికి స్వాధీనం చేసి లొంగిపోయారని అధికారులు చెప్పారు. మన్బిజ్‌కు చెందిన న్యాయమూర్తి అబ్దుల్లా అల్ హుస్సేన్ సిరియన్ ఆన్‌లైన్ పత్రిక అల్ వాటన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 2016 నవంబర్‌లో జారీ చేసిన ఆమ్నెస్టీ డిక్రీ మేరకు అధికారిక క్షమాభిక్ష పొందిన రెబల్స్ డెమాస్కస్ అధికారులకు లొంగిపోయారని చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న శాంతి ప్రయత్నాలకు ఈ లొంగుబాట్లు మరింత ఊతమిస్తాయని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం సిరియా ప్రభుత్వ ఆధీనంలో లేని ప్రాంతం నుండి తేహ్ క్రాసింగ్ మీదుగా వచ్చే వారిని కూడా స్వీకరించేందుకు రికన్సీలియేషన్ కమిషన్‌లు తమ ప్రయత్నాలను కొనసాగిస్తాయని ఆయన వివరించారు.

తూర్పు సిరియాలో ఐఎస్ స్థావరంపై జరిగిన వైమానిక దాడుల్లో 25మంది పౌరులు మరణించారు. వీరిలో ఏడుగురు పిల్లలు వున్నారని మానవ హక్కుల పర్యవేక్షకులు తెలిపారు. ఇరాక్ సరిహద్దుకు సమీపంలో అల్ షాఫ్ గ్రామానికి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆదివారం ఈ దాడులు చోటు చేసుకున్నాయని సిరియా మానవ హక్కుల పర్యవేక్షణ కేంద్రం తెలిపింది. అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ కూటమి ఈ దాడులు జరిపింది. తూర్పుసిరియాలో ఈ గ్రామం ఒక్కటే ఐఎస్ అదుపులో వున్న ఏకైక ప్రాంతమని బ్రిటన్‌లోని మానవ హక్కుల కేంద్రం అధ్యక్షుడు రమీ అబ్దుల్ రహమాన్ తెలిపారు. ఇటీవలి వారాల్లో డెర్ ఎజార్ ప్రావిన్స్‌లోని మారుమూల ప్రాంతాల్లో జిహాదీ బలగాలపై వైమానిక దాడులు జరిగాయి. డజన్ల సంఖ్యలో పౌరులు మరణించారు.

పశ్చిమ దేశాల తీర్మానాన్ని వీటో చేసిన రష్యా

- ఇరాన్‌పై ఏకపక్ష చర్యలు
- అమెరికా హెచ్చరిక



ఐక్యరాజ్య సమితి/తెగుసిగల్ప : యెమెన్‌లోని హౌతి గ్రూపు తీవ్రవాదుల చేతుల్లోకి ఆయుధాలు వెళ్ళకుండా నివారించడంలో విఫలమైనందుకు ఇరాన్‌పై ఏకపక్షంగా చర్య తీసుకుంటామంటూ అమెరికా హెచ్చరించింది. కాగా, భద్రతా మండలిలో ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని పశ్చిమ దేశాలు తీసుకునే చర్యలను రష్యా వీటో చేసింది. "ఇరాన్‌ను కాపాడే ప్రయత్నాలను రష్యా ఇలా కొనసాగిస్తూ వుంటే అమెరికా, ఆ దేశ భాగస్వాములు సొంతంగా చర్య తీసుకోవాల్సిన అవసరం వుంటుందని ఐక్యరాజ్య సమితిలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ అన్నారు. భద్రతా మండలి చర్య తీసుకోకపోతే తాము చర్య తీసుకొనక తప్పదని స్పష్టం చేశారు. హోండూరస్ రాజధాని తెగుసిగల్పలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు. అయితే ఎలాంటి చర్య తీసుకుంటామనేది ఆమె వివరించలేదు. ఇరాన్‌పై చర్యలను అడ్డుకుంటూ రష్యా వీటో చేయడం అమెరికాకు ఓటమే. ఇరాన్ చర్యలకు ఐక్యరాజ్య సమితిలో ఆ దేశాన్ని జవాబుదారీ చేయడానికి అమెరికా అనేక నెలలుగా ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు 2015లో కుదుర్చుకున్న ఒప్పందం నుండి బయటకు వచ్చేస్తామని బెదిరిస్తోంది. ప్రమాదకరమైన, అక్రమమైన ఇరాన్ వ్యవహార శైలి చెల్లుబాటు అయ్యేలా ఈనాటి ఓటింగ్ జరిగిందని, అంతకుమించి మరేమీ లేదని రష్యా వీటోపై నిక్కీ హేలీ వ్యాఖ్యానించారు. 2015 నాటి ఒప్పందాన్ని మరింత మెరుగుపరిచేందుకు అమెరికాతో కలిసి పనిచేయడానికి మే మధ్య నాటికల్లా సిద్ధం కావాల్సి వుంటుందని గత నెల్లోనే ట్రంప్, యురోపియన్ మిత్రపక్షాలను హెచ్చరించారు.

ఉత్తర ధృవం వద్ద పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

వాషింగ్టన్ : శీతాకాలంలో ఉత్తర ధృవం వద్ద ఉష్ణోగ్రతలు పెరగడం పట్ల శాస్త్రవేత్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి మాసంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ఆర్కిటిక్ ఖండంలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్చి 20 వరకు ఉత్తర ధృవం వద్ద సూర్యుడు కనిపించడు. దాంతో సాధారణంగా ఈ సమయంలో ఆ ప్రాంతంలో అత్యంత శీతలంగా వుంటుంది. ఏడాదిలో కెల్లా చల్లగా వుండే సమయమిదే. అయితే ఈ వారాంతంలో అసాధారణమైన పరిణామం సంభవించింది. తుపాను కారణంగా గ్రీన్‌ల్యాండ్ సముద్రం మీదుగా వేడి గాలులు రావడంతో మంచు కరిగే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తర ధృవం వద్ద 20 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు పెరిగి వుండవచ్చునని అమెరికా గ్లోబల్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్ తెలిపింది. ఆ ప్రాంతంలో ఉష్ణోగ్రతలను నమోదు చేయడానికి నేరుగా ఎలాంటి పద్ధతులు లేవు. అయితే ఇర్విన్‌లో కాలిఫోర్నియా యూనివర్శిటీలో పిహెచ్‌డి చేస్తున్న వాతావరణ శాస్త్రవేత్త జాక్ లేబ్ మాట్లాడుతూ, సాధారణం కన్నా 30 డిగ్రీల సెల్సియస్‌కి పైగా వుండవచ్చునని అనేక స్వతంత్ర విశ్లేషణల ద్వారా తెలుస్తోందని చెప్పారు. డానిష్ వాతావరణ సంస్థ 1958 నుండి సేకరిస్తున్న డేటాను పరిశీలిస్తే ఇది చాలా ఎక్కువని తెలుస్తోందని అన్నారు. ఒకప్పుడు అరుదుగా వుండే ఇటువంటి వేడిగాలులు ఇప్పుడు చాలా సర్వసాధారణమవుతున్నాయని పరిశోధనల్లో వెల్లడవుతోంది.

మాల్దీవుల మంత్రి రాజీనామా

మాలె : మాల్దీవుల ఆరోగ్య శాఖ మంత్రి దున్యా మమూన్ రాజీనామా చేశారు. ఈమేరకు ఆమె ఒక లేఖ రాశారు. సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలందించిన నేత, తన తండ్రి అబ్దుల్ గయూమ్‌ను అరెస్టు చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుండి మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం నెలకొంది. అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్‌కి చెందిన పాలకపార్టీ నుండి రాజీనామా చేసిన రెండో మంత్రి దున్యా. త్వరలోనే తన తండ్రిని విడుదల చేస్తారని ఆశిస్తున్నటు ఆమె చెప్పారు. ఇటువంటి సంక్షోభ సమయంలో మాల్దీవుల ప్రజలకు మద్దతుగా అంతర్జాతీయ సమాజం నిలబడాలని ఆమె కోరారు. పటిష్టవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణానికి సాయపడాలని ఆమె ఆ లేఖలో ఆకాంక్ష వ్యక్తం చేశారు.

మొదటి పేజీ తరువాయి

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

అమలవుతుంది. విద్యార్థులు హాల్ టికెట్లను jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని, ప్రిన్సిపాల్ చేత ధ్రువీకరించుకోవాలి. విద్యార్థులు పరీక్షా కేంద్రాల్ని తెలుసుకునేందుకు వీలుగా 'ఐపిఈ(ఇంటర్మీడియేట్ పబ్లిక్ ఎగ్జామినేషన్) సెంటర్ లోకేటర్ యాప్'ను ఇంటర్మీడియేట్ బోర్డు రూపొందించింది.పరీక్షా కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలనూ అనుమతించరు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థుల్ని నాలుగేళ్ల (ఎనిమిది పరీక్షలు)పాటు బోర్డు డిబార్ చేస్తుంది. మొదటిసారి ఇన్విజిలేటర్లను లాటరీ పద్ధతిలో ఎంపిక బోర్డు కేటాయించనుంది. 13 జిల్లాల్లో పరీక్షల కమిటీలతో పాటు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీలను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద తక్షణ వైద్యసేవల్ని అందించేందుకు మెడికల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున జిరాక్స్ సెంటర్లను అనుమతించేది లేదని, పరీక్ష ప్రారంభం నుంచి ముగిసే వరకు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలకు సంబంధించి సమస్యలుంటే 0866-2974130, ఫాక్స్ నెంబర్ 0866-2970056కు, టోల్ ఫ్రీ నెంబర్ 18002749868కు ఫిర్యాదు చేయవచ్చు.

ప్రమాదవశాత్తూ నీట మునిగి...

అంత్యక్రియలు నిర్వహించనున్నారు. వాస్తవానికి పోస్ట్‌మార్టం తరువాత విడుదల చేసిన ఫోరెన్సిక్ నివేదికలో కూడా శ్రీదేవి ప్రమాద వశాత్తు నీటి తొట్టిలో పడి, మునగడం వల్లే మరణించారని పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తం కావడంతో దుబాయ్ పోలీసులు రంగంలోకి దిగారు. పబ్లిక్ ప్రాసిక్యూషన్ విభాగానికి కేసు అప్పగించారు. దీంతో శ్రేదేవి మరణం చుట్టూ అనేక సందేహాలు నెలకొన్నాయి. పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూషన్ విభాగం సోమవారమంతా పరిశోధన నిర్వహించారు. శ్రీదేవి భర్త బోని కపూర్‌ను సుదీర్ఘంగా విచారించడంతో పాటు, తమ అనుమతి లేకుండా దేశం విడిచిపోవద్దని ఆదేశించారు. మంగళవారం నాడు కూడా ఈ దర్యాప్తు ప్రక్రియ కొనసాగింది. ఒక దశలో శ్రీదేవి భౌతిక కాయానికి రీ పోస్ట్ మార్టం చేసే అవకాశం ఉందన్న వార్తలూ వచ్చాయి. అయితే, సుదీర్ఘ విచారణ తరువాత ఫోరెన్సిక్ నివేదికలోనే అంశాలతో పబ్లిక్ ప్రాసిక్యూషన్ విభాగం, పోలీసులూ ఏకీభవించారు. శ్రీదేవి ప్రమాదవశాత్తు మరణించారనిపేర్కొంటూ ధృవీకరణ పత్రాన్ని అందచేశారు. ఈ కేసును ఇంతటితో ముగిస్తున్నామని ప్రాసిక్యూషన్ కార్యాలయం తన ట్వీట్‌లో వివరించింది. దీంతో శ్రీదేవి భౌతికదేహాన్ని తరలించడానికి ఆటంకాలు తొలగిపోయాయి. ఈ కేసుకు సంబంధించి శ్రీదేవి భర్త, సినీ నిర్మాత బోనీకపూర్ వాంగ్మూలాన్ని దుబాయ పోలీసులు నమోదు చేశారు.

సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌లో ప్రజల కోసం

శ్రీదేవి భౌతికకాయానికి నేడు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కపూర్ కుంటుంబం ప్రకటించింది. ఉదయం ఎనిమిదన్నర గంటలకు ప్రజల సందర్శనార్థం సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌కు తరలిస్తారు. ఆ తర్వాత ఒంటి గంటకు జుహూలోని పవన్ హన్స్ క్రిమిటోరియంలో అంత్యక్రియలు ప్రారంభమవుతాయి. ఇదిలా వుండగా శ్రీదేవి మరణించటం పట్ల తమ సంతాపాన్ని తెలియచేసేందుకు ప్రముఖ నటులు షారూక్‌ఖాన్, రజనీకాంత్, కమలహాసన్ తదితరులు ముంబయిలోని ఆమె మరిది, నటుడు అనిల్ కపూర్ ఇంటికి వచ్చారు. నటుడు షారూక్‌ఖాన్ తన భార్య గౌరితో కలిసి సోమవారం రాత్రి అనిల్ కపూర్ ఇంటికి వచ్చి పరామర్శించారు. వీరితో పాటు నటులు రణవీర్‌సింగ్, దీపికాపడుకునే, సమాజ్‌వాది పార్టీ నేత అమర్‌సింగ్, తదితరులు కూడా బోనీ కుటుంబాన్ని పరామర్శించారు.

శ్రీదేవిది హత్యే..!:సుబ్రమణ్యస్వామి

నటి శ్రీదేవి మరణం హత్యేనని బిజెపి నేత సుబ్రమణ్యస్వామి ఆరోపించారు. ఆమె మరణం ప్రమాదవశాత్తూ జరిగిందని, ఇందులో సంశయానికి తావులేదని ఫోరెన్సిక్ నివేదిక స్పష్టం చేయటాన్ని ఆయన తప్పుపట్టారు. నటి శ్రీదేవి ఎన్నడూ మద్యం సేవించిన దాఖలాలు లేవని, అటువంటపుడు ఆమె శరీరంలో ఆల్కహాల్ జాడలు కన్పించాయనటం ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. ఆమెతో ఎవరైనా బలవంతంగా మద్యం తాగించారా? అని ఆయన నిలదీశారు. శ్రీదేవి బసచేసిన హోటల్‌లోని సిసి ఫుటేజ్‌ను ఎందుకు విడుదల చేయరని ఆయన ప్రశ్నించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నపుడు ఆమె ప్రమాదశాత్తు మరణించడం అసత్యమన్న విషయం స్పష్టమవుతోందని, ఇది ప్రణాళికాబద్ధంగా చేసిన హత్యేనన్న సందేహం కలుగుతోందని ఆయన అన్నారు.

మోడీ సర్కారుకు తగ్గుతున్నఆదరణ

(మొదటి పేజీ తరువాయి)

అంశాలతో పాటు, ప్రజానీకం పెద్ద ఎత్తున ఇక్కట్ల పాలవుతుండటం కూడా నరేంద్ర మోడీ సర్కారుకు ప్రజల్లో ఆదరణ గణనీయంగా తగ్గడానికి కారణాలుగా ఈ సర్వే నిర్ధారించింది. ' రానున్న రోజులో ఈ సమస్యలను కొంతవరకైనా పరిష్కరించకపోతే మోడీ సర్కారు ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవటం ఖాయంగా కనిపిస్తోంది' అని సిఎస్‌డిఎస్ వ్యాఖ్యానించింది.

సమస్యల వలయంలో ప్రజానీకం

నరేంద్రమోడీ ప్రభుత్వ హయాంలో ప్రజానీకం పెద్ద ఎత్తున సమస్యల వలయంలో చిక్కుకుపోయిందని, ఏటికేడాది ఈ సమస్యలు పెరుగుతున్నాయని ఈ సర్వే నిర్ధారించింది. నోట్ల రద్దు తరువాత ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. 2017 ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధంలో ప్రజల కష్టాలు మరింత పెరిగాయని సర్వే పేర్కొనడమే దీనికి నిదర్శనం. దీనికి తోడు పెరుగుతన్న నిరుద్యోగం, నిత్యావసర వస్తులు ధరలు, జీవన ప్రమాణాలు గణనీయంగా పడిపోవడం వంటివి కూడా ప్రజల్లో అసంతృప్తికి దారి తీసింది.

ఇక్కట్లే కొలబద్ద

ప్రజానీకపు సంతృప్తి స్థాయిని కొలవడానికి వారు ఎదుర్కుంటున్న సమస్యలనే కొలబద్దగా ఈ సర్వేలో వినియోగించారు.

మింట్ మిజరీ ఇండెక్స్‌గా వ్యవహరించే ఈ విధానంలో ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదల, నిరుద్యోగం ఇతర అంశాలను ప్రామాణికంగా తీసుకుని ప్రజల అభిప్రాయాలను సేకరిస్తారు. దేశ స్థూల ఉత్పత్తి (జిడిపి)ని లెక్కగట్టే విధానం మారడంతో కొన్ని నూతన అంశాలను కూడా సర్వేలోకి తీసుకున్నారు. ఉద్యోగ కల్పనకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు, వాస్తవ పరిస్థితికి పొంతన లేకపోవడం, ఆధారపడ్డదగ్గ విశ్వసనీయ సమాచారం అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ ఉపాధి అవకాశాల స్థాయి, ప్రజల కొనుగోలు శక్తి, ఆరోగ్యం కోసం ఖర్చు పెడుతున్న మొత్తాన్ని పరిగణలోకి తీసుకున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఆహారేతర ఖర్చులకు ప్రజలు వినియోగిస్తున్న మొత్తాన్ని కొలబద్దగా తీసుకున్నారు. 0 నుండి 100 వరకూ వుండే ఈ సూచీలో 100 అన్నది ప్రజల ఇక్కట్ల గరిష్ట స్థాయిని సూచిస్తుంది. యుపిఎ -2 ప్రభుత్వంపై 2014లో 57 పాయింట్ల వద్ద ప్రజల అసంతృప్తి స్థాయి ఉండగా, తాజా సర్వేలో అది 64 పాయింట్లకు చేరుకుంది.

అసంతృప్తి ఇలా పెరిగింది.

నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలిసంవత్సరాల్లో పెద్దగా కనిపించని అసంతృప్తి 2016 నుండి పెరగడం కనిపించింది. 2017 అర్ధ సంవత్సరం తరువాత ఈ ప్రక్రియ మరింత వేగవంతమై 64 పాయింట్లకు చేరింది. ముఖ్యంగా గత ఏడాది వేసవి తరువాత మోడీ సర్కారుపై ప్రజల్లో అసంతృప్తి తీవ్ర స్థాయిలో పెరిగిన విషయాన్ని ఈ సర్వే స్పష్టం చేసింది. మంచి రోజులు తెస్తామన్న హామీ నెరవేర్చటంలో మోడీ విఫలమయ్యారన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

ప్రధాని పెదవి విప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

పాలకులు నిందిస్తున్నారని, అలాగే పిఎన్‌బి కుంభకోణానికి ఆడిటర్లు బాధ్యులంటున్నారని, కనీసం ప్యూన్లనయినా వదిలిపెట్టారు.. థాంక్స్' అని అన్నారు. 2011లో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వ హయాంలోనే ఈ కుంభకోణానికి తెరలేచిందంటూ అధికార పక్ష నేతలు చేస్తున్న వాదనను ఆయన ప్రస్తావిస్తూ , వారి ప్రభుత్వం గత నాలుగేళ్లుగా ఏం చేస్తోందన్నదే ప్రధానమైన ప్రశ్న అన్నారు. దీనిపై ఏమైనా జవాబు చెప్తారా సార్ అంటూ ఆయన జైట్లీని నిలదీశారు. ఇక్కడ ఎవరు బాధ్యులన్నది ప్రశ్న కాదని, చోరీ ఎందుకు జరిగిందే ప్రశ్న అని ఆయన అన్నారు. దొంగల గురించి తాను ఫిర్యాదు చేయటం లేదని, అయితే దీనితో ప్రభుత్వ విశ్వసనీయతే ప్రశ్నార్ధకంగా మారిందని ఆయన కవితాత్మకంగా వ్యాఖ్యానించారు.

మరో 1,300 కోట్లు పెరిగిన 'దోపిడీ'
పిఎన్‌బి కుంభకోణం అంచనా 13 వేల కోట్లు

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)లో వెలుగు చూసిన కుంభకోణం రూ.13 వేల కోట్లుగా ఆ బ్యాంకు అంచనా వేస్తోంది. ఈ కుంభకోణాన్ని మొదట్లో రూ.11,400 కోట్లుగా పిఎన్‌బి ప్రకటించిన సంగతి తెలిసిందే. దర్యాప్తు సంస్థలు ఈ కుంభకోణంపై విచారణ కొనసాగిస్తున్న నేపథ్యంలో మోసపూరిత లావాదేవీలు మరో 1,300 కోట్లు ఉంటాయని బ్యాంకు అంచనా వేసింది. దీంతో ఈ కుంభకోణం మొత్తం 13 వేల కోట్లకు పెరిగింది. దీన్ని రూ. 11,400 కోట్ల కుంభకోణంగా ప్రకటించినప్పుడే ఇది భారత బ్యాంకింగ్ రంగంలోనే అతిపెద్ద కుంభకోణంగా పేరుతెచ్చుకుంది. మోసపూరితమైన పిఎన్‌బి ఎల్‌ఓయుల ద్వారా విదేశాల్లో, ఇతర భారతీయ బ్యాంకులు నుంచి నగల వ్యాపారి నీరవ్ మోడీ, అతని సహచరులు రూ.11,400 కోట్ల రూపాయల రుణం తీసుకున్నట్లు ఈ నెల 14న గుర్తించారు. అయితే బిఎస్ఈకి గత రాత్రి దాఖలు చేసిన నివేదికలో మరో1,323 కోట్ల మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు అంచనా వేస్తున్నట్లు బ్యాంకు పేర్కొంది. పిఎన్‌బి పేరుతో తయారు చేసిన నకిలీ ఎల్‌ఓయుల ద్వారానే ఇంత భారీ కుంభకోణం జరిగింది.

హోదాతో అదనంగా వచ్చేదేమిటీ

(మొదటి పేజీ తరువాయి)

ముందుకొచ్చారన్నారు.

రోడ్లపై ఆందోళన చేస్తే పరిష్కారం కావు

రోడ్లపై ఆందోళనలు చేస్తే సమస్యలు పరిష్కారం కావని విద్యుత్ కార్మికులను ఉద్దేశించి సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించగా ఆందోళనల వల్ల సమస్యలు పరిష్కారం కావని తెలిపారు.

నాలుగు రోజుల్లో టెండర్లు

నదుల అనుసంధానానికి నాలుగు రోజుల్లో టెండర్లు పిలుస్తున్నామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. దీనివల్ల నీటిని సద్వినియోగం చేసుకోవచ్చని చెప్పారు. శ్రీకాకుళం నుండి కర్నూలు వరకూ ఇన్నోవేషన్ వ్యాలీ తయారవుతుందని చెప్పారు. ప్రజల ఆశీస్సులతోనే 40 ఏళ్లపాటు రాజకీయాల్లో ఉన్నానని తెలిపారు. విభజన సమయంలో తీవ్రంగా బాధపడ్డానని చెప్పారు.

మేఘాలయలో 67, నాగాలాండ్‌లో 75 శాతం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో 59 నియోజక వర్గాలలో మాత్రమే పోలింగ్ జరిగింది. మేఘాలయలో పటిష్టమైన బందోబస్తు మధ్య 59 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ ప్రశాతంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 3 వేలకు పైగా పోలింగ్ బూత్‌లలో దాదాపు 18 లక్షలమంది అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తూర్పు గరో పర్వత ప్రాంత జిల్లాలోని విల్లియంనగర్ నియోజక వర్గంలో అభ్యర్థి మృతి కారణంగా ఎన్నికలు వాయిదా పడ్డాయి. అక్కడ పోటీలో ఉన్న ఎన్‌సిపి అభ్యర్థి జాన్‌థనే ఎన్ సగ్మా ఈ నెల 18న జరిగిన పేలుడు సంఘటనలో మృతి చెందారు. తమ గిరిజన సాంప్రదాయ దుస్తులలో మహిళా ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద బారులుతీరి నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 106 కంపెనీల కేంద్ర బలగాలను (సిఏపిఎఫ్) మోహరించినట్లు మేఘాలయ ప్రధాన ఎన్నికల అధికారి ఎఫ్.ఆర్.ఖర్గోంగర్ తెలిపారు. వీరితో పాటు రాష్ట్ర సాయుధ బలగాలు, పోలీసులు బందోబస్తు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మొత్తం 361 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేశారు. వీరిలో 31 మంది మహిళా అభ్యర్థులు కాగా, 80 మంది స్వతంత్ర అభ్యర్థులని ఎన్నికల కమిషన్ కార్యాలయ వర్గాలు తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా మహిళల కోసం ప్రత్యేంగా 67 పోలింగ్ స్టేషన్లను, 61 మోడల్ పోలింగ్ స్టేషనన్లు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వరసగా రెండు దఫాలు అధికారంలో కొనసాగింది . కాగా ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా అమ్‌పతి, సాంగ్‌సాక్ నియోజక వర్గాల నుండి పోటీ చేశారు. ముకుల్ సంగ్మా కుటుంబ సభ్యులు మరో ముగ్గురు కూడా ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్నారు.

నాగాలాండ్‌లో ముమ్మరంగా పోలింగ్

నాగాలాండ్‌లో 59 అసెంబ్లీ స్థానాలకు మంగళవారం ఎన్నికలు జరిగాయి.ఈ ఎన్నికలకు గాను రాష్ట్ర వ్యాప్తంగా 2,156 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. కాగా నేషనలిస్టు డెమక్రటిక్ పీపుల్స్ పార్టీ (ఎన్‌డిపిపి) అధ్యక్షుడు నీఫి రియో ఉత్తర అంగామి-2 స్థానం నుండి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ నియోజక వర్గంలో ఆయనకెవరూ పోటీ లేకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. దీంతో 59 నియోజక వర్గాలలో మాత్రమే ఎన్నికలు జరిగాయి.

రాష్ట్రంలో మారుమూల నియోజకవర్గాలలో మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటింగ్ కొనసాగగా, మిగిలిన చోట్ల సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ జరిగింది. రాష్ట్ర పోలీసు బలగాలతో పాటు 281 కంపెనీ ల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు (సిఏపిఎఫ్)ను మోహ రించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యా ప్తంగా 2,156 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేవామని, వాటిల్లో 1,100 పోలింగ్ స్టేషన్లను క్లిష్టమైనవి గా గుర్తించగా, 530 పోలింగ్ బూత్‌లు సమస్యా త్మకమైనవిగాను, 526 పోలింగ్ బూత్‌లు సాధారణ మైనవిగాను గుర్తించి నట్లు నాగాలాండ్ ప్రధాన ఎన్నికల అధికారి అభిజిత్ సిన్హా తెలిపారు. అకుల్తో పోలింగ్ బూత్ వద్ద నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్), నేషనలిస్టు డెమక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీకి చెందిన కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మరణించగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘర్షణల నేపథ్యంలో పోలింగ్ ప్రక్రియకు ఎటువంటి అంతరాయం కలగలేదు. షిల్లాంగ్ మోడల్ పోలింగ్ స్టేషన్ వద్ద ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఇవిఎం) మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. పోలింగ్ నేపథ్యంలో రెండు రాష్ట్రాలలోనూ భద్రతను ముమ్మరం చేశారు. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను త్రిపుర తో కలిపి మార్చి 3న ప్రకటిస్తారు.

క్లస్టర్ మోడల్‌లోనే ఎలక్ట్రానిక్ రంగ అభివృద్ధి

- తిరుపతిలో జియో మొబైల్ తయారీ కంపెనీ
- మంత్రి నారా లోకేశ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్లస్టర్ మోడల్‌లోనే ఎలక్ట్రానిక్ తయారీ రంగ అభివృద్ధి సాధ్యమవుతుందని ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఇండియన్ ఎలక్ట్రానిక్స్ అండ్ సెమీ కండక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో నిర్వహిస్తున్న విజన్ సమ్మిట్‌లో మంగళవారం ఆయన ప్రసంగించారు. నాలుగో పారిశ్రామిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ వేదిక కాబోతోందన్నారు. చెన్నై, బెంగళూరు కారిడార్‌ను వినియోగించుకుంటూ ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని, త్వరలో తిరుపతిలో జియో మొబైల్ తయారీ కంపెనీని ప్రారంభించబోతోందని అన్నారు. అమరావతిలో అంతర్జాతీయ స్థాయి చిప్ డిజైన్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, డిజైన్, తయారీ, సరఫరాలో లీడర్‌గా ఎదిగేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. హై ఎండ్ టెక్నాలజీ పరిశోధన, అభివృద్ధికి అమరావతికి వేదిక కాబోతోందన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక అవకాశాలున్నాయని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

నమ్మించు... వంచించు...దోచేయ్...

- ఇవే చంద్రబాబు సిద్ధాంతాలు
- అంబటి రాంబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నమ్మించు..వంచించు..దోచేయడమే చంద్రబాబు నాయుడు ముఖ్య సిద్ధాంతాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆరోపించారు. తన రాజకీయ జీవితంలో నమ్మిన వారికి న్యాయం చేయాలనే మనస్తత్వం చంద్రబాబులో అస్సలు కనిపించదన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నాలుగు దశాబ్దాల చంద్రబాబు రాజకీయ జీవితంపై ఘాటుగా స్పందించారు. పదవి కోసం ఎవరినైనా ముంచు అన్నదే చంద్రబాబు తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలకు ఇచ్చిన సందేశమన్నారు. రాజకీయ జన్మనిచ్చిన ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవటం ద్వారా ఆయన మరణానికి పరోక్షంగా కారకుడయ్యారన్నారు. రెండు ఎకరాలు భూమి ఉన్న చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చాక వేలు, లక్షల కోట్లు ఆస్తులు సంపాదించారని ఆరోపిం చారు. మంత్రిగా అలాగే ముఖ్యమంత్రిగా తొమ్మిదేళ్లు, ప్రతిపక్ష నేతగా పదేళ్లు, కర్షక నేత గా, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఇంత సుదీర్ఘ కాలం రాజకీయ జీవితంలో ఉన్న ఆయన ప్రజలకు ఏం చెబుతున్నారన్నది గుర్తు చేసుకో వాల్సిన అవసరముందన్నారు. చంద్రబాబు నాయుడు తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజలకు పనికి వచ్చే ఒక్క సందేశం కూడా ఇవ్వలేదని, అయితే అధికారం కోసం ఏదైనా చేయవచ్చు అన్న సందేశం మాత్రం ఇచ్చారని ఎద్దేవా చేశారు.


రవితేజపై దర్శకుడి వివరణ



ప్రస్తుతం కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నేల టికెట్' సినిమాతో బిజీగా ఉన్నాడు రవితేజ. అయితే గత వారం రోజులుగా రవితేజ ఆరోగ్య పరిస్థితి బాలేదనే వార్తలు ఫిలింనగర్‌లో చక్కర్లు కొడుతుంది. ఇదే విషయాన్ని ట్విట్టర్‌లో అడిగిన ఫ్యాన్‌కి, అలాంటిదేం లేదని, రవితేజ ఎప్పటి లాగే ఎనర్జిటిక్‌గా ఆరోగ్యంగా ఉన్నాడని కళ్యాణ్ కృష్ణ బదులిచ్చాడు. 'టచ్ చేసి చూడు' లాంటి యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ తరవాత తెరకెక్కుతున్న రవితేజ సినిమాపై మరింత క్రేజ్ ఏర్పడింది. కళ్యాణ్ కృష్ణ మార్క్ కలర్ ఫుల్ ఫ్యామిలీ ఇమోషన్స్‌తో పాటు రవితేజ మాస్ ఇమేజ్‌కి తగ్గట్టు పవర్ ప్యాక్డ్ ఎంటర్ టైనర్‌లా తెరకెక్కుతున్న ఈ సినిమాలో మాళవిక హీరోయిన్‌గా నటిస్తుంది. రామ్ తాళ్ళూరి ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

నాని నిర్మాతగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందిన 'అ!' చిత్రం ఇటీవలే థియేటర్స్ కి వచ్చింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ లోను ఈ సినిమా మంచి వసూళ్లను సాధించింది. విభిన్నమైన సినిమాగా .. ప్రయోగాత్మక చిత్రంగా ప్రశంసలు అందుకుంది.

అగ్రహీరోలతో ఓ సినిమా



ప్రశాంత్ వర్మ

దర్శకుడిగా ప్రశాంత్ వర్మకు ఈ సినిమా మంచి గుర్తింపును తీసుకొచ్చింది. దీంతో ఆయన తదుపరి సినిమా ఏ హీరోతో ఉంటుందా అనే ఆసక్తితో అంతా వున్నారు. ఆయన మాత్రం చిరంజీవి .. బాలకృష్ణలతో ఒక మల్టీస్టారర్ చేయాలని ఉందంటూ చెప్పడం విశేషం. ఈ ఇద్దరి హీరోలకు తగిన కథ తన దగ్గర ఉందనీ .. వాళ్లిద్దరిని ఒకే ఫ్రేమ్‌లో చూపించాలని ఉందని ఇటీవలే వెల్లడించారు. గతంలో కొంతమంది దర్శకులు చిరంజీవి .. బాలకష్ణల కాంబినేషన్లో సినిమా చేయాలని ప్రయత్నించి విఫలమయ్యారు. అలాంటిది ప్రశాంత్ వర్మ ఈ విషయంలో ఎంతవరకూ సక్సెస్ అవుతాడో చూడాలి మరి.

'నర్తనశాల'లో నాగశౌర్య

'ఛలో' సినిమాతో విజయాన్ని సొంతం చేసుకున్న నాగశౌర్య .. ప్రస్తుతం 'అమ్మమ్మగారిల్లు' సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాలో కథానాయికగా షామిలి నటిస్తోంది. ఈ సినిమా తరువాత నాగశౌర్య 'నర్తనశాల' అనే సినిమా చేయనున్నట్టు కొన్ని రోజుల క్రితమే వార్తలు వచ్చాయి. నాగశౌర్య సొంత బ్యానర్లోనే ఈ సినిమా నిర్మితం కానుంది. గతంలో క ష్ణవంశీ దగ్గర దర్శకత్వశాఖలో పనిచేసిన శ్రీనివాస్, ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కానున్నాడు. మాస్ ఎంటర్టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమా ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుపుకుంటోంది. మే నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనుంది. కథానాయికతో పాటు ఇతర నటీనటులు ఎవరనే వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు.



నాగశౌర్య ..

'ఆఫీసర్' ఫస్ట్‌లుక్



నాగార్జునతో నిర్మిస్తోన్న చిత్రం ముంబైలో జరుగుతోంది. గత ఏడాది నవంబర్ 20వ తేదీన అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ సినిమాకు 'ఆఫీసర్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల 25న ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేద్దామని వర్మ, నాగార్జున మొదట్లో అనుకున్నారు. కాని శ్రీదేవి ఆకస్మిక మరణంతో టైటిల్ ప్రకటనను వాయిదా వేశారు. సినీ వర్గాల సమాచారం మేరకు ఈ సినిమాను మే 25న విడుదల చెయ్యనున్నట్లు మంగళవారంనాడు ప్రకటించారు. పోలీస్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో మైరా సరీన్ అనే కొత్త అమ్మాయి నాగార్జున సరసన నటిస్తోంది.

ప్రశంసలు పొందుతున్న 'రాజరథం'



ట్రైలర్ విడుదల అయినప్పటి నుండి ఆకట్టుకుంటున్న 'రాజరథం' ఇప్పుడు ఆ చిత్రానికి పని చేస్తున్న టెక్నిషియన్స్ గురించే ఇండస్ట్రీ పెద్దలు మాట్లాడుకోవడం విశేషం. ఈ చిత్రానికి 'సౌండ్' విభాగాన్ని పర్యవేక్షిస్తున్న రాజా కష్ణన్ దేశంలోనే పేరొందిన టాప్ సౌండ్ మిక్సర్స్‌లో ఒకరు. 'ప్రేమమ్', 'బెంగుళూరు డేస్', 'విక్రమ్ వేద', 'అర్జున్ రెడ్డి', 'అ..ఆ..', 'నా పేరు సూర్య' వంటి చిత్రాలకి ఈయన పని చేశారు. ఆయన ఈ చిత్రానికి మిక్సింగ్ చేస్తున్నప్పుడు దర్శకుడు అనూప్ చిత్రాన్ని సాంకేతికంగా అత్యున్నతంగా తీర్చిదిద్దిన విధానం చూసి రాజా కష్ణన్ మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నారు. ఆయనే ఈ చిత్రానికి 'డాల్బీ అట్మాస్' అవసరం అని, దాని వల్ల ప్రేక్షకులకి మరింత అనుభూతిని అందిచగలమని టీంని ప్రోత్సహించారు. ఈ చిత్రానికి సంబంధించిన 'సౌండ్' విషయంలో ఆయన స్పెషల్ కేర్ తీసుకుని చేస్తున్నారని నిర్మాత తెలియజేస్తున్నారు. 'బాహుబలి', 'ఈగ', 'దృశ్యం', 'రంగితరంగా' వంటి చిత్రాలకి పని చేసిన 'కలరిస్ట్' శివ కుమార్ 'రాజరథం'కి పని చేయడం ఒక గొప్ప అనుభవంగా చెప్తున్నారు. దర్శకుడు అనూప్‌తో ఎన్నో చర్చలు, ఎంతో సమయం గడిపిన శివ కుమార్ స్క్రిప్ట్‌కి తగ్గట్టు ఆకట్టుకునే కలర్ పాల్లేట్స్‌ని ఈ సినిమా కోసం వాడారు. 'రాజరథం' విడుదల అయ్యాక ఈ కలర్ పాల్లేట్స్‌ని మరిన్ని సినిమాల్లో చూస్తారని అన్నారాయన.

నిరూప్ భండారి, అవంతిక శెట్టి, ఆర్య, రవిశంకర్, రానా దగ్గుబాటి వాయిస్‌తో ఉన్న 'రాజరథం' ఆకట్టుకునే స్క్రీన్ ప్లేతో అత్యున్నత ప్రమాణాలతో ఉండబోతోంది. దర్శకుడు అనూప్ భండారి మరో సారి తెర మీద తన మేజిక్ చూపించబోతున్నారు. నిర్మాణంలో తమ తొలి ప్రయత్నంగా 'జాలీ హిట్స్' నిర్మించిన 'రాజరథం' ప్రపంచవ్యాప్తంగా మార్చ్ 23 న విడుదల కాబోతోంది.



రెండో షెడ్యూల్లో సూర్య చిత్రం

హీరో సూర్య ప్రస్తుతం తన 36వ సినిమాను ప్రముఖ దర్శకుడు సెల్వ రాఘవన్ దర్శకత్వంలో చేస్తున్నారు. కొద్దీ రోజుల్ క్రితమే షూటింగ్ మొదలుపెట్టుకున్న ఈ సినిమా మొదటి షెడ్యూల్ పూర్తిచేసుకుని 2వ షెడ్యూల్ ను జరుపుకుంటోంది. ఈ షెడ్యూల్ కోసం చెన్నైలో భారీ సెట్‌ను కూడా వేశారు. ప్రేక్షకుల్లో మంచి అంచనాల్ని క్రియేట్ చేసిన ఈ సినిమా యొక్క ఫస్ట్ లుక్‌ను మార్చి 5వ తేదీన రిలీజ్ చేయనున్నారు. ఇందులో సూర్యకు జోడీగా రకుల్ ప్రీత్ సింగ్, సాయి పల్లవిలు నటిస్తున్నారు. దీపావళికి విడుదలకానున్న ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందిస్తుండగా ఎస్.ఆర్.ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

ప్రతి ఏడాది వేసవిలో అగ్రహీరోల చిత్రాలు ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేయనున్నాయి. అయితే ఈసారి కాస్త భిన్నమైన పరిస్థితి ఏర్పడింది. మార్చి 2వ తేదీనుంచి థియేటర్లు బంద్ కచ్చితమంటూ ఛాంబర్ ప్రకటించడంతో ఎన్నిరోజులు అలా జరుగుతుందో తెలీదు. కానీ అనుకున్న షెడ్యూల్ ప్రకారం కొత్త సినిమాలు వేసవిలో విడుదలకు రంగం మాత్రం సిద్ధం చేస్తున్నాయి. మార్చి 30 నుంచి మే రెండో వారం వరకు ఏ వీకెండ్ ఖాళీ లేదు. అన్నీ దాదాపు రిలీజ్ డేట్స్ ఫిక్స్ చేసుకున్నాయి. థియేటర్లతో అగ్రిమెంట్లు కుదుర్చుకునే పనిలో ఉన్నాయి. ఈ వేసవికి టాలీవుడ్‌లో రసవత్తరమైన పోరు సాగనుంది. వారానికో సినిమా వస్తోంది.

వేసవిలో పసందు చేయనున్న తారలు



మార్చి 30 రంగస్థలం

రామ్ చరణ్, సుకుమార్ కాంబినేషన్ లో రాబోతున్న రంగస్థలం సినిమా నుంచి సమ్మర్ ఫీవర్ షురూ అవుతుంది. ఈ మూవీపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. సమంత హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా 1980ల నాటి కథతో తెరకెక్కింది. దేవిశ్రీప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందించాడు. 1980నాటి కాల పరిస్థితులు, అప్పటి వాతావరణానికి తగినట్లు సెట్లు, సంభాషణలు, వస్త్రధారణ వంటి అనేక అంశాలను గుదిగుచ్చి ఈ చిత్రం రాబోతుంది. ఇందులో హీరో హీరోయిన్లు భిన్నమైన పాత్రల్ని పోషిస్తున్నారు. సుకుమార్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

'భరత్ అనే నేను' ఏప్రిల్ 20

మహేష్ నటిస్తున్న తాజా చిత్రం భరత్ అనే నేను. 'శ్రీమంతుడు' లాంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత మహేష్, కొరటాల కాంబోలో వస్తున్న సినిమా కావడంతో భరత్ అనే నేనుపై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాతో కైరా అద్వానీ హీరోయిన్ గా పరిచయం అవుతోంది. మూవీకి సంబంధించి త్వరలోనే ఫారిన్ షెడ్యూల్ ప్రారంభమౌతుంది. రాజకీయ నేపథ్యంలో కూడిన చిత్రంగా చిత్ర యూనిట్ ప్రచారం చేస్తోంది. మహేష్‌ను అభిమానులు ఏవిధంగా చూడాలని కోరుకుంటారో ఆ విధంగా ఈ చిత్రముంటుందని దర్శకుడు తెలియజేస్తున్నారు.



'పంతం' మే 18

విజయం కోసం పరితపిస్తున్న గోపీచంద్ చేస్తున్న చిత్రమిది. తన కెరీర్‌లో ప్రతిష్టాత్మక 25వ చిత్రమిది. కొత్త దర్శకుడు చక్రవర్తి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో గోపీచంద్ సరసన మెహ్రీన్ హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై రాధామోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా శరవేగంగా షూటింగ్ పూర్తిచేసుకుంటోంది. గోపీసుందర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు.



తన చిత్రాల్లో ఏదో ఒక సామాజిక అంశాన్ని టచ్ చేస్తున్నట్లు ఇందులోనూ చక్కటి అంశం వుంటుందని అది అందరినీ ఆలోజింపజేస్తుందని నమ్మకంగా చెబుతున్నారు.

'కృష్ణార్జున యుద్ధం' ఏప్రిల్ 12

వరుస విజయాలతో దూసుకుపోతున్న నాని, ఈ సమ్మర్‌లో కూడా మరో సినిమా రిలీజ్ చేయబోతున్నాడు. సహజ నటుడిగా పేరుపొందిన ఆయన ఇందులో ద్విపాత్రిభనయం చేస్తున్నాడు. మేర్లపాక గాంధీ దర్శకత్వం చేసిన ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, రుక్సార్ మిర్ హీరోయిన్లుగా నటించారు. హిపాప్ తమీజా ఈ సినిమాకు సంగీతం అందించాడు. కృష్ణుడు అర్జునుడు రెండు పాత్రలు ఎలా వుంటాయనేవి చిత్రంలోని ఆసక్తికర అంశమనీ, భారతంలో వున్న వారి పేర్లకు అనుగుణంగా ఇప్పటి ట్రెండ్‌కు తగినట్లు చిత్ర వుంటుందని తెలుస్తోంది.

'సాక్ష్యం' మే 11

బెల్లంకొండ సాయిశ్రీనివాస్, బ్యూటిఫుల్ పూజా హెగ్డే హీరోహీరోయిన్లుగా నటిస్తున్న సాక్ష్యం సినిమా కూడా సమ్మర్ కానుకగా ముస్తాబవుతోంది. శ్రీవాస్ డైరక్ట్ చేస్తున్న ఈ సినిమా కంప్లీట్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కుతోంది. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మాత అభిషేక్ నామా ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. ప్రకృతి, మానవుడుకి గల సంబంధాన్ని కంపేర్ చేస్తూ ఈచిత్ర కథ వుంటుందని దర్శకుడు తెలియజేస్తున్నాడు.

'ఛల్ మోహన్ రంగ' ఏప్రిల్ 5

నితిన్, మేఘా ఆకాష్ హీరోహీరోయిన్లుగా నటించిన సినిమా ఇది. కష్ణచైతన్య డైరక్ట్ చేసిన ఈ సినిమాకు త్రివిక్రమ్ కథ అందించాడు. పవన్, త్రివిక్రమ్, నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి కలిసి ఈ సినిమా నిర్మించారు. తమన్ సంగీతం అందించిన ఈ సినిమా పాటల్ని దశలవారీగా విడుదల చేస్తున్నారు. ఈ వేసవికి పెర్ ఫెక్ట్ రొమాంటిక్ మూవీగా ఇది పేరు తెచ్చుకుంది. నితిన్ ఇంతకుముందు చేసిన గుండెజారి గల్లంతయిందే తరహాలోనే చక్కటి ఎంటర్ టైన్‌మెంట్‌తో కూడిన ప్రేమకథగా వుంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ప్రేమకథతో పాటు ఫ్యామిలీ సెంటి మెంట్‌తో మిళితమైన కథగా చెబుతున్నారు.

'నా పేరు సూర్య' మే 4

ఇటీవలే అగ్ర నిర్మాతలు తమ చిత్రాన్ని అగ్రహీరోల కోసం మార్చుకున్న చిత్రం ఇది. అల్లు అర్జున్ నటిస్తున్న సినిమా ఇది. వక్కంతం వంశీ డైరక్టర్‌గా పరిచయమౌతున్న ఈ సినిమాలో అను ఎమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటిస్తోంది. కంప్లీట్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా రాబోతోంది. ఈ సమ్మర్ బరిలో పూర్తిస్థాయి యాక్షన్ చిత్రం ఇదే. విశాల్, శేఖర్ అందించిన సంగీతం ఈ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది. దేశభక్తిని కల్గించే ఈ చిత్రంలో సోల్జర్ పాత్రలో అర్జున్ కన్పించనున్నాడు. సరైనోడులో ఓ పాట ద్వారా సైనికుడిగా కన్పించిన అల్లు అర్జున్ ఈ చిత్రంలో మరింత ఆకట్టుకుంటాడని తెలుస్తోంది.







ఏప్రిల్ 27 'కాలా'


సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన సినిమా 'కాలా'. ఈ మూవీని ఏప్రిల్ 27న ఒకేసారి తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయబోతున్నారు. పా రంజిత్ డైరక్ట్ చేసిన ఈ సినిమాకు రజనీ అల్లుడు ధనుష్ నిర్మాత. తెలుగులో ఈ సినిమాను ఎన్వీ ప్రసాద్ రిలీజ్ చేస్తున్నారు. కాగా, రోబో2 చిత్రం ముందు రావాల్సి వుంది. కానీ అందుకు సాంకేతికత వల్ల కాస్త జాప్యం జరుగుతుంది. అందుకే కాలా చిత్రం రాబోతుంది. ఈ చిత్రం మాఫియా నేపథ్యంలో సాగుతూ సెంటిమెంట్‌ను టచ్ చేస్తుందని తెలుస్తోంది.





మరోసారి శ్రియ పెళ్లి ప్రస్తావన

ప్రముఖ నటి శ్రియ శరణ్ త్వరలో పెళ్లి చేసుకోనున్నట్టు తెలుస్తోంది. రష్యన్ క్రీడాకారుడు, వ్యాపారవేత్త అయిన ఆండ్రికోచివ్‌ని శ్రియ వివాహమాడుతుందని సమాచారం. రాజస్థాన్‌లోని ఉదయ్ పూర్ లో శ్రియ-ఆండ్రికోచివ్ పెళ్లి ఘనంగా జరగనుందని, మూడు రోజుల పాటు ఈ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. మార్చి 17,18, 19 తేదీల్లో ఈ వేడుకను నిర్వహించనున్నట్టు ఫిల్మ్ నగర్ సమాచారం. ఇదిలా ఉంచితే, ఇటీవల తన పెళ్లి గురించి వచ్చిన వార్తలను శ్రియా ఖండించిన విషయం తెలిసిందే. ఇటీవల షాపింగ్ చేసిన విషయమై శ్రియను ప్రశ్నించగా, తన స్నేహితురాలి వివాహం ఉండటంతో షాపింగ్ చేశామే తప్ప, తన పెళ్లి కోసం కాదని చెప్పింది. అయితే, శ్రియా పెళ్లి రష్యా యువకుడితో జరుగుతుందంటూ సామాజిక మాధ్యమాల్లో మళ్లీ జోరుగా ప్రచారం జరుగుతోంది. తాజా వార్తలపై శ్రియ ఇంతవరకు ఎటువంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.



ప్రశ్న: ఈ నెల 28వ తేదీని జాతీయ సైన్సు దినోత్సవంగా జరుపుకుంటాం. ఈ దినోత్సవానికి ఉన్న విశిష్టత ఏమిటి?

సైన్సు దినోత్సవ విశిష్టత!

జవాబు : ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీని జాతీయ సైన్సు దినోత్సవంగా జరుపుకుంటున్నాము. ఈ వరవడి 1986వ సంవత్సరం నుండి ప్రారంభమైంది. దేశంలో వర్తమాన శాస్త్ర సాంకేతిక ప్రగతిని సమీక్షించుకోవడం, భవిష్యత్తులో ప్రతిభా రంగాలను గుర్తించి ప్రోత్సహించడం, దేశం యావత్తు, ఆ రోజును ఓ పండుగలా జరుపుకోవడం జాతీయ సైన్సు దినోత్సవ ప్రధాన లక్ష్యాలు. ప్రతి సంవత్సరం ఏదో ఒక ప్రత్యేక అంశం మీద ఆ రోజు నుంచి మరుసటి జాతీయ సైన్సు దినోత్సవం వరకు కార్యక్రమాలను నిర్వహించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం కూడా జాతీయ సైన్సు దినోత్సవ సంబరాల్లో అంతర్భాగం. 2018 సంవత్సరపు జాతీయ సైన్సు దినోత్సవ ప్రత్యేక అంశం: 'సమతులానాభివృద్ధి – భవిత కొరకై శాస్త్ర సాంకేతిక రంగాలు' (Science and Technology for Sustainable Future). 2017 సంవత్సరపు అంశం : ప్రత్యేక దివ్యాంగులకై శాస్త్ర సాంకేతిక రంగాలు (Science and Technology for Specially Abled Persons) సాధారణ శారీరక అంగ నిర్మాణం లేనందు వల్ల ప్రత్యామ్నాయాంగిక పద్ధతుల్లో జీవన కార్యక్రమాల్ని నిర్వర్తించుకొనేలా శారీరక అంగ వైకల్యం ఉన్న వారికి శాస్త్ర సాంకేతిక రంగాలు సహకరించేలా సాధనాలు ఉత్పత్తి చేయాలన్న ఆకాంక్షతో 2017 సంవత్సరపు లక్ష్యం ఉద్దేశించబడింది. పర్యావరణానికి, జీవావరణానికి శక్తి వనరుల వినియోగానికి గడ్డు కష్టాలు లేకుండా భవిష్యత్తరాల కోసం భూగోళాన్ని సమతులన పద్ధతిలో బదలాయించడం వర్తమాన తరపు కర్తవ్యమన్న భావన ఆధారంగా ఈ సంవత్సరపు నినాదం ఏర్పడింది.

ఫిబ్రవరి 28వ తేదీనే జాతీయ సైన్సు దినోత్సవాన్ని జరుపుకోవడానికి ప్రత్యేక కారణం ఉంది. రామన్ ఫలితం (Raman Effect) గురించి భారతీయులందరూ వినే ఉంటారు. ఫిబ్రవరి 28,



1928 సంవత్సరం నాడు సర్ సి.వి.రామన్ తన Phd శిష్యుడయిన క్రిష్ణన్‌తో కలిసి ఎఫెక్ట్‌ను ఆవిష్కరించారు. ఓ నూతన కాంతి (A New kind of Radiation) అనే పతాక శీర్షికతో Nature (ప్రపంచ ప్రసిద్ధ పరిశోధనా పత్రాలను ప్రచురించే పత్రిక (Journal) లో రామన్ ప్రచురించాడు. రెండేళ్ల తిరక్కుండానే 1930 సంవత్సరంలో సి.వి.రామన్‌కు భౌతిక శాస్త్ర నోబెల్ బహుమతిని బహూకరించారు. ఆ రోజు నుంచి నేటి వరకు సుమారు 90 సంవత్సరాలు గడిచినా భారతదేశానికి శాస్త్ర రంగాల్లో మరో నోబెల్ బహుమతి రాకపోవడం విచారించదగ్గ విషయం. అది ప్రస్తుతం అప్రస్తుతం.

అంతర్జాతీయంగా భారతదేశ శాస్త్రాభివృద్ధిని శిఖరాగ్రాన నిలిపిన రామన్ ఫలితం ఆవిష్కరణ జరిగిన రోజయిన ఫిబ్రవరి 28 ని ప్రేరణ సూచనగా 1986 ఫిబ్రవరి 28 నుంచి జాతీయ సైన్సు దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. అదే రోజు 1988 సంవత్సరం ఫిబ్రవరి 28 నాడు జనవిజ్ఞాన వేదిక రూపు దిద్దుకొంది. విజయవాడ నడిబొడ్డున వున్న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జనవిజ్ఞాన వేదిక ఆవిర్భవించింది. అప్పటి నుంచి నేటి వరకు ప్రజల్లో శాస్త్ర ప్రచారం చేస్తూ సామాన్య ప్రజానీకంలోను, విద్యార్థుల్లోను శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించడానికి జన విజ్ఞాన వేదిక అవిరాళ కృషి చేస్తూ నేడు రెండు తెలుగు రాష్ట్రాలోని ప్రతి జిల్లాలోను కమిటీలను ఏర్పర్చుకొని సైన్సు ప్రచారానికి అంకితమయి కృషి చేస్తోంది. ఈ ఫిబ్రవరి 28 నుంచి రాబోయే ఫిబ్రవరి 28 వరకు 30 సంవత్సరాలు పూర్తయినందున సూచికగా వైవిధ్యభరితమైన కార్యక్రమాలను చేపడుతోంది.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు,
చెకుముకి, జనవిజ్ఞాన వేదిక.
email:
allikayala@gmail.com

@50 కోట్లు!

దేశంలో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 2018 జూన్ నాటికి 50కోట్ల (500 మిలియన్ల) మార్క్‌ను అధిగమిస్తుందని ఓ సర్వే తెలిపింది. 170 నగరాల్లో, 750 గ్రామాలలో నిర్వహించిన ఉమ్మడి సర్వే తర్వాత ఈ నివేదికను విడుదల చేశారు. ముఖ్యంగా సర్వే నిర్వహించిన ఈ 170 నగరాల్లో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా నగరాలు అగ్రస్థానంలో ఉండగా, ఫతేపూర్, జగదల్పూర్, ఇంఫాల్ ఆఖరి స్థానంలో ఉన్నాయి. మొత్తం తొమ్మిది నగరాల్లో 35 శాతం మంది పట్టణ ఇంటర్నెట్ వినియోగదారులు నమోదయ్యారు. అయితే చిన్నపాటి మెట్రో నగరాలు, నాన్ మెట్రో నగరాల్లో జాతీయ సగటు కన్నా ఇంటర్నెట్ వ్యాప్తి తక్కువగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. 'ఇంటర్నెట్ ఇన్ ఇండియా 2017' అనే అంశంపై ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ), కంతర్ ఐఎంఆర్‌బీ ఈ రిపోర్టును విడుదల చేసింది. 2017 డిసెంబరు నాటికి మొత్తం జనాభాలో 35 శాతం మంది ఇంటర్నెట్ వినియోగదారులుగా ఉన్నారని నివేదించింది. మొత్తం దేశీయ ఇంటర్నెట్ వినియోగదార్లలో విద్యార్థులు, యువత వాటా దాదాపు 60% ఉంది. ప్రతి రోజూ ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్న వారి సంఖ్య 18.29 కోట్లుగా ఉండొచ్చని అంచనా. పట్టణ ప్రాంతాల్లోని ఇంటర్నెట్ వినియోగదార్ల సంఖ్య 2017 డిసెంబర్ నాటికి వార్షిక ప్రాతిపదికన 29.5 కోట్లకు, గ్రామీణ ప్రాంతాల్లో వీరి సంఖ్య 18.6 కోట్లకు పెరిగి ఉండొచ్చని ఆ సర్వే అంచనా వేసింది.



వడివడిగా 5జీ వైపు..!

2జి, 3జీ శకం ముగిసిపోయి... 4జీ వైపు పరుగులు పెడుతోంది. 4జీ శకం అన్నిచోట్లా పూర్తిగా అందుబాటులోకి రాకుండానే ముగిసిపోయి 5జీ వైపు వడివడిగా అడుగులు పడుతున్నాయి. మన జీవన విధానాన్ని మార్చేయగలిగే శక్తిసామర్థ్యాలు 5జీకి ఉన్నాయి. 2019లో 5జీ స్మార్ట్‌ఫోన్లు మార్కెట్‌లోకి ప్రవేశించనున్నట్టు తెలుస్తోంది. క్వాల్‌కామ్, ఇంటెల్ రెండూ కూడా కొన్ని నెలల నుంచి దీనిపై ట్రయల్స్ నిర్వహిస్తున్నాయని, ఈ ఏడాది చివరకు లేదా 2019 ప్రారంభంలో 5జీ కేపబుల్ తొలి స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి రానున్నట్టు పలు రిపోర్టులు తెలియజేస్తున్నాయి. ఈ క్రమంలో టెలికం దిగ్గజ కంపెనీ ఎయిర్‌టెల్, చైనాకు చెందిన నెట్‌వర్కింగ్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ ఉపకరణాల తయారీ సంస్థ హువావే తాజాగా భారత్‌లో తొలిసారి 5జీ నెట్‌వర్క్ ట్రయల్స్‌ను నిర్వహించాయి. ఇందులో 3 గిగాబైట్ పర్ సెకన్ (జీబీపీఎస్)కు పైగా డేటా స్పీడ్‌ను సాధించినట్లు ఈ కంపెనీలు ప్రకటించాయి. గురుగావ్‌లోని మానేసర్ వద్ద ఉన్న ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో ఈ ట్రయల్స్ జరిగాయి.



ఎండబ్ల్యూసీ వేదికగా మరో అద్భుతం!

బార్సిలోనాలో జరుగుతున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ (ఎండబ్ల్యూసీ)– 2018లో కొత్త కొత్త వింతలు, దిమ్మతిరిగే టెక్నాలజీతో కంపెనీలు వినియోగదార్లను అలరిస్తున్నాయి. కొత్త కొత్త గాడ్జెట్లను, మొబైల్స్ ను ప్రపంచానికి పరిచయం చేస్తూ ఎండబ్ల్యూసీ ముందుకు దూసుకువెళుతోంది. ఇప్పటి వరకు వచ్చిన స్మార్ట్‌ఫోన్లలో బ్యాటరీ ఎంత ఉంటుంది అంటే?– ఠక్కున 3000 ఎంఏహెచ్ లేదా 4000 ఎంఏహెచ్ అని చెబుతుంటాం. ఈ మధ్యన కంపెనీలు 5000 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యంతో కూడా స్మార్ట్‌ఫోన్లను లాంచ్ చేయడం చూస్తున్నాం. షియోమీ తాజాగా లాంచ్ చేసిన ఎంఐ మ్యాక్స్2లో 5,300 ఎంఏహెచ్ బ్యాటరీని ఉపయోగించారు. అయితే... ఎండబ్ల్యూసీ వేదికగా ఇప్పుడు మరో అద్భుతం చోటు చేసుకుంది. దాదాపు 16000 ఎంఏహెచ్ బ్యాటరీతో ప్రపంచపు తొలి స్మార్ట్‌ఫోన్‌ను ఎలక్ట్రిక్ దిగ్గజం ఎనర్జిజర్ లైసెన్సు బ్రాండు అవెనిర్ మొబైల్స్ ఆవిష్కరించింది. ఈ ఈవెంట్లో ఎనర్జైజర్ పవర్ మ్యాక్స్ పీ16కే ప్రొ, ఎనర్జిజర్ పవర్ మ్యాక్స్ పీ490ఎస్, ఎనర్జిజర్ హార్డ్‌కేస్ హెచ్590ఎస్ అనే పేర్లతో మూడు రకాల ఫోన్లను కంపెనీ ఆవిష్కరించింది. వీటిలో ఎనర్జైజర్ పవర్ మ్యాక్స్ పీ16కే ప్రొ స్మార్ట్‌ఫోన్‌కు 16000 ఎంఏహెచ్ బ్యాటరీతో దూసుకొచ్చి వినియోగదార్లను షాక్ కు గురిచేసింది. ఈ స్థాయి బ్యాటరీతో వచ్చిన ప్రపంచంలోనే తొలి స్మార్ట్‌ఫోన్ కూడా ఇదే కావడం విశేషం. ఈ స్మార్ట్‌ఫోన్‌ను త్వరలోనే భారత్‌లో కూడా ఆవిష్కరించనున్నట్లు తెలుస్తోంది.

ఎనర్జైజర్ పవర్ మ్యాక్స్ పీ16కే ప్రొ పూర్తి ఫీచర్ల విషయానికొస్తే... ఆండ్రాయిడ్ 8.0 ఓరియా, 5.99 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ ఐపీఎస్ ఎల్‌సీడీ డిస్‌ప్లే, 2160×1080 పిక్సెల్ రిజల్యూషన్, ఆక్టా–కోర్ మీడియాటెక్ హిలియో పీ25 ఎస్ఓసీ, 6జీబీ ర్యామ్, 128 జీబీ ఇన్‌బిల్ట్ స్టోరేజ్, 16 ఎంపీ, 13 ఎంపీతో డ్యూయల్ రియర్ కెమెరా, 13 ఎంపీ, 5 ఎంపీతో డ్యూయల్ ఫ్రంట్ కెమెరా, ఫింగర్‌ప్రింట్ సెన్సార్‌తో వస్తోన్న ఈ స్టార్ట్‌ఫోన్ బరువు 350 గ్రాములు.



దేశీయ స్మార్ట్‌ఫోన్ లావా జెడ్50

స్మార్ట్‌ఫోన్ల తయారీలో దేశీయంగా ముందంజలో వున్న లావా తన తొలి ఆండ్రాయిడ్ ఓరియో గో 4జీ స్మార్ట్‌ఫోన్‌ను లావా జెడ్ 50 పేరుతో మంగళవారం విడుదల చేసింది. బడ్జెట్ ధరలో ఎంట్రీ లెవల్‌లో 1జీబీ ర్యామ్ డివైస్‌లకుద్దేశించిన కొత్త ఆండ్రాయిడ్ ఓరియో ఆపరేటింగ్ సిస్టం (గో ఎడిషన్) మొట్టమొదటి స్మార్ట్‌ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ధర రూ.5వేలు. మిగతా ఫీచర్ల విషయానికొస్తే... 4.5 అంగుళాల డిస్‌ప్లే, 2.5డీ కార్నింగ్ గొరిల్లా గ్లాస్, ఆండ్రాయిడ్ ఓరియో గో, 1.1 గిగాహెర్ట్జ్ క్వాడ్ కోర్, 1 జీబీ ర్యామ్, 8 జీబి ఇంటర్నల్ స్టోరేజ్, 5 ఎంపీ రియర్ కెమెరా, 5 ఎంపీ సెల్ఫీ కెమెరా విత్ ఫ్లాష్ తో ఆకర్షణీయంగా వుంది.





జోక్ :

తండ్రి : పరీక్షలు ఎలా రాశావురా రవీ!
రవి : చాలా బాగా రాశాను. 100కి 100 వస్తాయి.
తండ్రి : నేను నమ్మనురా
రవి : నువ్వు నమ్మవనే ఆన్సర్ షీటూ పట్టుకొచ్చాను. కావాలంటే చూడు!

పొడుపు కథ

దేశానికి పెట్టని కోటలు
గంగానది పుట్టినిల్లు
ఎత్తయిన శిఖర కేంద్రాలు
మంచు పర్వత శ్రేణులు?

జవాబు : హిమాలయాలు

చుక్కలు కలపండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోని బొమ్మకు చుక్కలు కలిపి రంగులు వేయండి!

సూర్యుని సైజు మారుతుందా?



పిల్లలూ..! మీరు సూర్యుడిని రోజూ చూస్తూ ఉంటారు కదా! కానీ మీరు ఎప్పుడైనా ఈ విషయాన్ని గమనించారా! సూర్యుడు ఒక్కోపూట ఒక్కో సైజులో కనబడతాడు. నిజానికి భూమి కంటే సూర్యుడు కొన్ని రెట్లు పెద్దదయినప్పటికీ.. భూమికి దూరంగా ఉండడంవల్ల చిన్నగా కనబడుతుందని మనకు తెలుసు. సూర్యుడు భూమి కంటే సుమారు 15 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్నాడు. ఉదయాన్నే ఉదయించే సూర్యుడ్ని మనం చూడగలం. కానీ మిట్టమధ్యాహ్న సమయంలో ఉండే



సూర్యుణ్ణి మనం చూడలేం. నిజానికి మిగతా సమయంలోకంటే ఆ సమయంలోనే భూమికి ఆరువేల కిలోమీటర్లు దగ్గరకు వస్తాడట. ఈ లెక్కన మధ్యాహ్న సమయంలో సూర్యుడు మిగతా సమయాలకంటే పెద్దగా కనిపించాలి. కానీ చిన్నగా కనిపిస్తాడు. ఉదయం, సాయంత్రవేళల్లో సూర్యుడు పెద్దగా కనిపిస్తాడు. కారణం ఆ సమయాల్లో ప్రకాశంవల్ల మనకు కలిగే భ్రమ. దీనినే ఆప్టికల్ ఇల్యూషన్ అంటారు. పిల్లలూ మీరు ఎప్పుడైనా సూర్యుడిని సూర్యోదయం, మధ్యాహ్నం, అస్తమయం సమయాల్లో ఫోటోతీసి చూడండి. ఫోటోలో మూడు సమయాల్లో ఆకారపు కొలతలో తేడా ఏమి ఉండదు. అసలు సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో సూర్యుడు పెద్దగా ఉంటాడని మనకు భ్రమ కలగడానికి కారణం లేకపోలేదు. ఆ సమయంలో మనం సూర్యుడిని బాగా చూడగలం. కాబట్టి భూమి మీద దొరికే ఏదోఒక వస్తువుతో పోల్చి ఆసమయంలో సూర్యుని సైజును అంచనా వేస్తాం. సూర్యుడు నడినెత్తిన ఉన్నప్పుడు మనం సూర్యుని చూడటానికి ఇబ్బంది పడతాం. ఆ కారణం చేత మనం ఆ సమయంలో ఇతర వస్తువులతో సూర్యుడిని పోల్చలేం. నిజానికి సూర్యుని ఆకారం ఎప్పుడూ ఒకేలా ఉంటుంది. ★



నేను గీసిన బొమ్మ



పి. రిషిత శ్రీ,
4వ తరగతి,
క్రాంతి ఇంగ్లీషు మీడియం స్కూల్,
పాయకాపురం.



పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

టైగా ముగిసిన ఆంధ్రా-కర్నాటక మ్యాచ్



వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో తలపడుతున్న ఆంధ్రా-కర్నాటక జట్లు

ప్రజాశక్తి -కడప

కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో మంగళవారం అండర్-25 దక్షిణభారత అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఆంధ్రా-కర్నాటక జట్ల మధ్య జరిగిన ప్రారంభ మ్యాచ్ టైగా ముగిసింది. రెండు జట్లకు చెరో రెండు పాయింట్లు దక్కాయి. టాస్ గెలిచిన కర్నాటక ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్రా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. ఆంధ్రా జట్టులోని ఆకాష్‌యాదవ్ 67(79), కె.శ్రీకాంత్ 50(81), ధీరజ్‌కుమార్ 25(20) పరుగులు చేశారు. కర్నాటక జట్టులోని షిమన్‌లోయిస్ 3(43) వికెట్లు, శివం మిశ్ర, కౌశిక్ చెరో వికెట్ తీసుకున్నారు. అనంతరం 244 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నాటక జట్టు 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ టైగా ముగిసింది కర్నాటక జట్టులోని శివం మిశ్ర 85(103), భావేష్ 32(53), శివరాజ్ 27(25) పరుగులు చేశారు. ఆంధ్రా జట్టులోని వర్మ 3(52), వినయ్‌కుమార్ 2(37), వినోద్ నాయుడు 2(44) వికెట్లు తీసుకున్నారు. ండో మ్యాచ్‌లో గోవాపై కేరళ జట్టు 22 పరుగుల తేడాతో విజయం సాధించింది. విజయం సాధించిన కేరళ జట్టుకు 4 పాయింట్లు దక్కాయి.

గోవాపై కేరళ విజయం

కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో కేరళ-గోవా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కేరళ జట్టు 47.2 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని ఆశిష్ మాథ్యూ 64(70), బాసిల్ మాథ్యూ 46(39), విపుల్ 27(29) పరుగులు చేశారు. గోవా జట్టులోని మల్లిక్‌సాబ్ షిరూర్ 4(42), యోగేష్‌బార్డే 3(43) వికెట్లు తీసుకున్నారు. అనంతరం 283 పరుగులు విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన గోవా జట్టు 47.3 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి పాలయింది. ఆ జట్టులోని వైభవ్ గొవెకర్ 91(82), ఆమెదామ్‌శేఖర్ 51(82), మల్లిక్‌సాబ్ షిరూర్ 45(39) పరుగులు చేశారు. కేరళ జట్టులోని అబ్దుల్ సఫర్ 2(35), ఆశిష్ మాథ్యూ 2(50) వికెట్లు తీసుకున్నారు. గోవాపై కేరళ జట్టు 22 పరుగుల తేడాతో విజయం సాధించి 4 పాయింట్లు దక్కించుకుంది.



జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రాకు స్వర్ణం

పాటియాలా : పాటియాలాలో జరుగుతున్న జాతీయస్థాయి కాంపిటీషన్-1 (నేషనల్ సెలెక్షన్స్)లో నీరజ్ చోప్రా ఘన స్వాగతం పలికాడు. మంగళవారం పాటియాలాలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ మైదానంలో జరిగిన పోటీల్లో స్వర్ణం సాధించాడు. ఆదామ్ ఇండియన్ గ్రాండ్‌ఫిక్స్-1లో జావెలిన్ త్రోను 82.88 మీటర్లు విసిరాడు. విపిన్ కేశన్ 80.04 మీటర్లు విసిరి రెండో స్థానంలో... అమిత్ కుమార్ 77.33 మీటర్లు విసిరి తృతీయ స్థానంలో నిలిచి రజిత, కాంస్య పతకాలను సాధించారు. చాలాకాలం తర్వాత నీరజ్ ఈ జావెలిన్ త్రో పోటీలలో పాల్గొన్నాడు. ఇదే మైదానంలో జరిగిన ఇతర పోటీల్లో పురుషుల విభాగంలో షార్ట్‌పుటర్ తజిందర్ పాల్ 19.95 మీటర్ల విసిరి బంగారు, నవీన్ చిక్కర 19.08తో రజిత, పరంజీత్‌సింగ్ 16.74 మీటర్లు విసిరి కాంస్య పతకాలను సాధించారు.



సారథిగా కోహ్లీ రికార్డ్

పర్యాటక దేశంపై అత్యధిక పరుగులు చేసిన తొలి క్రికెటర్

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)

సారథిగా పర్యాటక దేశంపై అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా కోహ్లి రికార్డ్ సృష్టించాడు. జట్టు సారథిగా విరాట్ కోహ్లి సఫారీ పర్యటనలో టీమిండియా తరపున 14 ఇన్నింగ్స్‌లో 79.18 యావరేజ్‌తో 871 పరుగులు చేశాడు. క్రికెట్ చరిత్రలో విదేశీ పర్యటనలో అత్యధిక పరుగులు సాధించిన తొలి క్రీడాకారుడు సఫారీ జట్టు మాజీ సారథి గ్రామి స్మిత్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత స్థానంలో ఉన్న ఆస్ట్రేలియాకు చెందిన బోర్డర్ రికార్డ్‌ను ప్రస్తుత సఫారీ పర్యటనలో కోహ్లి బ్రద్దలు కొట్టాడు. బోర్డర్ 14 ఇన్నింగ్స్‌లో 785 పరుగులు సాధించగా... చాన్నాళ్ళ తర్వాత ఆ రికార్డ్‌ను కోహ్లి 14 ఇన్నింగ్స్‌లో 871 పరుగులు సఫారీ జట్టుపై సాధించిన బోర్డర్ రికార్డ్‌ను అధిగమించి రెండోస్థానంలో నిలిచాడు. అంతేగాక టీమిండియా తరపున పర్యాటక దేశంపై అత్యధిక పరుగులు చేసిన తొలి క్రీడాకారుడిగా కూడా రికార్డ్ సృష్టించాడు. కోహ్లి సఫారీ పర్యటన మూడు టెస్టుల్లో ఆరు ఇన్నింగ్స్‌లో 286 పరుగులు చేసి అగ్రస్థానంలో ఉండగా... 211 పరుగులు చేసిన ఎబి డివిలియర్స్ రెండోస్థానంలో నిలిచాడు. ఆ తర్వాత జరిగిన ఆరు వన్డేల్లో 186.0 యావరేజ్‌తో 558 పరుగులు చేశాడు. అందులో మూడు సెంచరీలతో సహా మరో మూడుసార్లు అజేయంగా నిలిచాడు. శిఖర్ ధావన్ వ్యక్తిగతంగా 64.60 యావరేజ్‌తో 323 పరుగులు చేసి విరాట్ తర్వాతి స్థానంలో నిలిచాడు. వన్డే సిరీస్‌ను టీమిండియా 5-1తో గెలుచుకున్న విషయం తెలిసిందే. ఇక టీ20ల్లో విరాట్ ఘోరంగా విఫలమయ్యాడు. రెండు మ్యాచ్‌లలో 27 (26+1) పరుగులు మాత్రమే చేశాడు. కానీ ధావన్ మూడు టీ20ల్లో 47.67 యావరేజ్‌తో 143 పరుగులు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. కోహ్లి గాయం కారణంగా మూడో టీ20కి దూరమయ్యాడు.

అత్యధిక పరుగులు సాధించిన ప్రత్యర్థి జట్టు సారథులు...

1) గ్రామి స్మిత్ (ఇంగ్లండ్‌పై) - 16 ఇన్నింగ్స్‌లో - 937 పరుగులు
2) విరాట్ కోహ్లి (దక్షిణాఫ్రికాపై) - 14 ఇన్నింగ్స్‌లో - 871 పరుగులు
3) అలెన్ బోర్డర్ (ఇంగ్లండ్‌పై) - 14 ఇన్నింగ్స్‌లో - 785 పరుగులు
4) అలెస్టర్ కుక్ (భారత్‌పై) - 13 ఇన్నింగ్స్‌లో 768 పరుగులు



సఫారీలకు టీమిండియా ఉదారత!

దక్షిణాఫ్రికా పర్యటన ముగించుకొని భారత్‌కు తిరిగి పయనమయ్యే ముందు టీమిండియా జట్టు తమ ఉదారతను చాటుకుంది. సౌతాఫ్రికా రాజధాని కేప్‌టౌన్‌తో పాటు పలు ప్రాంతాలు తీవ్ర నీటి కొరతను ఎదురుకుంటున్నాయి. ఇటీవల భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య కేప్‌టౌన్ గ్రౌండ్‌ను సిద్ధం చేసుకుందుకు కూడా నీరు లేక నానా ఇబ్బందులు పడ్డారు. అయితే ఈ సమస్యను అర్థం చేసుకున్న భారత జట్టు సఫారీలతో కలిసి రూ.1,00,000 రాండ్స్ (భారత కరెన్సీలో రూ.5.5 లక్షలు) విరాళంగా ఇచ్చింది. న్యూలాండ్స్‌లో జరిగిన ఆఖరి టీ-20 అనంతరం కెప్టెన్ విరాట్ కోహ్లీ, సౌతాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్‌తో కలిసి ఈ చెక్‌ను గిఫ్ట్ ఆఫ్ ది గివర్స్ సంస్థకు అందించారు. అంతేకాక ఆటగాళ్ల జెర్సీలపై వారిచే సంతకాలు తీసుకొని వాటిని వేలం వేసి ఆ డబ్బును నీటి ఎద్దడిని దాటేందుకు ఉపయోగిస్తామని గిఫ్ట్ ఆఫ్ ది గివర్స్ సంస్థ ప్రకటించింది.

నేడు జాతీయస్థాయి బీచ్ కబడ్డీ ఫైనల్స్

ప్రజాశక్తి - బాపట్ల (గుంటూరు జిల్లా)

జాతి సమైక్యతకు క్రీడలు దోహదపడతాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. గుంటూరు జిల్లా బాపట్ల మండలం సూర్యలంక తీరంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి బీచ్ కబడ్డీ పోటీలను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారితో కలిసి మంగళవారం వీక్షించారు. ఈ సందర్భంగా పలు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. పురుషుల విభాగంలో ఉత్తరాఖండ్-జార్ఖండ్‌పై 51-26 పాయింట్లు, రాజస్థాన్ -హిమాచల్ ప్రదేశ్‌పై 51-47, స్త్రీల విభాగంలో తమిళనాడు-ఉత్తరప్రదేశ్‌పై 49-33, చత్తీస్‌గఢ్ -బీహార్‌పై 46- 13 పాయింట్లతో గెలుపొంది క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి. నేడు ఫైల్ పోటీలు జరగనున్నాయి.



బీచ్ కబడ్డీలో తలపడుతున్న జట్లు

శ్రీచరణ్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి- హిరమండలం (శ్రీకాకుళం జిల్లా)

శ్రీలంకలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించిన 17వ అంతర్జాతీయ అండర్-14, 15 కుమిటీ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం, కటా విభాగంలో రజత పతకం సాధించిన బొంగు శ్రీచరణ్‌కు తన స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా హిరమండలంలో మంగళవారం ఘనస్వాగతం లభించింది. గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై వాయిద్యాల నడుమ 130 అడుగుల జాతీయ పతాకంతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు యుఎస్ఎన్.మూర్తి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీచరణ్ మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడలకు వెళ్లటమే తన లక్ష్యమని తెలిపారు.



శ్రీచరణ్‌ను మంగళవాయిద్యాల నడుమ 130 అడుగుల జాతీయ పతాకంతో ఊరేగింపుగా తోడ్కొని వెళ్తున్న గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు



కాటూరివారిపాలెంలో మంచినీటి సమస్యను జగన్‌కు తెలియజేస్తున్న మహిళలు

వైద్య, ఆరోగ్య సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తా : జగన్

ప్రజాశక్తి-పొదిలి

తాను అధికారంలోకి రాగానే వైద్య, ఆరోగ్య శాఖలో ఉన్న సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తానని వైఎస్ఆర్‌సిపి అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి హామీనిచ్చారు. ఆయన చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర ప్రకాశం జిల్లా ఉప్పలపాడుకు 99 వరోజైన మంగళవారం చేరుకున్న సందర్భంగా ఇక్కడి పిహెచ్‌సి సిబ్బంది తమకు ఉద్యోగ భద్రత లేదని, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, యూరోపియన్ ఎఎన్ఎంలు తమను రెగ్యులరైజ్ చేయించాలని జగన్ దృష్టికి తీసుకొచ్చారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుండి ఈ సమస్య గురించి తనకు తెలుసునన్నారు. తొలుత ఆయన ఉదయం 8.30 గంటలకు కాటూరువారిపాలేం నుండి బయలు దేరింది. గ్రామంలో మంచినీటి ఎద్దడి తీవ్రత గురించి గ్రామస్తులు జగన్ దృష్టికి తీసుకెళ్లగా, తాను అధికారంలోకి రాగానే పొదిలి ప్రాంతానికి శాశ్వత మంచినీటి వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.



మాలకొండయ్య చేతుల మీదుగా జాతీయ అవార్డులను అందుకుంటున్న ఆర్టీసీ ఇడి ఎ కోటేశ్వరరావు, కృష్ణా రీజినల్ మేనేజర్ పివి రామారావు.

ఎపిఎస్ ఆర్టీసీకి రెండు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలోని అన్ని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల్లో వివిధ అంశాల్లో సామర్థ్యాల ఆధారంగా అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ (ఎఎస్‌ఆర్‌టియు) అందించే జాతీయ అవార్డుల్లో ఎపిఎస్ ఆర్టీసీ రెండు అవార్డుల్ని దక్కించుకుంది. ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన ఎఎస్‌ఆర్‌టియు 62వ వార్షిక సమావేశంలో కేంద్ర ఉపరితల రవాణా శాఖ కార్యదర్శి యుధ్‌వీర్ సింగ్ మల్లిక్, ఎఎస్‌ఆర్‌టియు ఉపాధ్యక్షులు మాలకొండయ్య చేతుల మీదుగా ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ కోటేశ్వరరావు, కృష్ణా రీజినల్ మేనేజర్ పివి రామారావు ఈ అవార్డుల్ని అందుకున్నారు. 2016-17లో పట్టణ సేవలు, అత్యధిక వాహన ఉత్పాదకత సాధించినందుకు, విజయవాడ సిటీ ఆపరేషన్స్‌లో అత్యధిక కెఎంపిఎల్ సాధించినందుకు గాను ఈ అవార్డుల్ని ఆర్టీసి కైవసం చేసుకుంది. జాతీయ స్థాయిలో అవార్డులు పొందడం పట్ల ఆర్టీసి ఎండి మాలకొండయ్య హర్షాన్ని వ్యక్తం చేశారు. అవార్డులు పొందేందుకు కారణమైన కృష్ణా రీజినల్ మేనేజర్, అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఈ విధానాలనే కొనసాగించాలని, మరిన్ని అవార్డులు పొందేందుకు తమ శక్తి సామర్థ్యాల్ని ప్రదర్శించాలని కోరారు.

స్మగ్లింగ్ ఫుల్లు.. భద్రత నిల్లు..!

అక్రమాలకు అడ్డాగా రైల్వే స్టేషన్లు, పార్శిల్ కార్యాలయాలు
స్కానర్ల ప్రతిపాదనలు బుట్టదాఖలు
పేట్రేగుతున్న అక్రమార్కులు
పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైల్వే జోన్ అయితేనేమీ, స్టేషన్లలో రక్షణ పరికరాల ఏర్పాటు అయితేనేమీ ఆంధ్రప్రదేశ్‌కు అన్నింటా అన్యాయమే జరుగోంది. దేశంలోనే అధిక ఆదాయం వచ్చే రైల్వే స్టేషన్లలో ముందు వరుసలో ఉండే రాష్ట్రంలోని ప్రధాన స్టేషన్లలో ప్రయాణికులకు రక్షణ లేకుండా పోతోంది. రైల్వే ఉన్నతాధికారులు ఇక్కడి స్టేషన్లను కేవలం ఆదాయ వనరులుగా చూస్తున్నారే తప్ప సరియైన రక్షణ చర్యల్ని చేపట్టడంలేదు. దీంతో రాష్ట్రంలోని రైల్వే స్టేషన్ల పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. సరైన భద్రతా చర్యల్ని తీసుకోవడంలో దశాబ్దాలుగా మొండి చెయ్యి చూపడమే ఇందుకు కారణం. ఎ1 స్టేషన్‌లైన విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలతో పాటు చాలా రైల్వే స్టేషన్లలో రక్షణ వ్యవస్థ బలహీన పడుతోంది. దీంతో స్మగ్లింగ్‌కు, అక్రమాలకు అడ్డాగా రైల్వే స్టేషన్లు, పార్శిల్ కార్యాలయాలు మారుతున్నాయి. రాష్ట్ర విభజనానంతరం అమరావతి రాజధాని కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి విజయవాడకు రాకపోకలు పెరిగాయి. బంగారు, వెండి, గంజాయి వంటి వాటితో నక్షత్ర తాబేళ్లు, రెండు తలల పాములు వంటివి తేలిగ్గా రవాణా అవుతున్నాయి. కొన్నిసార్లు ప్రమాదకర ఆయుధాల అక్రమ రవాణా కూడా రైల్వేల ద్వారా నిరాటంకంగా సాగిపోతున్నట్లు సమాచారం.. రెవిన్యూ ఇంటిలిజెన్స్ డైరెక్టరేట్ అధికారులతో పాటు కస్టమ్స్ సిబ్బంది కూడా విజయవాడతో పాటు విశాఖ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సమాచారం వచ్చినప్పుడు మాత్రమే అధికారులు దాడులు చేయడం, అక్రమాలు బయటకు రావడం జరుగుతోంది. పెద్ద ఎత్తున స్మగ్లింగ్ సాగిపోతోందని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక రైల్వే అధికారే వ్యాఖ్యానించడం పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థంచేసుకోవచ్చు. కొందరు అవినీతి సిబ్బందికి తోడు శాఖల మధ్య సమన్వయలేమి అక్రమార్కులకు కలిసివస్తోంది.

రాజకీయ జోక్యం అవసరం..

ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే స్టేషన్లలో రక్షణ వ్యవస్థలు అత్యంత బలహీనంగా ఉన్నాయని, లగేజ్ స్కానర్లను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర నిఘా వర్గాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అధికారులకు సూచించారు. ఎ1 రైల్వే స్టేషన్లతో పాటు పలు ప్రాంతాల్లో స్కానర్లు ఏర్పాటు చేయాల్సిందిగా 2009లోనే రైల్వే బోర్డుకు రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు అందాయి. విజయవాడ, విశాఖపట్నంలలో పైలెట్ ప్రాజెక్టుగా వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. దశాబ్ద కాలం గడుస్తున్నా ఇప్పటి వరకు స్కానర్ల ఏర్పాటు వ్యవహారం ప్రతిపాదనల దశ నుంచి ఒక్క అడుగుకూడా ముందుకు కదల్లేదు. దీనిపై దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ఒక అధికారిని వివరణ కోరగా త్వరలోనే ఏర్పాటు చేసే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. రైల్వే బోర్డుకు చెందిన అంశం కావడంతో పనులు వేగంగా అవ్వాలంటే ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలన్నారు. ప్రజలకు రక్షణ కావాలనుకునే నేతలు పట్టుబట్టి మరీ పనులు చేయించుకోవాలని, ఆ పరిస్థితి రాష్ట్రంలో లేదని సదరు అధికారి అభిప్రాయపడ్డారు. చాలా రాష్ట్రాల్లో చిన్న చిన్న రైల్వే స్టేషన్లలోనూ స్కానర్లు ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు.

కోట్లాది రూపాయిలు లాభాలొస్తున్నా...!

రాష్ట్రంలో సుమారు 20 వరకు చిన్న, మధ్య తరహా రైల్వే జంక్షన్లు, స్టేషన్లు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రధానంగా విజయవాడ రైల్వే స్టేషన్లో రోజుకు 280 రైళ్లతో పాటు 1.40 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అదే విధంగా విశాఖపట్నంలోనూ సుమారు 200 రైళ్లు, లక్ష మంది ప్రయాణికుల్ని గమ్య స్థానాలకు చేరుస్తున్నారు. తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి కూడా లక్షల మంది ప్రయాణిస్తుంటారు. లక్షలాది మంది ప్రయాణిస్తున్నా కనీస రక్షణ ఏర్పాట్లు చేయడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. సరుకు రవాణా, ప్రయాణికుల ద్వారా రాష్ట్రం నుంచి వేల కోట్ల రూపాయిల ఆదాయం రైల్వే శాఖకు సమకూరుతోంది. వచ్చిన ఆదాయంలో కనీసం అరశాతం కూడా భద్రతకు ఖర్చు పెట్టక పోవడంతో రక్షణ వ్యవస్థ నీరుగారిపోతోంది. ఒక్కో స్కానర్ కొనుగోలుకు సుమారు రూ.30 లక్షలు అవసరమవుతాయి. రాష్ట్రం నుంచి వస్తున్న లాభాల దృష్ట్యా రైల్వే శాఖకు ఇదేమీ పెద్ద భారం కాదు. ప్రధాన రైల్వే స్టేషన్లతో పాటు మధ్య తరహా రైల్వే స్టేషన్లలోనూ స్కానర్లు ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నకిలీ ఆదాయ పన్ను అధికారులు అరెస్టు

దొంగతనాలకు గుప్త నిధులు, డబ్బులే కారణం!

ఒక ఇన్నోవా, రెండు బైకులు స్వాధీనం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్(కర్నూలు)

కర్నూలు జిల్లా పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణి గ్రామంలో ఆదాయపన్ను అధికారులమంటు వచ్చి ఇళ్లలో సొమ్ము దోచుకెళ్లిన నిందితులను సోమవారం సాయంత్రం పోలీసులు అదుపులో తీసుకున్నారు. మంగళవారం ఆదోని డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి అంకినీడు ప్రసాద్, కోసిగి సిఐ దైవప్రసాద్ కేసు వివరాలను వెల్లడించారు. ఈ కేసులో 15 మందిని అరెస్టు చేయగా మరికొందరు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. జనవరి 31న మురవణిలో గోవిందు కుటుంబానికి చెందిన మూడు ఇళ్లలో మేము ఆదాయ పన్ను అధికారులమంటూ నమ్మించి అక్కడ సోదాలు నిర్వహించారు. ఇంట్లో ఉన్న పెట్టెలు సోదా చేసి గుప్త నిధుల కోసం వెతికి 138 పది రూపాయల బిళ్లలు, ఒక జత బంగారు కమ్మలు, రెండు జతల బుడేకడ్లు దొంగలించారని తెలిపారు. బోయ వెంకటేష్ వద్ద గుప్త నిధులు ఉన్నాయన్న సమాచారం తెలుసుకున్న కేటుగాళ్లు మూడు బృందాలుగా ఏర్పడి వారి ఇంట్లో మూడుసార్లు ప్రయత్నించి విఫలం చెందారన్నారు. ఈ తతంగంలో సుమారు మూడు బృందాలుగా ఏర్పడి గుప్త నిధులు దొరికాయన్న ఆశతో ఈ కుట్రకు పాల్పడ్డారన్నాని పేర్కొన్నారు. ఈ కేసులో ఓ రాజకీయ పార్టీ నాయకులు మాజీ ప్రజాప్రతినిధి, ఓ ప్రజాప్రతినిధి ప్రముఖులు బంధువులన్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ కేసుకు ఉపయోగించిన ఇన్నోవా కారు, రెండు బైకులతో పాటు దొంగిలించిన సొమ్మంతా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



నందినాటకోత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన 'అగాథం' నాటకంలోని ఓ సన్నివేశం

సామాజికాంశాలతో కళా ప్రదర్శనలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాల ప్రదర్శన విజయవంతంగా కొనసాగుతోంది. కథా వస్తువులుగా సామాజికాంశాలను ప్రదర్శిస్తూ కళ్లకు కళల విందుతో పాటు మెదడు కు ఆలోచన రేకెత్తించేలా ప్రదర్శనలున్నాయి. మంగళవారం రైతు ప్రాధాన్యాన్ని, అనుభవిస్తున్న దైన్యాన్ని వివరించేలా 'జీవామృతం' నాటకాన్ని, ఆడపిల్లల పెళ్లి విషయంలో ఎదురవుతున్న ఇక్కట్లపై 'అగాథం' నాటకాన్ని ప్రదర్శించారు. అనం తరం నీటి ప్రాధాన్యాన్ని, పర్యావరణ పరిరక్షణపై 'పిపాస' నాటికను, పట్టణంపై వ్యామోహం తల్లిదండ్రులను బలితీసుకున్న ఇతివృత్తంతో 'సహప్రయాణం' నాటిక, సమాజంలో జర్నలిస్టు ప్రాధాన్యాన్ని వివరించే 'ఉత్తిష్ట భారతి' నాటికను, సేవా దాతృత్వాన్ని అందరూ కలిగి ఉండాలనే సందేశంతో 'వారసులు' నాటికను ప్రదర్శించారు.



కర్ణాటకకే విజయ్ హజారే ట్రోఫీ

ఫైనల్లో సౌరాష్ట్రపై 41 పరుగుల తేడాతో విజయం

న్యూఢిల్లీ : దేశవాళీ మెగా వన్డే లీగ్ విజయ్ హజారే ట్రోఫీని కర్ణాటక జట్టు గెలుచుకుంది. ఫిరోజ్‌షా కోట్లా మైదానంలో మంగళవారం జరిగిన ఫైనల్లో ఆ జట్టు సౌరాష్ట్ర జట్టును 41 పరుగుల తేడాతో ఓడించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన కర్ణాటక 45.5 ఓవర్లలో 253 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆ జట్టు ఓపెనర్ మయంక్ అగర్వాల్ అత్యధికంగా 90 పరుగులు చేశాడు. సౌరాష్ట్ర బౌలర్ కమ్లేష్ మక్వానకు 4 వికెట్లు లభించాయి. అనంతరం లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సౌరాష్ట్ర జట్టు 46.3 ఓవర్లలో 212 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ప్రసిధ్ కృష్ణ, కృష్ణప్ప గౌతమ్ మూడేసి వికెట్లు పడగొట్టి ఆ జట్టును గెలిపించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కర్ణాటక బ్యాట్స్‌మన్ అగర్వాల్‌కు లభించింది. దీంతో కర్ణాటక జట్టు విజయ్ హజారే ట్రోఫీని ఐదేళ్ల తర్వాత దక్కించుకుంది. సెమీస్‌లో మహారాష్ట్రను కర్ణాటక చిత్తు చేస్తే టోర్నీలో అజేయంగా సెమీస్ చేరిన ఆంధ్రకు సౌరాష్ట్ర చెక్ చెప్పింది.

సచిన్ రికార్డు బ్రేక్ చేసిన అగర్వాల్

ఫిరోజ్‌షా కోట్లా వేదికగా జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో కన్నడ ఓపెనర్ మయంక్ అగర్వాల్ సచిన్ టెండూల్కర్ రికార్డ్‌ను బ్రేక్ చేశాడు. ఈ సిరీస్ మొత్తం మయాంక్ అద్భుతంగా రాణించడమే కాకుండా... దూకుడైన బ్యాటింగ్‌తో పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ సిరీస్‌లో మొత్తం 723 పరుగులు సాధించిన మాయంక్ ఒక 'ఏ క్యాటగిరీ' టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు సాధించిన తొలి భారత ఆటగాడిగా నిలిచాడు. గతంలో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న ఈ రికార్డును అగర్వాల్ బద్దలుకొట్టాడు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68